SAMAYAM

epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

ఫోన్ నెం : 99483 13985/ 89789 80131

సంపుటి: 19 | సంచిక: 155 | ఎడిటర్ : విక్రం కుమార్ | గురువారం 9 ఏప్రిల్ 2026 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 14 | వెల:రూ.10 |



# ఖర్చుగా కాదు భాగస్వామ్యంగా చూడండి

## ప్రాధాన్య రంగాలను మీరే ఎంచుకోండి

### అవసరమైన సహకారం అందిస్తాం

### సీఎస్ఆర్ నిధులపై కంపెనీల ప్రతినిధులతో సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 8 :** సమాజాభివృద్ధికి చేసేది ఖర్చుగా కాకుండా భాగస్వామ్యంగా చూడాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. సీఎస్ఆర్ నిధులకు సంబంధించి వివిధ కార్పొరేట్ కంపెనీల ప్రతినిధులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ కంపెనీలు సీఎస్ఆర్‌కు చేస్తున్న వ్యయం వందకు వంద శాతం సత్ఫలితాలు ఇచ్చేలా ఉండాలన్నారు. తమ ప్రభుత్వం విద్యా, వైద్యం, జల వనరుల సంరక్షణకు ప్రాధాన్యం ఇస్తుందని తెలియజేశారు. కంపెనీలు వీటితో పాటు తమకు ఇష్టమైన ఏ రంగాన్నైనా ఎంచుకొని సీఎస్ఆర్ నిధులు వినియోగించాలని సూచించారు.

మిగతా 2 లో



వివరాలు 2వ పేజీలో

## చేనేతలో టెండర్ల విధానం రద్దు చేయండి

- సీఎం రేవంత్‌తో ఘనా హైకమిషనర్ భేటీ
- సీఎంతో భేటీ అయిన టాటా ఏరోస్ట్రక్చర్ లిమిటెడ్ ఎండీ టిమ్ రైఫిల్

సీఎం రేవంత్ రెడ్డిని రిపబ్లిక్ ఆఫ్ ఘనా హైకమిషనర్ క్వాసి ఒబిరి-డాన్సో మర్యాదపూర్వకంగా కలిశారు. హైకమిషనర్ గా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా హైదరాబాద్ కు వచ్చిన ఆయన ముఖ్యమంత్రి నివాసంలో భేటీ అయ్యారు. ఘనా, తెలంగాణ మధ్య మైత్రీ సంబంధాలు కొనసాగాలని ఆయన ఆకాంక్షించారు.

# ఇరాన్‌తో యుద్ధానికి పక్షం విరామం

### 15 రోజుల సీజ్‌ఫైర్ ప్రకటించిన ట్రంప్

### హర్మూజ్‌పై సుంకాలు విధింపును సమర్థించుకున్న ఇరాన్

4



రోజులుగా పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. అమెరికా-ఇరాన్ మధ్య రెండు వారాల పాటు కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. ఇరాన్‌పై దాడులను రెం డు వారాల పాటు ఆపేస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. ఇరాన్-అమెరికా, ఇజ్రాయెల్ దేశాల మధ్య యుద్ధం తాత్కాలికంగా నిలిచిపోయింది.

ఈ శాంతి కేవలం 'తాత్కాలికమే' అని, యుద్ధం ముగిసిందని ఎవరూ భ్రమపడొద్దని ఇరాన్ సుప్రీం నేత మొజ్తాబా ఖమేనీ ఇచ్చిన హెచ్చరిక ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.



## ఇది యుద్ధానికి ముగింపు కాదు

### మొజ్తాబా ఖమేనీ సంచలనం

### 10న ఇస్లామాబాద్‌లో 'మహా' చర్చలు

.. వివరాలు 4లో



2

## మరో రెండు ఎయిర్‌పోర్టులు

### వరంగల్, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టులకు త్వరలో శంకుస్థాపన

### వెల్లడించిన కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

## పటిష్టంగా రహదారుల నిర్మాణం

### అధికారులకు చంద్రబాబు దిశా నిర్దేశం



**అమరావతి, ఏప్రిల్ 8:** రాష్ట్రంలో ఉన్న 45 వేల కిలోమీటర్ల పైచిలుకు రహదారుల నిర్వహణ పటిష్ఠంగా ఉండాలని సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేశారు. వివిధ ప్రాంతాల్లో భౌగోళిక పరిస్థితులను అధ్యయనం చేసి దాని ఆధారంగా రహదారుల నిర్మాణం జరగాలని సూచించారు. రహదారులు, భవనాలు, రవాణాశాఖపై సచివాలయంలో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై మంత్రులు, అధికారులతో సీఎం చర్చించారు. ప్రధానంగా రాష్ట్రంలో రహదారుల నిర్వహణ,

మిగతా 2 లో






3

## ఏసీబీ పంజా

### ఒకే రోజు ముగ్గురు కీలక అధికారులు అరెస్ట్!

### రూ. 2 లక్షలు తీసుకుంటూ చిక్కిన శంషాబాద్ సీఐ, ఎస్సై

### రిటైర్డ్ టీచర్ ఫైల్ కోసం రూ. 15 వేలు నొక్కిన ఎంఈఓ



## 'ఘోష్' సస్పెన్స్!

### పీసీ ఘోష్ కమిషన్ చెల్లుబాటుపై తీర్పు వాయిదా

### 22న తుది నిర్ణయం వెలువరించనున్న హైకోర్టు

### మాజీ సీఎం కేసీఆర్ సహా పలువురు ప్రముఖుల పిటిషన్లపై ఉత్కంఠ

2

## పైలట్ శిక్షణకు వచ్చిన యువతిపై లైంగికదాడి

### ట్రైనీ ఇన్‌స్ట్రక్టర్ పలుమార్లు అఘాయిత్యం

2

## హరీష్ వనపర్తి పర్యటనకు గ్రీన్ సిగ్నల్

### ఎస్పీ ఆదేశాలను తోసిపుచ్చిన హైకోర్టు



3



# తాగుబోతు ర్యాష్ డ్రైవింగ్ ముగ్గురి మృతి

## వంద మీటర్ల వరకు ఈడ్చుకెళ్లిన కారు

**మృతుల్లో ఇద్దరు ఇంజనీరింగ్ విద్యార్థులు, మరో యువకుడు**

**ఘటనాస్థలంలో విద్యార్థుల భారీ ఆందోళన..**

**హైదరాబాద్, ఏప్రిల్ 8:** ఓ తాగుబోతు డ్రైవర్ సృష్టించిన బీభత్సం అంతా ఇంతా కాదు. మూడు కుటుంబాల్లో కడుపుకోత పెట్టాడు. ముగ్గురు యువకులు దర్మరణం చెందారు. భవిష్యత్‌పై ఎంతో కలలతో ఇంజనీరింగ్‌లో అడుగుపెట్టిన ఇద్దరు విద్యార్థులు అసువులు బాసారు. వివరాల్లోకి వెళితే.. సాగర్ రోడ్డు హస్తినాపురం వద్ద బుధవారం ఉదయం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ముగ్గురు మృతి చెందారు. మద్యం మత్తులో కారు ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ ఓ వ్యక్తి.. ద్విచక్ర వాహనాన్ని, నడిచి వెళ్తున్న మరో యువకుడిని ఢీకొట్టాడు. వీరిని వంద మీటర్ల వరకు ఈడ్చుకెళ్లి కారు పల్టీ కొట్టింది. ఘటనలో ద్విచక్రవాహంపై వెళ్తున్న మహావీర్ ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులు శివ, సందీప్ మృతి చెందారు. రోడ్డుపై నడిచివెళ్తున్న మరో యువకుడు కూడా మృతి చెందాడు. దీంతో కారు డ్రైవర్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ కళాశాల విద్యార్థులు ఆందోళనకు దిగారు. డ్రైవర్‌ను తమకు అప్పగించాలని విద్యార్థులు నినాదాలు చేశారు. పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపు చేశారు. భారీగా పోలీసులు మోవరించడంతో పోలీసులకు విద్యార్థులకు మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. ప్రమాదం చేసిన వ్యక్తిని తమకు అప్పగించాలని విద్యార్థులు రోడ్డుపై ఆందోళనకు దిగారు. ప్రమాదానికి కారణమైన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# పైలట్ శిక్షణకు వచ్చిన యువతిపై లైంగికదాడి

**యువతిపై ట్రైనీ ఇన్‌స్ట్రక్టర్ పలుమార్లు అఘాయిత్యం**



**హైదరాబాద్, ఏప్రిల్ 8:** బేగంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం చోటుచేసుకుంది. ఏవికన్స్ పైలెట్ శిక్షణ సంస్థలో శిక్షణ తీసుకుంటున్న యువతిపై ట్రైనీ ఇన్ స్పెక్టర్ లైంగికదాడికి పాల్పడ్డాడు. అదే సంస్థలో శిక్షణ ఇన్స్ట్రక్టర్‌గా పని చేస్తున్న కేరళకు చెందిన నసిముద్దీన్ యువతిపై లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ కేసులో నసీముద్దీన్ కు సహకరించిన దమ్మాయిగూడ కు చెందిన మరొక శిక్షణ ఇచ్చే ఇన్స్ట్రక్టర్ సల్మాన్. యువతిపై లైంగికదాడి జరిపి వీడియోలు ఫోటోలు తీసుకుని పలుమార్లు బెదిరింపులకు పాల్పడ్డాడు నసీముద్దీన్. ట్రైనింగ్ కోసం వచ్చిన యువతిని మాయ మాటలతో లొంగ దీసుకున్న ట్రైనర్ నసిముద్దీన్. పలు మార్లు వేధింపులకు పాల్పడడంతో యువతి ట్రైనింగ్ ఆపేసింది. 2025 అత్యాచారం జరిగిన ప్రాంతం బేగంపేట పరిధిలో ఉండడం తో బేగంపేట పోలిస్ లకు ఫిర్యాదు చేసింది. జనవరి 2025 నుండి పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డట్లు ఫిర్యాదులో బాధితురాలు పేర్కొన్నది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన బేగంపేట పోలీసులు నసీముద్దీన్ ను అరెస్టు చేసినట్లు తెలిపారు.

# వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్‌పై రాళ్ల దాడి

**తిమ్మాపూర్ వద్ద అంతర్రాష్ట్ర ముఠా బీభత్సం!**

**పోలీసులనే చుట్టుముట్టిన 30 మంది దుండగులు**

**సినీ ఫక్కీలో ఛేజింగ్.. ఇద్దరు మహిళలు అరెస్ట్**

**తిమ్మాపూర్, ఏప్రిల్ 8 :** తెలంగాణలో రైలు ప్రయాణికులను వణికించే ఘటన చోటుచేసుకుంది. ఒడిశా, బిహార్ తరహాలో రైలుపై భారీస్థాయిలో రాళ్లదాడి జరగడం రాష్ట్రంలో కలకలం రేపింది. సికింద్రాబాద్ నుంచి తిరుపతి వెళ్తున్న వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్‌ను లక్ష్యంగా చేసుకుని దుండగులు మెరుపు దాడికి పాల్పడ్డారు. గస్తీ పోలీసులు సకాలంలో స్పందించి ఎదురుదాడి చేయడంతో పెను ప్రమాదం తప్పినప్పటికీ, నిందితులను పట్టుకునే క్రమంలో జరిగిన ఛేజింగ్ ఉత్కంఠ రేకెత్తించింది. తిమ్మాపూర్ రైల్వే స్టేషన్ సమీపంలో ఈ ఘోరం జరిగింది. రైలు వెళ్తున్న సమయంలో ట్రాక్ పక్కన పొదల్లో మాటువేసిన సుమారు 30 మంది దుండగుల ముఠా ఒక్కసారిగా రైలుపై రాళ్ల వర్షం కురిపించింది. కిటికీలు, బోగీలకు రాళ్లు బలంగా తగలడంతో ప్రయాణికులు ఏం జరుగుతుందో తెలియక భయాందోళనలకు గురయ్యారు. సరిగ్గా అదే సమయంలో రైల్వే ట్రాక్ సమీపంలో గస్తీ నిర్వహిస్తున్న పోలీసులు ఆ గుంపును గమనించి అడ్డుకునే ప్రయత్నం చేశారు. ముఠాను పట్టుకునేందుకు పోలీసులు యత్నించగా, ఆ 30 మంది సభ్యులు పోలీసులనే రౌండప్ చేసి దాడికి తెగబడ్డారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో గస్తీ పోలీసులు వెంటనే అదనపు బలగాల సాయం కోరారు. భారీగా పోలీసులు వస్తున్నారని గమనించిన దుండగులు అక్కడి నుంచి పరుగులు తీశారు. పోలీసులు వారిని కిలోమీటర్ల మేర ఛేజ్ చేశారు. నందిగామ మండలంలోని ఎన్‌సీఎల్ వెంచర్ గుండా చీకట్లో పడి నిందితులు తప్పించుకున్నారు. ఈ క్రమంలో ముఠాలోని ఇద్దరు మహిళలు పోలీసులకు చిక్కారు. పట్టుబడిన మహిళలను బిహార్, ఒడిశా లేదా రాజస్థాన్‌కు చెందిన అంతర్రాష్ట్ర ముఠా సభ్యులుగా పోలీసులు అనుమానిస్తున్నారు.

# ఖర్చుగా కాదు.. భాగస్వామ్యంగా చూడండి..

మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వంతో పాటు కంపెనీలు కలిపి చేసే వ్యయంతో తెలంగాణ విద్యార్థులను ప్రపంచ స్థాయి నైపుణ్యం ఉన్న వారిగా తీర్చిదిద్ది భవిష్యత్ అవకాశాలను వారు అందిపుచ్చుకునేలా తయారు చేయగలమని సీఎం అన్నారు. విద్యపై పెట్టే వ్యయాన్ని తాము భవిష్యత్ తరాలపై పెట్టే పెట్టుబడిగా భావిస్తున్నామని సీఎం తెలిపారు. రాష్ట్రంలోని విద్యార్థుల సంఖ్యలో హైదరాబాద్ నగరంలోనే 44 శాతం ఉన్నారని.. వారికి నాణ్యమైన విద్య అందించాల్సిన బాధ్యత మన అందరిపైన ఉందన్నారు. కంపెనీలు స్థానికంగా ఉన్న అన్ని మౌలిక వసతులను వినియోగించు కుంటున్నందున తమ సీఎస్ఆర్ నిధుల్లో ఎక్కువ మొత్తాన్ని అదే ప్రాంత అభివృద్ధికి కేటాయించాలన్నారు. సీఎస్ఆర్ నిధుల వినియోగంలో ఇప్పటి వరకు సరైన విధానం లేనందున తాము ఒక ప్రత్యేక ప్రధాన కార్యదర్శిని ఇందుకు నియమించామని సీఎం తెలిపారు. కంపెనీల ప్రతినిధులు ఆయనతో సమన్వయం చేసుకొని తమకు ఆసక్తి ఉన్న విద్యా, వైద్యం, జల వనరులు, నైపుణ్య శిక్షణ, వారసత్వ కట్టడాల పరిరక్షణ, అడవుల



సంరక్షణ ఇలా దేనికైనా సీఎస్ఆర్ నిధులు వినియోగించవచ్చని సీఎం తెలిపారు. ఇప్పటికే రహేజా గ్రూప్ రూ.50 కోట్లు, రాంకీ గ్రూప్ రూ.50 కోట్లు, యశోద ఫౌండేషన్ రూ.10 కోట్లు విద్యాభివృద్ధికి కేటాయించేందుకు ముందుకు వచ్చాయని.. వారికి సీఎం అభినందనలు తెలిపారు. కంపెనీల ప్రతినిధులు స్పందిస్తూ సీఎస్ఆర్ నిధుల విషయంలో ఇప్పటి వరకు ఇలా ఎవరూ తమను సంప్రదించలేదని తెలిపారు. ఈ విషయంలో చొరవ తీసుకున్నందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అభినందనలు తెలిపారు. పాఠశాల విద్యా, ఆసుపత్రులు, వారసత్వ కట్టడాల పరిరక్షణకు వారు ఆసక్తి చూపారు.. సమావేశంలో రహేజా ఫౌండేషన్ నుంచి శ్రావణ్ కుమార్, రాంకీ ఫౌండేషన్ నుంచి దాక్షయణి ఆళ్ల, యశోద ఆసుపత్రి నుంచి డాక్టర్ గోరుకంటి సురేందర్ రావు, గోరుకంటి ఫల్గుణ్ రావు, మేఘా నుంచి సుధా రెడ్డి, అపోలో ఆసుపత్రి నుంచి అపర్ణా రెడ్డి, కామినేని భాస్కర్ రెడ్డి, ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ నుంచి శేఖర్ రెడ్డి, పగిడిపాటి దేవయ్య, రుద్రమదేవి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, విద్యా శాఖ ప్రత్యేక కార్యదర్శి వెంకటేష్ ధోత్రే, సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ తదితరులు పాల్గొన్నారు.

# చేనేతలో టెండర్ల విధానం రద్దు చేయండి

- సీఎం రేవంత్‌తో ఘనా హైకమిషనర్ భేటీ
- సీఎంతో భేటీ అయిన టాటా ఏరోస్ట్రక్చర్ లిమిటెడ్ ఎండీ టిమ్ రైఫిల్

**హైదరాబాద్, ఏప్రిల్ 8:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఘనా హైకమిషనర్ క్వాసి ఒబిరి-డాన్సో మర్యాదపూర్వకంగా కలిసిన రిపబ్లిక్ ఆఫ్ ఘనా హైకమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారిగా హైదరాబాద్ కు వచ్చిన క్వాసి ఒబిరి-డాన్ సిఎంను ఆయన నివాసంలో కలుసుకున్నారు. ఘనా, తెలంగాణ మధ్య సంబంధాలు కొనసాగాలని ఆకాంక్షించిన హైకమిషనర్. విద్య, శాస్త్ర సాంకేతిక రంగాలు, ఆరోగ్య, వాణిజ్య రంగాల్లో పరస్పర సహకారం ఉండాలని కోరిన హైకమిషనర్. సానుకూలంగా స్పందించిన సీఎం రేవంత ఆయనకు శాలువాతో సన్మానించారు. అలాగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని టాటా ఏరోస్ట్రక్చర్ లిమిటెడ్ ఎండీ టిమ్ రైఫిల్ మర్యాదపూర్వకంగా కలిశారు. భారతదేశంలో ఎఫ్-130ఏ సూపర్ హెర్క్యులస్ ఫైనల్ అసెంబ్లీ లైన్‌ను ఏర్పాటు చేయనున్న లాక్‌హీడ్ మార్టిన్ సంస్థ. అంతర్జాతీయ అవసరాల కోసం భారతదేశంలోని టిఎఎస్ఎల్ లో ఈ-16 వింగ్స్ ను ఉత్పత్తి చేసేందుకు లాక్‌హీడ్ మార్టిన్ సంస్థ ఒప్పందం కుదుర్చుకున్నది. తెలంగాణలో పెట్టుబడులకు ఆసక్తిగా ఉన్నట్లు ఈ సందర్భంగా టిమ్ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు.



# తెలంగాణలో మరో రెండు ఎయిర్‌పోర్టులు

- వరంగల్, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టులకు త్వరలో శంకుస్థాపన
- వెల్లడించిన కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు



**హైదరాబాద్, ఏప్రిల్ 8:** తెలంగాణ ప్రజలకు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు గుడ్ న్యూస్ చెప్పారు. రాష్ట్రంలో మరికొన్ని రోజుల్లో రెండు నూతన విమానాశ్రయాలు నిర్మించబోతున్నట్లు ప్రకటించారు. వరంగల్, ఆదిలాబాద్ జిల్లాల్లో ఎయిర్‌పోర్టులు నిర్మించనున్నట్లు తెలిపారు. వరంగల్ విమానాశ్రయానికి మూడు నెలల్లో శంకుస్థాపన జరగనుందని కేంద్ర మంత్రి శుభవార్త చెప్పారు. అలాగే ఆదిలాబాద్‌లోనూ మరో కొత్త ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేయాలని కేంద్ర రక్షణ శాఖ నిర్ణయం తీసుకుందని రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. ఆదిలాబాద్‌లో రక్షణ శాఖకు చెందిన 360 ఎకరాల్లో నూతన ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేయాలని సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకున్నట్లు కేంద్రమంత్రి రామ్మోహన్ పేర్కొన్నారు. ఈ విమానాశ్రయాన్ని రక్షణ శాఖ నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు చెప్పారు. రక్షణ శాఖకు సంబంధించి శిక్షణ కోసం ఈ విమానాశ్రయాన్ని వినియోగించు కోవాలని కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రతిపాదించినట్లు రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. అదే విమానాశ్రయంలో పౌర విమానయాన శాఖ టెర్మినల్ నిర్మాణం చేసుకునేందుకు రక్షణ మంత్రి అంగీకారం తెలిపారని ఆయన చెప్పారు. రక్షణ శాఖ అవసరాలతోపాటు సాధారణ విమాన సర్వీసులు కూడా నిర్వహించేందుకు నిర్ణయం తీసుకున్నట్లు కేంద్రమంత్రి రామ్మోహన్ తెలిపారు. ఈనెల 17వ తేదీన అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం రక్షణ శాఖ తుది నిర్ణయం తీసుకోనున్నట్లు ఆయన వెల్లడించారు. త్వరలోనే వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాల నిర్మాణం ప్రారంభం కానుందంటూ తీపి కబురు చెప్పారు. సుమారు 430 ఎకరాలుంటే ఎయిర్ బస్ రాకపోకలకు వీలుగా విమానాశ్రయం ఏర్పాటు చేసే అవకాశం ఉంటుందని చెప్పారు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు. ఇదే విషయంపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పందించారు. వరంగల్ విమానాశ్రయానికి సంబంధించి కేంద్రం కీలక నిర్ణయం తీసుకుందని చెప్పారు. ఆదిలాబాద్‌లో డిఫెన్స్ ఎయిర్ స్ట్రిప్ ఉందని.. ఆ స్థలంలో నూతన విమానాశ్రయం కట్టాలని చాలాకాలంగా డిమాండ్ ఉందని చెప్పుకొచ్చారు. ఈ విషయంపై కేంద్ర రక్షణ మంత్రి రాజ్ నాథ్, విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుతో కలిసి చర్చించినట్లు కిషన్ రెడ్డి తెలిపారు.

# కాళేశ్వరం విచారణపై కొనసాగుతున్న 'ఘోష్' సస్పెన్స్!

**పీసీ ఘోష్ కమిషన్ చెల్లుబాటుపై తీర్పు వాయిదా**

**22న తుది నిర్ణయం వెలువరించనున్న హైకోర్టు**

**మాజీ సీఎం కేసీఆర్ సహా పలువురు ప్రముఖుల పిటిషన్లపై ఉత్కంఠ**

**హైదరాబాద్, ఏప్రిల్ 8:** కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై విచారణ జరుపుతున్న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ భవితవ్యంపై ఉత్కంఠ కొనసాగుతోంది. ఈ కమిషన్ ఏర్పాటును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై తెలంగాణ హైకోర్టు బుధవారం కీలక నిర్ణయం తీసుకుంది. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై హైకోర్టు తీర్పును ఈ నెల 22కు వాయిదా వేసింది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణం, నిర్వహణల్లో అవకతవకలపై విచారణ నిమిత్తం ఏర్పాటు చేసిన జస్టిస్ ఘోష్ కమిషన్‌పై దాఖలైన పిటిషన్‌లపై ఇప్పటికే కోర్టు వాదనలు విన్నది. బుధవారం తీర్పు వెలువరించాల్సి ఉండగా.. తీర్పును వాయిదా వేసింది. జస్టిస్ పి.సి.ఘోష్ కమిషన్‌ను నియమిస్తూ ప్రభుత్వం 2024 మార్చి 14న జీవో 6ను జారీ చేసింది. దీన్ని సవాలు చేస్తూ భారాస అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి టి.హరీశ్‌రావు, ఐఏఎస్ అధికారి స్మితా సభర్వాల్, ఐఏఎస్ మాజీ అధికారి ఎస్.కె.జోషిలు వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం.మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం సుదీర్ఘ విచారణ చేపట్టింది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణం, నిర్వహణలో జరిగిన అవకతవకలపై విచారణకు తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ చెల్లుబాటుపై హైకోర్టులో వాదనలు ముగిశాయి. అయితే, ఈ వ్యవహారంపై తీర్పును ధర్మాసనం ఈ నెల 22వ తేదీకి వాయిదా వేసింది. కాళేశ్వరం అవకతవకలపై విచారణ కోసం 2024 మార్చి 14వ తేదీన ప్రభుత్వం జీవో నంబర్ 6ను జారీ చేస్తూ జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను నియమించింది. ఈ జీవోను సవాల్ చేస్తూ రాష్ట్రంలోని పలువురు కీలక నేతలు, అధికారులు హైకోర్టును ఆశ్రయించారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ చేపట్టిన విచారణ ప్రక్రియలో నిబంధనల ఉల్లంఘనలు జరిగాయని పిటిషనర్లు పేర్కొన్నారు. తమపై అభియోగాలు మోపే ముందు, తమ వాదనలను కమిషన్ పరిగణనలోకి తీసుకోలేదని ఆరోపించారు. సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధంగా విచారణ సాగుతోందని వారు కోర్టుకు విన్నవించారు.



ప్రజా ప్రయోజనాల దృష్ట్యా, కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన లోపాలను వెలికితీసేందుకే జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. కమిషన్ తన నివేదికను అందుబాటులో ఉన్న రికార్డుల ఆధారంగానే సిద్ధం చేసిందని కోర్టుకు తెలిపింది. విచారణలో భాగంగా పిటిషనర్లందరికీ నోటీసులు ఇచ్చి, నిబంధనల ప్రకారమే ముందుకు వెళ్తున్నామని, కాబట్టి ఈ పిటిషన్లను కొట్టివేయాలని ప్రభుత్వం కోరింది. చీఫ్ జస్టిస్ నేతృత్వంలోని బెంచ్ ఇరుపక్షాల వాదనలను సుదీర్ఘంగా విన్న తర్వాత, నేడు వెలువరించాల్సిన తీర్పును ఈ నెల 22వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది.



# ఏసీబీ పంజా..

**ఒకే రోజు ముగ్గురు కీలక అధికారులు అరెస్ట్!**

**రూ. 2 లక్షలు తీసుకుంటూ చిక్కిన శంషాబాద్ సీఐ, ఎస్సై**

**రిటైర్డ్ టీచర్ ఫైల్ కోసం రూ. 15 వేలు నొక్కిన ఎంఈఓ**

**హైదరాబాద్, ఏప్రిల్ 8:** ఏసీబీ అధికారులు మరో ఇద్దరు ప్రభుత్వ అధికారులు చిక్కారు. ఉదయం మహబూబాబాద్ మండలం గూడురు గ్రామంలో ఎంఈవో, స్కూల్ అసిస్టెంట్ లంచం తీసుకుంటూ పట్టుబడగా తాజాగా శంషాబాద్ పరిధిరో సర్కిల్ ఇన్స్‌పెక్టర్, సబ్ ఇన్స్‌పెక్టర్ ఏసీబీ వలకు చిక్కారు. శంషాబాద్ పరిధిలోని రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన కేసులో అరెస్టు చేయకుండా కేసు నుంచి తప్పించడానికి లంచం తీసుకున్న ఇద్దరు పోలీసు అధి కారులను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. రాజీవ్ గాంధీ విమానశ్రయం పోలీసు అవుట్ పోస్టులో సీఐగా పనిచేస్తున్న యూ.కె సిద్దేశ్వర్, ఎస్సై సంపతి కనకయ్య రూ. 2 లక్షలు తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఓ కేసులో చార్జిషీట్, అరెస్టు చేయకుండా చూడాలని బాధితుడు కోరగా వారు రూ. 5 లక్షలు డిమాండ్ చేశారు. ఇందులో మొదటి విడతగా 2 లక్షలు ఒప్పందం జరిగి లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. ఇద్దరిని అరెస్టు చేసి నాంపల్లి కోర్టులో హాజరు పరిచారు.

**మహబూబాబాద్ జిల్లాలో హెడ్మాస్టర్**

**మహబూబాబాద్:** ఉపాధ్యాయుడు లంచావతారమెత్తాడు. ఏకంగా హెడ్మాస్టర్ లంచం తీసుకోవడంతో చర్చనీయాంశమైంది. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లాలో చోటుచేసుకుంది. గూడూరు మండలం అయోధ్యపురంలో పాఠశాల ప్రధానోపాధ్యాయున్ని రూ.15 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. ఇన్చార్జ్ ఎంఈఓగా వ్యవహరిస్తున్న రవికుమార్ టీచర్ ఫైల్ క్లియర్ చేయడం కోసం డబ్బులు డిమాండ్ చేశారు. బాధితుడు రూ.15000 లంచమిస్తూ ఏసీబీ అధికారులకు సమాచారం ఇవ్వడంతో లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు హెడ్మాస్టర్ ను పట్టుకున్నారు. రిటైర్డ్ కాబోయే ఉపాధ్యాయుడి నుంచి ముడుపులు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులకు హెడ్మాస్టర్ పట్టుబడడంతో కలకలం రేపింది. విచారణ కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు.

# హరీష్ పర్యటనకు గ్రీన్ సిగ్నల్

**జిల్లా ఎస్పీ ఆదేశాలను తోసిపుచ్చిన హైకోర్టు**

**హైదరాబాద్, ఏప్రిల్ 8:** సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు వనపర్తి పర్యటనకు తెలంగాణ హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. హరీశ్ రావుకు వనపర్తి జిల్లాలో పర్యటించేందుకు అనుమతినిస్తూ ఆదేశాలు జారీ చేసింది. హరీశ్ రావు పర్యటనకు అనుమతి లేదన్న జిల్లా ఎస్పీ ఆదేశాలను కొట్టివేస్తూ తీర్పునిచ్చింది. గొల్లపల్లి రిజర్వాయ-ర్‌ను వ్యతిరేకిస్తూ స్థానిక రైతులు ఆందోళన చేపట్టిన సంగతి తెలిసిందే. అయితే, వారికి మద్దతుగా మాజీ మంత్రి అక్కడి పర్యటించి భారీ బహిరంగ సభ పెట్టాలని నిర్ణయించారు. ఈ సభకు తొలుత జిల్లా ఎస్పీ అనుమతులు ఇచ్చారు. అనంతరం అకస్మాతుగా అనుమతులు రద్దు చేస్తున్నట్లు బుధవారం నాడు ప్రకటించారు. దీనిపై ఆగ్రహించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు.. తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. తొలుత అనుమతులు ఇచ్చి ఆపై నిరాకరించారంటూ పిటిషన్ వేశారు. సభకు అనుమతులు ఇప్పించాలని న్యాయస్థానాన్ని కోరారు. దీనిపై నేడు ధర్మాసనం విచారణ చేపట్టగా.. శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందనే హరీశ్ రావుకి అనుమతి నిరాకరించినట్లు పోలీసుల తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తెచ్చారు. ముందస్తు అనుమతి తీసుకున్నా చివరి నిమిషంలో నిరాకరించారని హరీశ్ రావు తరఫు న్యాయవాది తెలిపారు. ఇరువర్గాల వాదనలు విన్న ధర్మాసనం సభకు పర్మిషన్ ఇస్తూ ఆదేశాలిచ్చింది.

# కోర్టు తీర్పు వచ్చే వరకు ఆగలేరా

**అప్పడే వెళ్లి రైతులను వేధించాలా**

**హైడ్రా తీరుపై మండిపడ్డ మందకృష్ణ మాదిగ**

**సంగారెడ్డి, ఏప్రిల్ 8 :** ఐలాపూర్‌లోని సర్వే నంబర్ -1 నుంచి 220 వరకు గల 1265 ఎకరాల భూమి భూ వివాదంలో పేద రైతులను హైడ్రా ఇబ్బంది పెట్టడం సరికాదని మందకృష్ణ మాదిగ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వివాదాస్పద భూములతో సంబంధం లేని రైతులను భయభ్రాంతులకు గురిచేయటం దారుణమని మంద కృష్ణ మాదిగ చెప్పారు. కోర్టు పరిధిలో ఉన్న కేసుల్లో తీర్పు వచ్చేంతవరకు హైడ్రా అధికారులు సంయమనం పాటించాలని సూచించారు. ఈ మేరకు హైడ్రాపై ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు, పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ షాకింగ్ కామెంట్స్ చేశారు. బుధవారం అమీన్ పూర్ మండలం ఐలాపూర్ గ్రామంలోని వివాదంలో ఉన్న భూముల రైతులను మంద కృష్ణ మాదిగ, హైకోర్టు అడ్వకేట్ ముఖీం పరామర్శించారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాదిగ మాట్లాడారు. కోర్టు పరిధిలో లేని భూములకు సంబంధించిన రైతుల జోలికి హైడ్రా, రెవెన్యూ అధికారులు రావొద్దని కోరారు. రైతులకు ఉన్న లీగల్ హక్కులకు భంగం వాటిల్లితే సహించబోమని హెచ్చరించారు. ఏదైనా కోర్టు పరిధిలో పెండింగ్‌లో ఉన్న కేసు విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా దృష్టి పెడితే ఏ సమస్య ఉండదని తెలిపారు. హైడ్రా తన పరిధిలో పనిచేస్తుందా, అతిక్రమిస్తుందా అనే ఆంశంపై ఒకసారి ముఖ్యమంత్రి పరిశీలించాలని అన్నారు. హైడ్రా పరిధిలో ఉన్న భూ వివాదాలు పరిష్కారానికి ప్రత్యేక కోర్టు అవసరం ఉందని చెప్పుకొచ్చారు. హైడ్రా అనవసర జోక్యంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రమేయం ఉందనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని మంద కృష్ణ మాదిగ పేర్కొన్నారు.



# కాళేశ్వరం మోటర్లపై కుట్ర?

- మంత్రి ఉత్తమ్‌కు హరీశ్ రావు లేఖ
- అశాస్త్రీయ నిర్వహణతో పంపులు దెబ్బతినే ప్రమాదం
- రాజకీయాల కోసం ప్రాజెక్టులను పాడు చేయొద్దని హెచ్చరిక



**హైదరాబాద్, ఏప్రిల్ 8:** కాళేశ్వరానికి సంబంధించిన భారీ నీటిపారుదల మోటర్లను ధ్వంసం చేసే కుట్ర సాగుతోందంటూ మాజీ మంత్రి హరీశ్ రావు ధ్వజమెత్తారు. ప్రాజెక్టుల నిర్వహణలో కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై బీఆర్ఎస్ నేత ఆగ్రహం వ్యక్తం చేస్తూ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. భారీ మోటర్లను నిబంధనలకు విరుద్ధంగా పదే పదే ఆన్, ఆఫ్ చేస్తూ అశాస్త్రీయంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఇలా చేయడం వల్ల పంపుల పనితీరు దెబ్బతినే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

**నిర్లక్ష్యమా.. కుట్రనా?**

పదే పదే మోటర్లను ఆపడం వల్ల వైబ్రేషన్స్ వచ్చి పంపులు, ఇంపల్లర్స్ వంటివి పాడయ్యే ప్రమాదం ఉందని హరీశ్ రావు హెచ్చరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై నెపం నెట్టేందుకే ఉద్దేశపూర్వకంగా మోటర్లను పాడు చేస్తున్నారా అని ప్రశ్నించారు. ఇది ప్రభుత్వ పాలనాపరమైన నిర్లక్ష్యమా లేక కావాలనే చేస్తున్న కుట్రనా అని నిలదీశారు. చందలాపూర్ సహా ప్యాకేజీ 6, 8, 10, 11, 12లలో మోటర్ల ఆపరేషన్ తీరు తీవ్ర అభ్యంతరకరమని తెలిపారు. వేల కోట్ల ప్రజాధనంతో నిర్మించిన ప్రాజెక్టులను ఇలా నిర్లక్ష్యంగా వాడటం శోచనీయమని మండిపడ్డారు.

**ప్రాజెక్టులతో చెలగాటం వద్దు**

తక్షణమే మోటర్లను పదే పదే ఆన్, ఆఫ్ చేసే అశాస్త్రీయ విధానాన్ని ప్రభుత్వం మానుకోవాలని ఆయన సూచించారు. ఇంజనీరింగ్ నిబంధనల ప్రకారం, డిజైన్ కు అనుగుణంగా నిరంతరాయంగా పంపులు నడిపించాలని తెలిపారు. రాజకీయాల కోసం తెలంగాణ రైతుల జీవనాడి అయిన ప్రాజెక్టులతో చెలగాటం ఆడవద్దని హెచ్చరించారు. భారీ మోటర్లు నిరంతరాయంగా నడిచేలా డిజైన్ చేసినవని, పదే పదే ఆపితే తీవ్ర నష్టం తప్పదని హరీశ్ రావు స్పష్టం చేశారు.


# ప్రధాని వ్యూహాలు అమోఘం

- నితిన్ నబీన్ నియామకంపై లక్ష్మణ్ ఆసక్తికర వ్యాఖ్యలు
- వచ్చే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో గెలుపు మాదేనని ధీమా

**హైదరాబాద్, ఏప్రిల్ 8:** ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల అనంతరం తెలంగాణపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తామని బీజేపీ రాజ్యసభ సభ్యుడు కె. లక్ష్మణ్ ప్రకటించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో పరిస్థితులు అనుకూలంగా ఉన్నప్పటికీ.. రేవంత్ రెడ్డి వైపు గాలి వీచిందని ఆయన పేర్కొన్నారు. బుధవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో జరిగిన ఇష్టాగోష్టిలో ఆయన పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ప్రధాని మోదీ ఆలోచనలు ఎవరికీ అందవని, రెండో వ్యక్తికి కూడా తెలియని విధంగా ఆయన నిర్ణయాలు ఉంటాయని తెలిపారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా నితిన్ నబీన్‌ను ఎంపిక చేస్తారని ఎవరూ ఊహించలేదని, ఇది అందరినీ ఆశ్చర్యపరిచిన విషయమని లక్ష్మణ్ వివరించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ తిరిగి నిలబడటం అంత సులభం కాదని ఆయన అభిప్రాయపడ్డారు.

**కవిత ప్రశ్నలు.. హేట్ స్పీచ్ పై నిలదీత**

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అడుగుతున్న ప్రశ్నలకు ఎవరూ సమాధానం చెప్పడం లేదని లక్ష్మణ్ గుర్తు చేశారు. అయితే ఆమె ఇప్పుడు ప్రస్తావిస్తున్న అంశాలను బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడే మాట్లాడి ఉంటే బాగుండేదన్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయాన్ని ఎవరూ ఊహించలేదని, తెలంగాణ ప్రజలు కూడా ఎంతో తెలివైన వారని కొనియాడారు. లోక్ సభ ఎన్నికల్లో ఎనిమిది సీట్లు రాగా.. ప్రజలు ముప్పై ఎనిమిది శాతం ఓట్లు కట్టబెట్టారని గుర్తు చేశారు. రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీజేపీదే పైచేయి అవుతుందని జోస్యం చెప్పారు. మహిళా బిల్లు, డీలిమిటేషన్ తర్వాత దేశమంతా ఏకపక్షంగా మారుతుందని పేర్కొన్నారు. తమిళనాడులో విజయ్ పార్టీకి జనం వస్తున్నా.. ఐదారు సీట్ల కంటే ఎక్కువ రావని అన్నారు. హేట్ స్పీచ్ బిల్లు తెస్తామన్న సీఎం రేవంత్ రెడ్డి.. ముస్లింలను రెచ్చగొట్టే వ్యాఖ్యలపై ఎందుకు మౌనంగా ఉన్నారని ఆయన నిలదీశారు. ఇది హేట్ స్పీచ్ కాదా అని సీఎంను సూటిగా ప్రశ్నించారు.



# కాంగ్రెస్‌కు తెలంగాణే ఏటీఎం!

**ఢిల్లీకి గులాంగిరీ చేస్తోన్న రేవంత్ ప్రభుత్వం**

**ఏప్రిల్ 25న చరిత్రను మారుస్తాం: కవిత**



**హైదరాబాద్, ఏప్రిల్ 8:** దేశంలో ఎక్కడ ఎన్నికలు వచ్చినా సరే కాంగ్రెస్‌కు తెలంగాణ ఏటీఎంగా మారిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్రంగా విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఢిల్లీకి ఘోరమైన గులాంగిరి చేస్తోందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఫోన్ చేస్తే ఫోన్‌లో మాట్లాడేటప్పుడు కూడా రేవంత్‌రెడ్డి నిలబడే మాట్లాడుతున్నారని.. లేదంటే తన కుర్చీకి ఎక్కడ ఎసరు వస్తుందోనని భయపడుతున్నారని సెటైర్లు గుప్పించారు. బుధవారం తెలంగాణ జాగృతిలో నడిగడ్డ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు గొంగళ్ల రంజిత్ కుమార్, ఆయన అనుచరులు చేరారు. కండువా కప్పి జాగృతిలోకి కవిత ఆహ్వానించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడారు. రాసి పెట్టుకోండి.. తెలంగాణ భవిష్యత్, చరిత్రను మార్చే రోజు ఏప్రిల్ 25 అవుతోందని కవిత ఉద్ఘాటించారు. కొత్త నెత్తురు, కొత్త రాజకీయాలను ఈ గడ్డకు పరిచయం చేస్తానని పేర్కొన్నారు. రాష్ట్రంలో అధికార పక్షం కాంగ్రెస్, ప్రతిపక్షం బీఆర్ఎస్ ప్రజల సమస్యలను ఎందుకు పట్టించుకోవటం లేదని ప్రశ్నించారు. ప్రజల సమస్యల గురించి ప్రశ్నించేదెవరు అంటే ప్రతినోట జాగృతియే అనే మాట వస్తోందని చెప్పారు. ప్రజల సమస్యల గురించి కాంగ్రెస్ హైకమాండ్‌ని పైసలు అడిగితే నో రాహుల్ జీ అని రేవంత్‌రెడ్డికి సమాధానం చెబుతున్నారని అన్నారు. కానీ కేరళ ఎన్నికల కోసం ఎంత ఖర్చయినా పెడుతున్నారని విమర్శించారు. అప్పర్ తుంగభద్రకు కేంద్ర ప్రభుత్వం జాతీయ హోదా ఇస్తే రేవంత్‌రెడ్డి ఎందుకు సైలెంట్‌గా ఉన్నారని ప్రశ్నించారు. జాతీయ హోదా కారణంగా తుంగభద్రకు నీళ్లు రాక నష్టపోయేది ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాయేనని.. కానీ ఈ విషయంలో రేవంత్‌రెడ్డి ఎందుకు మోదీ ప్రభుత్వాన్ని ప్రశ్నించడం లేదని నిలదీశారు. అటు కాంగ్రెస్‌ను, ఇటు బీజేపీని మెయింటెయిన్ చేస్తూ ప్రజలను మాత్రం మోసం చేస్తున్నారని ఆగ్రహించారు. తెలంగాణ జాగృతి తరఫున వచ్చే పార్టీ.. ప్రజల సమస్యలపై పోరాటం చేస్తుందని భరోసా కల్పించారు. అంతర్జాతీయ స్థాయిలో నిపుణులతో సమావేశమై ప్రజల కోసం అద్భుతమైన అజెండా రూపొందిస్తున్నానని చెప్పుకొచ్చారు. కొత్త తరహా రాజకీయాలు, ప్రజల కోసం మంచి చేసే రాజకీయాలు ఎలా ఉంటాయో చూపిస్తామని కవిత పేర్కొన్నారు.



# తెలంగాణ భవన్ ముట్టడి.. ఉద్రిక్తత!

**హైదరాబాద్, ఏప్రిల్ 8:** తెలంగాణ భవన్ వద్ద బుధవారం భారీ ఉద్రిక్తత చోటుచేసుకుంది. తమ సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ సభ్యులు బిఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ముట్టడించారు. కార్యాలయం లోపలికి దూసుకెళ్లేందుకు ప్రయత్నించిన ఆందోళనకారులను పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య గందరగోళం, తోపులాట జరగడంతో వాతావరణం వేడెక్కింది. పరిస్థితి అదుపు తప్పకుండా అధికారులు అదనపు బలగాలను అక్కడ మోహరించారు. పోలీసుల తీరుపై జేఏసీ నేతలు మండిపడ్డారు. ఉద్యమకారులను బిఆర్ఎస్ పార్టీ పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వం దగ్గర తమ సమస్యల గురించి బిఆర్ఎస్ ఎందుకు గళం విప్పడం లేదని ప్రశ్నించారు. కార్యాలయం వద్ద బైఠాయించి ఆందోళన చేపట్టడంతో ఉత్కంఠ నెలకొంది. తమ ఇబ్బందులను పట్టించుకోని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఖచ్చితంగా తమ గోడు వినాలంటూ భవన్ వద్ద నినాదాలు చేశారు.

# జగిత్యాల పాలిటిక్స్‌లో బిగ్ ట్విస్ట్

**నేడు జీవన్ రెడ్డి ఇంటికి కేటీఆర్!**



**జగిత్యాల, ఏప్రిల్ 8:** తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక పరిణామం చోటుచేసుకోబోతోంది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ బుధవారం జగిత్యాల జిల్లా కేంద్రంలో పర్యటించనున్నారు. అయితే, ఈ పర్యటన కేవలం పార్టీ కార్యకలాపాలకే పరిమితం కాకుండా, ఒక సంచలన భేటీకి వేదిక కాబోతుండటం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఇటీవలే కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన సీనియర్ నాయకులు, మాజీ మంత్రి టి. జీవన్ రెడ్డితో కేటీఆర్ భేటీ కానుండటం రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తోంది. గత కొంతకాలంగా కాంగ్రెస్ నాయకత్వంపై అసంతృప్తితో ఉన్న జీవన్ రెడ్డి, రాజీనామా అనంతరం సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యంగా తీవ్ర విమర్శలు చేస్తున్నారు. స్థానికంగా బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ఆయన నిరసన కార్యక్రమాల్లో పాల్గొనడంతోనే ఆయన పార్టీ మారతారనే ఊహాగానాలు మొదలయ్యాయి. నేటి పర్యటనలో భాగంగా కేటీఆర్ నేరుగా జీవన్ రెడ్డిని కలిసి, ఆయనను అధికారికంగా బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించనున్నట్లు పార్టీ వర్గాల సమాచారం. ఉత్తర తెలంగాణలో బలమైన పట్టున్న జీవన్ రెడ్డి వంటి నేత పార్టీలోకి వస్తే, అది బీఆర్ఎస్‌కు కొండంత అండగా మారుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. కేటీఆర్ రాక సందర్భంగా జగిత్యాల పట్టణంలో పండుగ వాతావరణం నెలకొంది. జీవన్ రెడ్డి అనుచరులు కూడా ఈ పర్యటనపై ఎంతో ఆసక్తిగా ఉన్నారు. ఒకవేళ జీవన్ రెడ్డి గూలాబీ తీర్థం పుచ్చుకుంటే, ఆయన ఎప్పుడు జెండా పడతారనే విషయంపై నేడు స్పష్టత వచ్చే అవకాశం ఉంది. కేటీఆర్ పర్యటనతో జగిత్యాల జిల్లా రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి.



సంపాదకీయం

# ప్రపంచాన్ని బలి చేసిన 'ట్రంప్' యుద్ధోన్మాదం

## అమెరికా ఆధిపత్య కాంక్షకు సామాన్యులే బలి!

అగ్రరాజ్యం తన ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవడానికి చేసే ప్రయత్నాలు సామాన్య దేశాలకు శాపంగా మారుతున్నాయి. అమెరికా-ఇజ్రాయిల్‌ల యుద్ధ కాంక్ష వల్ల ఇరాన్ చితికిపోవడమే కాదు, ప్రపంచమంతా చమురు సెగతో విలవిల్లాడుతోంది. తాత్కాలిక కాల్పుల విరమణ కాదు, శాశ్వత శాంతే ప్రపంచానికి అవసరం. రాజకీయ ప్రయోజనాల కోసం దేశాల మధ్య చిచ్చు పెట్టడం అగ్రరాజ్యాలకు అలవాటుగా మారింది. అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరియు ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహూల నిరంకుశ వైఖరి వల్ల మధ్యప్రాచ్యం అగ్నిగుండంగా మారింది. ఇరాన్‌పై బాంబు దాడులు చేయడం, ఆ దేశ అత్యున్నత నేత అయతుల్లా ఆలీ ఖమేనీని లక్ష్యంగా చేసుకోవడం ద్వారా అమెరికా సాధించింది శూన్యం. కానీ, ఈ యుద్ధ జ్వాలలు సృష్టించిన విధ్వంసం మాత్రం ప్రపంచ ఆర్థిక వ్యవస్థను కుదేలు చేసింది.

### చమురు దౌత్యం.. డాలర్ ఆధిపత్యం

అమెరికా ఇరాన్‌పై దాడికి దిగడం వెనుక కేవలం రాజకీయ కారణాలే లేవు, ప్రధానంగా ముడి చమురుపై పెత్తనం మరియు 'డాలర్' సర్వాధిపత్యాన్ని కాపాడుకోవాలన్న తాపత్రయం కనిపిస్తోంది. వెనెజువెలా తరవాత ఇరాన్‌ను లొంగదీసుకోవడం సులభమని భావించిన ట్రంప్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఇరాన్ ప్రతిస్పందనగా హోర్ముజ్ జలసంధిని మూసివేయడంతో ప్రపంచ చమురు సరఫరా అస్తవ్యస్తమైంది. ప్రపంచ ముడి చమురు రవాణాలో 20 శాతం కేవలం ఈ చిన్న జలసంధి ద్వారానే జరుగుతుంది. దీనిని మూసివేయడం అంటే ప్రపంచ ఆర్థిక నరాలను తెంచడమే. రవాణాకు ఆటంకం ఏర్పడటంతో ముడి చమురు ధరలు ఆకాశాన్ని తాకాయి. చమురు ధరల్లో స్వల్ప మార్పు వచ్చినా అది రవాణా, విద్యుత్, ఉత్పత్తి రంగాలపై పెను ప్రభావం చూపుతుంది. నేడు విమాన ప్రయాణాలు భారంగా మారడం నుంచి అంతర్జాతీయ విమానాలు రద్దు కావడం వరకు అన్నీ ఈ యుద్ధోన్మాద ఫలితాలే.

### ద్రవ్యోల్బణం: మూడవ ప్రపంచ దేశాల పాలిట శాపం

ఈ యుద్ధం వల్ల ధనిక దేశాల కంటే ఆసియా, ఆఫ్రికా వంటి మూడవ ప్రపంచ దేశాలే ఎక్కువగా నష్టపోతున్నాయి. చమురు ధరలు పెరగడంతో డాలర్ విలువ పెరిగి, స్థానిక కరెన్సీల విలువ పడిపోతోంది. ఫలితంగా ద్రవ్యోల్బణం పెరిగి సామాన్యుడి కొనుగోలు శక్తి హరించుకుపోతోంది. కేవలం చమురు మాత్రమే కాదు, దాని ఆధారిత ఉత్పత్తులైన ఎరువుల కొరత ఏర్పడి, వ్యవసాయ రంగం సంక్షోభంలో పడింది. ఇది ఆహారధాన్యాల కొరతకు దారి తీసి, శ్రామిక ప్రజానీకాన్ని ఆకలి కోరల్లోకి నెట్టే ప్రమాదాన్ని సూచిస్తోంది. డాలర్ విలువ ముడిచమురుతో ముడిపడి ఉంది. డాలర్ ఆధిపత్యాన్ని కాపాడుకోవడానికి అమెరికా చేస్తున్న ప్రయత్నాలు పెట్టుబడిదారీ ప్రపంచ స్థిరత్వాన్నే ప్రమాదంలో పడేస్తున్నాయి. చమురు-డాలర్ ప్రమాణాన్ని నిలబెట్టుకోవడం కోసం చమురు ఉత్పత్తి దేశాలపై రాజకీయ ఆధిపత్యాన్ని చెలాయించడానికి అమెరికా పూనుకుంటోంది.

### బెడిసికొట్టిన వ్యూహం.. మేల్కొని ప్రపంచం

ఇరాన్‌లో తమకు అనుకూలమైన కొత్తు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలన్న అమెరికా వ్యూహం పూర్తిగా బెడిసికొట్టింది. ఏకపక్ష దాడులు చేస్తే ఎదురుదాడులు తప్పవని ఇరాన్ చర్యలు నిరూపించాయి. ట్రంప్ ప్రకటించిన రెండు వారాల తాత్కాలిక యుద్ధ విరమణ కేవలం రాజకీయ ఎత్తుగడ మాత్రమే. నిజానికి యుద్ధాన్ని శాశ్వతంగా ఆపేసి, ఇరాన్ సహా నష్టపోయిన దేశాల పునర్నిర్మాణంలో అమెరికా భాగస్వామి కావాలి. సామ్రాజ్యవాద విస్తరణ, ముడిపదార్థాల కోసం ఆక్రమణ యత్నాలు ఇకపై సాగవని ట్రంప్ తెలుసుకోవాలి. వెనెజువెలాలో చేసిన ప్రయోగాలు ఇరాన్‌లో పారవని ఈ నెల రోజుల అనుభవం స్పష్టం చేసింది. ఒక అగ్రరాజ్యం తన అహంకారం కోసం ప్రపంచ ఆర్థిక వ్యవస్థను అల్లకల్లోలం చేయడం అత్యంత అనైతికం మరియు చట్టవిరుద్ధం.

**ముడి పదార్థాలపై అదుపు సాధించడం కోసం యుద్ధాలు చేయడం వల్ల ప్రపంచం చెల్లిస్తున్న మూల్యం అపారం. పెట్టుబడిదారీ ప్రపంచం స్థిరంగా ఉండాలంటే శాంతి అవసరం. ఇప్పటికైనా అమెరికా తన యుద్ధోన్మాదాన్ని వీడాలి. కేవలం తన డాలర్ ప్రయోజనాల కోసం ప్రపంచాన్ని ఆర్థిక మాంద్యం అనే అగాధంలోకి నెట్టడం ఆపాలి. అప్పుడే ప్రపంచ దేశాలు, ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాలు ఊపిరి పీల్చుకోగలవు.**



# ఇరాన్‌తో యుద్ధానికి పక్షం విరామం

- 15 రోజుల సీజ్‌ఫైర్ ప్రకటించిన ట్రంప్
- హర్మూజ్‌పై సుంకాలు విధింపును సమర్థించుకున్న ఇరాన్



**వాషింగ్టన్, ఏప్రిల్ 8:** గత 40 రోజులుగా పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. అమెరికా-ఇరాన్ మధ్య రెండు వారాల పాటు కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. ఇరాన్‌పై దాడులను రెండు వారాల పాటు ఆపేస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. ఇరాన్-అమెరికా, ఇజ్రాయెల్ దేశాల మధ్య యుద్ధం తాత్కాలికంగా నిలిచిపోయింది. ఇరాన్, అమెరికాల మధ్య 15 రోజుల సీజ్ ఫైర్ ఒప్పందం జరిగింది. ఈ ఒప్పందంపై ట్రంప్ తన సొంత సోషల్ మీడియా 'ది ట్రూత్'లో వరుస పోస్టులు పెడుతున్నారు. తాజాగా, 'ప్రపంచ శాంతికి ఇది గొప్ప రోజు. ఇరాన్‌తో పాటు ఇతర దేశాలు కూడా శాంతి కోరుకుంటున్నాయి. హోర్ముజ్ జలసంధిలో ట్రాఫిక్ క్లియరెన్స్‌కు సహకరిస్తాం' అని రాసుకొచ్చారు. అమెరికా సీజ్ ఫైర్ నిర్ణయానికి ఇజ్రాయెల్ కూడా మద్దతు తెలిపింది. లెబెనాన్ విషయంలో మాత్రం వెనక్కు తగ్గేది లేదని స్పష్టం చేసింది. ఇరాన్, అమెరికా దేశాల మధ్య సీజ్ ఫైర్ ఒప్పందం జరిగినా కూడా హోర్ముజ్ విషయంలో ఇరాన్ మాత్రం వెనక్కు తగ్గటం లేదు. ఇప్పటికీ ఇరాన్ నియంత్రణలోనే హోర్ముజ్ జలసంధి ఉంది. హోర్ముజ్‌లో షిప్పుల నుంచి ఇరాన్ భారీ మొత్తంలో టోల్ వసూలు చేస్తోంది. టోల్ ఫీజు ఆదాయాన్ని పునర్నిర్మాణానికి ఖర్చు చేస్తామని అంటోంది. పాకిస్థాన్ ప్రధాని సూచనల మేరకే గడువును పొడిగించినట్టు ట్రంప్ తెలిపారు. అయితే కాల్పుల విరమణ ఒప్పందానికి ఇరాన్ అంగీకరించడం వెనుక చైనా కీలక పాత్ర పోషించిందని వార్తలు వస్తున్నాయి. 'కాల్పుల విరమణపై చర్చలు జరపడానికి టెహ్రాన్‌ను ఒప్పించడంలో చైనా ప్రమేయం ఉందా' అని విలేకరులు ప్రశ్నించినపుడు 'అవుననే అనుకుంటున్నా. నేను కూడా విన్నాను' అని ట్రంప్ పేర్కొన్నారు. ఈ ఏడాది మే నెలలో చైనా పర్యటనకు ట్రంప్ వెళ్లబోతున్నారు. ఆ సమయం లోపునే ఈ యుద్ధం ముగిసిపోవాలని చైనా భావిస్తున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో పాకిస్థాన్, టర్కీ, ఈజిప్టు వంటి మధ్యవర్తుల ద్వారా ఇరాన్‌ను శాంతి మార్గం వైపు నడిపించడంలో చైనా నిశబ్దంగా పని చేసిందని వార్తలు వస్తున్నాయి. ఇరాన్ యుద్ధంలో బీజింగ్ పాత్రపై చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ఇప్పటివరకు ఎలాంటి ప్రకటనా జారీ చేయలేదు. నిజానికి ఈ యుద్ధం ఆగడం చైనాకు కూడా చాలా కీలకం. ఎందుకంటే చైనాకు ఇరాన్ ప్రధాన ఆయిల్ సరఫరాదారు. హోర్ముజ్ జలసంధి మూసి వేసి ఉండడం చైనా ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ నేపథ్యంలోనే శాంతి చర్చల విషయమై చైనా అధికారులు నేరుగా ఇరాన్ నాయకులతోనే సంప్రదింపులు జరిపినట్టు సమాచారం. ఏదేమైనా, భవిష్యత్తులో ప్రపంచ రాజకీయాల్లో చైనా ప్రభావం మరింత పెరుగుతుందనేందుకు ఈ పరిణామం కీలక సంకేతం.

# ఇది యుద్ధానికి ముగింపు కాదు

- మొజ్తాబా ఖమేనీ సంచలనం
- 10న ఇస్లామాబాద్‌లో చర్చలు



**టెహ్రాన్/వాషింగ్టన్, ఏప్రిల్ 8:** ప్రపంచం ఊపిరి పీల్చుకునే వార్త.. యుద్ధ మేఘాల మధ్య చిన్న ఆశారేఖ! గత కొద్దిరోజులుగా పశ్చిమాసియాను వణికించిన అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. ఇరు దేశాల మధ్య రెండు వారాల పాటు 'కాల్పుల విరమణ' ఒప్పందం కుదిరింది. అయితే, ఈ శాంతి కేవలం 'తాత్కాలికమే' అని, యుద్ధం ముగిసిందని ఎవరూ భ్రమపడొద్దని ఇరాన్ సుప్రీం నేత మొజ్తాబా ఖమేనీ ఇచ్చిన హెచ్చరిక ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన వెంటనే ఇరాన్ సుప్రీం నేత మొజ్తాబా ఖమేనీ ఒక ప్రకటన విడుదల చేశారు. "ఇది యుద్ధానికి ముగింపు కాదు.. కేవలం విరామం మాత్రమే. మా సైన్యం వేళ్లు ఇంకా గన్ ట్రిగ్గర్ల పైనే ఉన్నాయి. శత్రువు ఏమాత్రం దురాక్రమణకు పాల్పడినా పూర్తి బలంతో ధీటుగా స్పందిస్తాం" అని స్పష్టం చేశారు. అయితే, ప్రస్తుతానికి తక్షణమే దాడులు నిలిపివేయాలని తన సైనిక విభాగాలను ఆయన ఆదేశించారు.

### పాక్ మధ్యవర్తిత్వానికి ట్రంప్ గ్రీన్ సిగ్నల్

పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ చేసిన ప్రతిపాదనకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సానుకూలంగా స్పందించారు. హర్మూజ్ జలసంధిని తెరిచేందుకు ఇరాన్ అంగీకరించడంతో, రెండు వారాల పాటు దాడులు చేయబోమని ట్రంప్ ప్రకటించారు. పశ్చిమాసియాలో శాశ్వత శాంతి నెలకొల్పడానికి ఈ 14 రోజుల గడువు ఉపయోగపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఇరాన్ పెట్టిన 10 ప్రధాన డిమాండ్లు (ఆంక్షల ఎత్తివేత, హర్మూజ్‌పై నియంత్రణ వంటివి) కూడా సానుకూలంగా ఉన్నాయని ట్రంప్ పేర్కొనడం గమనార్హం.

### ఇస్లామాబాద్‌లో 'మహా' చర్చలు:

శాంతి ప్రయత్నాలను ముందుకు తీసుకెళ్లేందుకు పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఇరు దేశాల ప్రతినిధులను ఆహ్వానించారు. ఏప్రిల్ 10న ఇస్లామాబాద్‌లో జరగనున్న ప్రత్యక్ష చర్చల్లో అమెరికా, ఇరాన్ ప్రతినిధులు పాల్గొననున్నారు. ఈ చర్చల గురించి వైట్‌హౌస్ స్పందిస్తూ.. తుది నిర్ణయం అధ్యక్షుడు ట్రంప్ తీసుకుంటారని వెల్లడించింది. ప్రపంచ చమురు మార్కెట్ కుప్పకూలకుండా ఉండాలంటే ఈ చర్చలు సఫలం కావడం అత్యంత అవసరమని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

## అమెరికాకు మద్దతిస్తాం.. కానీ


అమెరికా- ఇరాన్ మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందంపై ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు స్పందించారు. ఈ విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు మద్దతిస్తామన్నారు. అయితే, ఈ ఒప్పందం లెబనాన్‌కు వర్తించదని స్పష్టంచేశారు. నెతన్యాహు కార్యాలయం ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది. హర్మూజ్ జలసంధిని ఇరాన్ తిరిగి తెరవడం, ఇజ్రాయెల్ సహా గల్ఫ్ దేశాలపై దాడులు నిలిపివేయడం వంటి షరతులకు లోబడి.. రెండు వారాల కాల్పుల విరమణకు ట్రంప్ తీసుకున్న నిర్ణయానికి మద్దతిస్తున్నట్లు పేర్కొంది. దీంతోపాటు ఇరాన్ అణు, క్షిపణి, ఉగ్రవాదం నుంచి ప్రపంచానికి ముప్పు కలగకుండా అమెరికా చేస్తున్న ప్రయత్నాలను సమర్థిస్తున్నట్లు తెలిపింది. ఇరాన్‌తో జరగబోయే చర్చల్లో.. యూఎస్, ఇజ్రాయెల్, దాని మిత్రదేశాల లక్ష్యాలను సాధించేందుకు తాము కట్టుబడి ఉన్నామని అగ్రరాజ్యం తమకు హామీ ఇచ్చినట్లు వెల్లడించింది. అయితే, ఈ కాల్పుల విరమణ లెబనాన్ కు వర్తించదని తేల్చి చెప్పేసింది. పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ప్రకటన ఇందుకు విభిన్నంగా ఉంది. అమెరికా- ఇరాన్ అంగీకరించిన కాల్పుల విరమణ ఒప్పందం లెబనాన్‌కు కూడా వర్తిస్తుందని ఆయన పేర్కొన్నారు.

### లెబనాన్‌పై దాడులు..

లెబనాన్‌పై ఇజ్రాయెల్ విరుచుకుపడింది. దక్షిణ లెబనాన్‌లోని ఓ నగరం లక్ష్యంగా ఐడీఎఫ్ దళాలు దాడులు చేశాయి. తమ మిత్రదేశాలపై కూడా ఎలాంటి దాడులు చేయకూడదని ఇరాన్ ప్రతిపాదించిన తన 10 పాయింట్‌లలో పేర్కొంది. అయినప్పటికీ.. ఇజ్రాయెల్ తన దాడులను కొనసాగించడం గమనార్హం.

# యుద్ధ విరమణతో మార్కెట్లకు జోష్

### భారీ లాభాల్లో ప్రారంభం అయిన దేశీయ సూచీలు



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 8:** ఇరాన్‌పై రెండు వారాల పాటు దాడులు చేయబోమని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడం అంతర్జాతీయ మార్కెట్లలో ఫుల్ జోష్ తీసుకొచ్చింది. మరోవైపు అంతర్జాతీయంగా చమురు ధరలు కూడా భారీగా దిగి వచ్చాయి. ఈ నేపథ్యంలో దేశీయ సూచీలు కూడా భారీ లాభాలతో ప్రారంభమయ్యాయి. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ బలపడింది. సెన్సెక్స్, నిఫ్టీ మూడు శాతానికి పైగా లాభంతో ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం దాదాపు అన్ని రంగాలూ లాభాల్లోనే కదలాడుతున్నాయి. గత సెషన్ ముగింపు (74,616)తో పోల్చుకుంటే బుధవారం ఉదయం దాదాపు 2500 పాయింట్ల లాభంతో మొదలైన సెన్సెక్స్ జోరు కొనసాగుతోంది. చాలా రోజుల తర్వాత 77 వేల మార్క్ దాటింది. ప్రస్తుతం ఉదయం 10:00 గంటల సమయంలో సెన్సెక్స్ 2670 పాయింట్ల లాభంతో 77,286 వద్ద కొనసాగుతోంది. మరో వైపు నిఫ్టీ కూడా లాభాల బాటలోనే సాగుతోంది. ప్రస్తుతం 777 పాయింట్ల నష్టంతో 23,900 వద్ద కదలాడుతోంది. సెన్సెక్స్, నిఫ్టీలో అశోక్ లేలాండ్, ప్రెస్టీజ్ ఎస్టేట్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, మదర్సన్, ఎల్ అండ్ టీ ֺ ÷నాన్స్ మొదలైన షేర్లు లాభాల్లో ఉన్నాయి . ఆయిల్ ఇండియా, నాల్కో, ఓఎన్‌జీసీ, కోల్ ఇండియా, సన్ ఫార్మ మొదలైన షేర్లు నష్టాల బాటలో సాగుతున్నాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 1843 పాయింట్ల లాభంతో ఉంది. బ్యాంక్ నిఫ్టీ 2473 పాయింట్ల లాభంతో ఉంది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ 92.55గా ఉంది.

# మరోమారు భారీగా పెరిగిన బంగారం ధరలు

### దాదాపు 4 వేల వరకు పెరిగిన తులం ధర

**హైదరాబాద్, ఏప్రిల్ 8:** యుద్ధానికి తాత్కాలికంగా బ్రేక పడడంతో పసిడి ప్రియులకు షాక్ ఇచ్చే విధంగా బంగారం ధరలు భారీగా పెరిగాయి. మంగళవారం 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం 1,49,840 రూపాయల దగ్గర.. 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం 1,37,350 రూపాయల దగ్గర.. 10 గ్రాముల 18 క్యారెట్ల బంగారం ధర 1,12,380 దగ్గర ట్రేడ్ అయింది. గుడ్ రిటర్న్స్ వెబ్ సైట్ ప్రకారం బుధవారం 24 క్యారెట్లపై 3,980 రూపాయలు.. 22 క్యారెట్లపై 3,650 రూపాయలు.. 18 క్యారెట్లపై 2,990 రూపాయలు పెరిగింది. హైదరాబాద్ మార్కెట్‌లో ఉదయం పది గంటల ప్రాంతంలో బంగారం ధరలు ఇలా ఉన్నాయి. 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం 1,53,820 రూపాయల దగ్గర ట్రేడ్ అవుతోంది. 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం 1,41,000 రూపాయల దగ్గర.. 10 గ్రాముల 18 క్యారెట్ల బంగారం 1,15,370 రూపాయల దగ్గర ట్రేడ్ అవుతోంది. ఈ రోజు వెండి ధరలు కూడా భారీగా పెరిగాయి. కేజీ వెండిపై పది వేలు పెరిగి 2,65,000 రూపాయల దగ్గర ట్రేడ్ అవుతోంది. 100 గ్రాముల వెండిపై వెయ్యి పెరిగి 26,500 రూపాయల దగ్గర ట్రేడ్ అవుతోంది.

## సురక్షితంగా ఇరాన్‌ను వీడండి

### భారత ప్రజలకు కేంద్రం అడ్వయిజరీ

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 8:** ఇరాన్‌లోని భారత పౌరులకు కేంద్రం మరోసారి అడ్వైజరీ జారీ చేసింది. వెంటనే ఆ దేశం నుంచి బయటపడాలని సూచించింది. ప్రస్తుత పరిణామాల దృష్ట్యా ఇరాన్‌లోని ఇండియన్ ఎంబసీ బుధవారం ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు పెట్టింది. రాయబార కార్యాలయాన్ని ముందుగా సంప్రదించకుండా.. ఏ అంతర్జాతీయ సరిహద్దు సమీపంలోకి రావొద్దని పౌరులను హెచ్చరించింది. అలాగే కొన్ని హెల్ప్‌లైన్ నంబర్లను షేర్ చేసింది. ఇరాన్-అమెరికా (ఎసజీని-జాం) రెండు వారాల కాల్పుల విరమణకు అంగీకరించిన నేపథ్యంలో ఈ సూచనలు జారీ కావడం గమనార్హం. నిన్న రాత్రి కూడా కేంద్ర విదేశాంగశాఖ అడ్వైజరీ జారీ చేసింది. అనవసర ప్రయాణాలు మానుకోవాలని సూచించింది. ఇళ్లల్లోనే ఉండాలని, అన్ని విద్యుత్, సైనిక స్థావరాలు, బహుళ అంతస్తుల భవనాలకు దూరంగా ఉంటూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం యుద్ధం తాత్కాలికంగా ఆగడంతో స్వదేశానికి రావాలనుకునేవారికి ఇదొక అవకాశంగా మారింది. ఇరాన్‌లో ఉన్న భారతీయులకు ఇరాన్‌లోని ఇండియన్ ఎంబసీ బుధవారం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఇరాన్‌లో ఉన్న భారతీయులు వెంటనే దేశం విడిచి వెళ్లిపోవాలని స్పష్టం చేసింది. అవసరమైతే భారత రాయబార కార్యాలయం సహాయం తీసుకోవాలని తెలిపింది. తాము సూచించిన మార్గాల్లో మాత్రమే దేశాన్ని వీడాలని ఎంబసీ ఆదేశించింది. ఎంబసీని సంప్రదించకుండా.. పర్మిషన్ తీసుకోకుండా అంతర్జాతీయ సరిహద్దుల వద్దకు వెళ్లరాదని హెచ్చరించింది. ఈ మేరకు ఎంబసీ బుధవారం ఎక్స్‌లో ఓ పోస్టు పెట్టింది.



# అమరావతికి కేంద్రం భారీ నజరానా

మొదటి పేజీ తరువాయి

నిర్మలా సీతారామన్ ఆమోదం తెలిపారు. కామన్ సెంట్రల్ సెక్రటేరియట్ దీని నిర్మాణం కోసం రూ.1,299.08 కోట్లు వెచ్చించనున్నారు. అధికారుల నివాసాల కోసం రూ.1,234.91 కోట్లతో నివాస ప్రాజెక్టును చేపట్టనున్నారు. ప్రస్తుతం ఈ ఫైల్ కేంద్ర క్యాబినెట్ సెక్రటేరియట్ వద్ద పెండింగ్‌లో ఉండగా, వచ్చే క్యాబినెట్ సమావేశంలో దీనికి తుది క్లియరెన్స్ లభించే అవకాశం ఉంది. అమరావతిలో కేంద్ర ప్రభుత్వ భవనాల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 22.53 ఎకరాల భూమిని ఆఫర్ చేసింది. ఈ భూమిని సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ కు కేటాయించారు. సచివాలయ భవనం కోసం 5.53 ఎకరాలు, నివాస సముదాయాల కోసం 17 ఎకరాలను కేటాయించనున్నారు. అమరావతిని రాజధానిగా గుర్తిస్తూ వెలువడిన గెజిట్ నోటిఫికేషన్‌ను రాష్ట్ర అధికారులు ఇప్పటికే కేంద్రానికి సమర్పించడంతో, సాంకేతిక అడ్డంకులన్నీ తొలగిపోయాయి. క్యాబినెట్ సెక్రటేరియట్ నుంచి అనుమతి వచ్చిన వెంటనే టెండర్ల ప్రక్రియ ప్రారంభించి, నిర్మాణ పనులు మొదలుపెట్టాలని కేంద్రం భావిస్తోంది. అమరావతిలో కేంద్ర సెక్రటేరియట్ రావడం వల్ల భవిష్యత్తులో అన్ని కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు ఒకే చోట అందుబాటులోకి వస్తాయి. ఇది రాజధాని ప్రాంత అభివృద్ధికి మరింత ఊపునిస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఏపీకి ఇది ఒక కీలకమైన మలుపుగా రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

# కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు

**ఖరీఫ్ సీజన్ కోసం రూ.41,534 కోట్ల రాయితీ**

**జైపూర్ మెట్రో, అరుణాచల్ ప్రాజెక్టులకు క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్**

**దేశవ్యాప్తంగా లక్షల కోట్ల ప్రాజెక్టులకు మోదీ సర్కార్ ఆమోదం**

**న్యూఢిల్లీ:** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం జరిగిన కేంద్ర క్యాబినెట్ సమావేశంలో 5 కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఖరీఫ్ సీజన్ కోసం న్యూట్రియెంట్ బేస్డ్ సబ్సిడీగా రూ.41,533.81 కోట్లు కేటాయించారు. ఇది 2025 ఖరీఫ్ సీజన్‌లో బడ్జెటరీ కేటాయింపుల కంటే రూ.4,313 కోట్ల రూపాయలు అధికం. 2025 ఖరీఫ్ బడ్జెట్ రూ.37,216.15 కోట్లుగా ఉంది. కాగా, జైపూర్ మెట్రో ఫేజ్-2కు కేంద్ర క్యాబినెట్ తాజాగా ఆమోదం తెలిపింది. రూ.13,038 కోట్లతో ఈ ప్రాజెక్టు చేపడతారు. ప్రహ్లాద్‌పుర నుంచి తోడి-మోడ్ వరకూ 36 స్టేషన్లను కలుపుతూ 41 కిలోమీటర్ల పొడవైన నార్త్-సౌత్ కారిడార్‌గా దీన్ని నిర్మించనున్నారు. కేంద్ర, రాజస్థాన్ ప్రభుత్వం జాయింట్ వెంచర్‌గా రాజస్థాన్ మెట్రో రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ దీనిని చేపడుతుంది. రాజస్థాన్‌లో హెచ్‌పీసీఎల్ రిఫైనర్ కోసం రూ.79,459 కోట్లను కేటాయిస్తూ కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. అరుణాచల్ ప్రదేశ్‌లోని కమ్లే, క్రా దాది-కురుంగ్ కుమే జిల్లాల్లో రూ.26,069.50 కోట్లతో 1720 మెగావాట్ల ఎలక్ట్రిక్ ప్రాజెక్ట్ నిర్మాణానికి కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టు 96 నెలల్లో పూర్తవుతుందని అంచనా వేశారు. కాగా, అరుణాచల్ ప్రదేశ్‌లోని అంజావ్ జిల్లాలో 1200 మెగావాట్ల కళాయి-2 హైడ్రో ప్రాజెక్టు నిర్మాణానికి రూ.14,105.83 కోట్లు కేటాయిస్తూ కేంద్ర మంత్రివర్గం మరో కీలక నిర్ణయం తీసుకుంది.

# కూతురిని నడుముకి కట్టుకుని కాలువలో దూకిన తల్లి

**పల్నాడు జిల్లాలో విషాద ఘటన**

**పల్నాడు జిల్లా, ఏప్రిల్ 8:** పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గంలో అత్యంత విషాదకర ఘటన చోటుచేసుకుంది. కన్నకూతురిని నడుముకు కట్టుకుని, ఒక తల్లి సాగర్ కుడి కాలువలోకి దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. మాచర్ల మండలం తాళ్లపల్లి సమీపంలోని నాగార్జున సాగర్ కుడి కాలువ వద్ద ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సదరు మహిళ తన చిన్నారి కూతురిని కాలువలోకి పడిపోకుండా తన నడుముకు గట్టిగా కట్టుకుంది. అనంతరం కాలువలోకి దూకి ప్రాణాలు తీసుకుంది. నీటి ఉధృతికి ఇద్దరూ ఊపిరాడక మృతి చెందారు. కాలువలో మృతదేహాలు తేలుతుండటం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందజేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. తల్లీబిడ్డల మృతదేహాలను బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం మాచర్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆ తల్లి అంతటి కఠిన నిర్ణయం తీసుకోవడానికి గల కారణాలపై పోలీసులు విచారణ జరుపుతున్నారు. కుటుంబ కలహాలా లేక ఆర్థిక ఇబ్బందులా? అనే కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు. ఒకేసారి తల్లీబిడ్డలు మృతి చెందడంతో తాళ్లపల్లి, మాచర్ల ప్రాంతాల్లో విషాద ఛాయలు అలముకున్నాయి.

# సమావేశాల నిర్వహణలో నేతల నిర్లక్ష్యం

**కొందరు పార్టీ నేతల తీరుపై లోకేశ్ అసహనం**

**పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలకు సన్మానం**

**మంగళగిరి టీడీపీ కార్యాలయంలో లోకేశ్**



**అమరావతి, ఏప్రిల్ 8:** కొందరు పార్టీ నేతల తీరుపై మంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ తీవ్ర అసమనం వ్యక్తం చేశారు. ఇలా అయితే ఎలా అంటూ ఆగ్రహం కూడా వ్యక్తపరచారు. కేడర్ సమావేశాలు, గ్రీవెన్స్ వరుసగా నాలుగు వారాలు నిర్వహించని పలువురు నాయకులను నారా లోకేశ్ మందలించారు. మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డి, ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజులు రెడ్డి వరుసగా నాలుగు వారాలు కేడర్ సమావేశాలు, గ్రీవెన్స్ నిర్వహించకపోవడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. ఆయా కార్యక్రమాలు నిర్వహించకపోవడానికి గల కారణాలను అడిగి తెలుసుకోవాలని పార్టీ కార్యాలయ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. నారా లోకేశ్ బుధవారం టీడీపీ నేతలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆ పార్టీ నేతలపై మంత్రి నారా లోకేశ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నాలుగు వారాల నుంచి కేడర్ సమావేశాలు నిర్వహించని పులివెందుల ఇన్‌చార్జ్ బీటెక్ రవి, కమలాపురం ఎమ్మెల్యే చైతన్య రెడ్డి, నాలుగు వారాల నుంచి గ్రీవెన్స్ నిర్వహించని ధర్మవరం ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ పట్ల నారా లోకేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ ఇచ్చిన కార్యక్రమాలు కచ్చితంగా నిర్వహించాలని లోకేశ్ హుకుం జారీ చేశారు. ఇకముందు ఇలానే వ్యవహారిస్తే ఉపేక్షించేది లేదని లోకేశ్ స్పష్టం చేశారు. కష్టపడిన వారిని గుర్తించాలనేది తెలుగుదేశం పార్టీ సిద్ధాంతమని మంత్రి లోకేశ్ వ్యాఖ్యానించారు. నేతల పనితీరే ఇక్కడి వరకు రావడానికి కారణమని చెప్పారు. పార్టీ పిలుపునిచ్చిన కార్యక్రమాలను సక్రమంగా నిర్వహిస్తే పార్టీ వందేళ్లు ఉంటుందని తెలిపారు. 'మై టీడీపీ యాప్' టాప్ 10 ఫెర్ఫార్మర్స్‌తో మంత్రి లోకేశ్ ఆత్మీయ భేటీ అయ్యారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని దిశానిర్దేశర చేశారు. యాప్ సమర్థ వినియోగం పట్ల ఉత్తమ కార్యకర్తలను లోకేశ్ ఘనంగా సత్కరించారు. తెలుగుదేశం పార్టీ కోసం కష్టపడిన వారిని గుర్తించడమే తమ సిద్ధాంతమని లోకేశ్ అన్నారు. పార్టీకి అండగా నిలిచిన వారిని ఎప్పటికీ విస్మరించేది లేదన్నారు. 'మై టీడీపీ యాప్' టాప్-10 ఫెర్మార్మర్లతో మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా 'మై టీడీపీ యాప్' సమర్థ వినియోగం, పార్టీ పిలుపునిచ్చిన కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొనడంపై మంత్రి లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. మీ పని తీరే ఇక్కడి వరకు రావడానికి కారణమంటూ కొనియాడారు. ఉత్తమ కార్యకర్తలను ఘనంగా సత్కరించారు. అనంతరం ప్రతి ఒక్కరినీ ఆత్మీయంగా పలకరించి వారి కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. పార్టీ కోసం మరింతగా కష్టపడాలని, టీడీపీ ఎప్పుడూ అండగా ఉంటుందని మంత్రి లోకేశ్ భరోసా కల్పించారు.



# పటిష్టంగా రహదారుల నిర్మాణం

మొదటి పేజీ తరువాయి

పాత్ హోల్ ఫ్రీ రహదారులు, ఈవీ బస్సుల వినియోగంపై సమీక్షలో చర్చించారు. ఈ సమీక్షకు మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, రవాణాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు, ఆర్టీసీ ఎండీ బాలసుబ్రహ్మణ్యం తదితర ఉన్నతాధికారులు హాజరయ్యారు. మెరుగైన రహదారుల ద్వారా ప్రజలకు మౌలిక సదుపాయాలు అందుబాటులోకి రావాలని పేర్కొన్నారు. అతి తక్కువ వ్యయానికే ప్రజా రవాణా జరిగేలా ఎలక్ట్రిక్ బస్సులను అందుబాటులోకి తీసుకురావాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఇదిలావుంటే ఇటీవల తరచూ ప్రమాదాలకు గురవుతూ... ప్రజల ప్రాణాలను బలిగొంటున్న స్లీపర్ బస్సులను అవసరమైతే భవిష్యత్తులో రద్దుచేస్తామని రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఇప్పటికే దీనిపై కేంద్రాన్ని సంప్రదించామని పేర్కొన్నారు. 'ప్రయాణించే రెండు ప్రాంతాల మధ్య దూరాన్ని లెక్కించి బస్సు గమ్యస్థానం చేరాల్సిన సమయాన్ని నిర్దేశిస్తార. అంతకంటే ముందే వెళ్తే బస్సును సిటీలోకి అనుమతించబోం. 300 కి.మీ., అంతకంటే ఎక్కువ దూరం ప్రయాణించే ప్రైవేటు బస్సుల్లో ఇద్దరు డ్రైవర్లు ఉండాల్సిందే. రాత్రిపూట డ్రైవర్ నిద్రపోయేందుకు ఒక సీటు కేటాయించాలి. ఈ విషయాలను ప్రైవేటు బస్సు యాజమాన్యాలకు స్పష్టం చేశాం' అని మంత్రి వెల్లడించారు. బస్సు ప్రమాదాల నియంత్రణపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం మంగళవారం సచివాలయంలో సమీక్షించింది. రహదారుల వెంబడి స్పీడ్ గన్‌ల ఏర్పాటుకు ప్రభుత్వం ఇప్పటికే రూ.40 కోట్లు మంజూరుచేసింది. డ్రైవర్‌ను, ఎదురుగా వచ్చే వాహన కదలికల్ని అంచనా వేసేలా ప్రతి బస్సులో రెండు కెమెరాలు ఏర్పాటుచేయాలని ప్రైవేటు ట్రావెల్స్ యాజమాన్యాలను ఆదేశించాం' అని వివరించారు. 'కర్నూలు, మారేడుమిల్లి, మార్కాపురం బస్సు ప్రమాదాలకు మానవ తప్పిదమే కారణమని తేలింది.

# కృష్ణపట్నం తీరంలో హైఅలర్ట్..

**టాస్క్‌ఫోర్స్ వలలో తమిళనాడు బోటు!**

**నిరంతర గస్తీతో దొరికిపోయిన నాలుగో నౌక**

**నెల్లూరు, ఏప్రిల్ 8:** నెల్లూరు జిల్లాలోని కృష్ణపట్నం పోర్టు సముద్ర తీరంలోకి అక్రమంగా చొరబడిన తమిళనాడుకు చెందిన ఒక బోటును టాస్క్ ఫోర్స్ బృందాలు పట్టుకున్నాయి. ఇటీవల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ఆదేశాల మేరకు తీర ప్రాంతంలో భద్రతపై ప్రత్యేక దృష్టి సారించారు. నిరంతర నిఘా కొనసాగుతున్న వేళ, ఈ చొరబాటు కలకలం రేపింది. గత కొద్ది రోజులుగా కృష్ణపట్నం తీరంలో అక్రమ రాకపోకలు పెరగడంతో టాస్క్‌ఫోర్స్ బృందాలు గస్తీని ముమ్మరం చేశాయి. ఈ క్రమంలోనే తాజాగా పట్టుబడిన బోటుతో కలిపి ఇప్పటి వరకు మొత్తం నాలుగు బోట్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇటీవల వరుసగా మూడు బోట్లను పట్టుకోగా, తాజాగా నాలుగో బోటు చిక్కింది. పట్టుబడిన ఈ బోట్లన్నింటినీ భద్రతా కారణాల దృష్ట్యా జువ్వలదిన్నె హార్బర్‌కు తరలించారు. సీఎం చంద్రబాబు ఆదేశాల నేపథ్యంలో టాస్క్‌ఫోర్స్ అధికారులు 24 గంటల పాటు నిరంతర గస్తీ నిర్వహిస్తున్నారు. ఆధునిక పరికరాలు, నిఘా నేత్రాల సహాయంతో అనుమానాస్పద కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ చొరబాటుదారుల ఆటకట్టిస్తున్నారు.

# సేంద్రియ సాగే భవిష్యత్తుకు మార్గం

మొదటి పేజీ తరువాయి

"ప్రస్తుతం రసాయన ఎరువులు, పురుగుమందుల మితిమీరిన వినియోగం వల్ల మన భూమి నాణ్యత దెబ్బతింటోంది. దీనివల్ల రైతులకు సాగు ఖర్చులు పెరగడమే కాకుండా ప్రజల ఆరోగ్యం కూడా పాడవుతోంది. అందుకే సేంద్రియ వ్యవసాయమే మన ముందున్న ఏకైక మార్గం. తక్కువ వ్యయంతో ఎక్కువ లాభాలు పొందాలంటే ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేయాలి. దీనికోసం మా ప్రభుత్వం శిక్షణ, సబ్సిడీలు మరియు ప్రత్యేక మార్కెటింగ్ సౌకర్యాలు కల్పిస్తుంది." అని అన్నారు. "రైతన్నలు కేవలం పాత పద్ధతుల్లోనే కాకుండా, మారుతున్న ఆహారపు అలవాట్లకు అనుగుణంగా పంటల మార్పిడి చేయాలి. ఏ పంటకు మార్కెట్‌లో డిమాండ్ ఉందో ఆలోచించి సాగు చేయండి. మారుటేరు పరిశోధన కేంద్రం వందేళ్లుగా అద్భుతమైన వంగడాలను అందిస్తోంది. మా శాస్త్రవేత్తలు గ్రామ స్థాయికి వచ్చి ఏ ప్రాంతంలో ఏ పంటలు వేయాలో మీకు అవగాహన కల్పిస్తారు. ప్రభుత్వం ఇచ్చే ట్రాక్టర్లు, డ్రోన్లు వంటి ఆధునిక యంత్రాలను సబ్సిడీపై పొంది మీ పనిని సులభతరం చేసుకోండి." చెప్పారు. "రైతులకు సాగునీటి కష్టాలు లేకుండా చూడటం మా బాధ్యత. కాలువల ఆధునీకరణకు మేము కట్టుబడి ఉన్నాం. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు పోలవరం ప్రాజెక్టును వచ్చే పుష్కరాల కంటే ముందే పూర్తి చేయడానికి అహర్నిశలు కృషి చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తయితే మన రైతాంగానికి సాగునీటి ఢోకా ఉండదు." అని అన్నారు. "అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నాం. రైతు సేవా కేంద్రాల ద్వారా మీరు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసి, కేవలం 24 గంటల్లోనే మీ ఖాతాల్లో నగదు జమ అయ్యేలా చూస్తున్నాం. వ్యవసాయాన్ని ఒక పండగలా మార్చడమే మా సంకల్పం. శాస్త్రవేత్తలు, అధికారులు రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలి." అని మంత్రి అచ్చెన్నాయుడు ఉద్ఘాటించారు.



# 'క్రీడా' అగ్రగామిగా మారుస్తాం

**మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి**

**విజయవాడ, ఏప్రిల్ 8:** రాష్ట్రంలో క్రీడారంగానికి పూర్వవైభవం తీసుకొస్తామని, రాబోయే మూడేళ్లలో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే క్రీడా హబ్‌గా తీర్చిదిద్దుతామని రాష్ట్ర రవాణా, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం విజయవాడలోని ఇందిరా గాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియం అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా స్టేడియం భవిష్యత్తు మరియు రాష్ట్ర క్రీడా విధానంపై మంత్రి మాట్లాడిన కీలక అంశాలు ఆయన మాటల్లోనే.. "సీఎం నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో రాష్ట్రంలో క్రీడలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాం. రాబోయే మూడు సంవత్సరాలలో ప్రతి నగరం, పట్టణం, చివరికి ప్రతి గ్రామంలో కూడా క్రీడా వసతులు కల్పించడమే మా లక్ష్యం. ఆంధ్రప్రదేశ్‌ను క్రీడా రంగంలో దేశంలోనే నంబర్ వన్ స్థానంలో నిలబెట్టేలా కఠోరంగా కృషి చేస్తున్నాం." అని అన్నారు. "విజయవాడ నగరానికి ఐజీఎంసీ స్టేడియం అంటే ఒక ఎమోషన్. దీనిని సుమారు రూ.160 నుండి రూ.170 కోట్ల వ్యయంతో మూడు దశల్లో అభివృద్ధి చేస్తాం. ఇందులో కేంద్రం (ఖేలో ఇండియా) నుండి రూ.20 కోట్లు, శాప్ నుండి రూ.20 కోట్లు, మిగిలిన నిధులు మున్సిపల్ మరియు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా సమకూరుస్తాయి. వచ్చే ఏడాది నాటికి ఈ స్టేడియం రూపురేఖలు మారిపోతాయి. అంతర్జాతీయ స్థాయి మ్యాచ్‌లను ఇక్కడ నిర్వహించేలా వసతులు కల్పిస్తాం" అని చెప్పారు. "పార్లమెంట్ ఉభయసభల్లో అమరావతికి చట్టబద్ధత కల్పించిన ఈ చారిత్రాత్మక సమయంలో స్టేడియం పనులకు శ్రీకారం చుట్టడం చాలా ఆనందంగా ఉంది. గత ఐదేళ్లలో ఆగిపోయిన క్రీడా అభివృద్ధి ఇప్పుడు మళ్ళీ వేగం పుంజుకుంది. ఇప్పటికే గుంటూరులో పనులు ప్రారంభమయ్యాయి, త్వరలో శ్రీకాకుళంలో కూడా పనులు మొదలవుతాయి. కేంద్రం నుండి దాదాపు రూ.1000 కోట్ల నిధుల ప్రతిపాదనలు ఉన్నాయి, అందులో త్వరలోనే రూ.100 కోట్లు వచ్చే అవకాశం ఉంది' అన్నారు. "ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) మ్యాచ్‌లను అమరావతిలో ప్రారంభించి కడపలో ముగించాలనే ప్రతిపాదనను మేము స్వాగతిస్తున్నాం. దీనికి ప్రభుత్వం తరపున పూర్తి సహకారం ఉంటుంది. అమరావతిలో నిర్మించబోయే 'స్పోర్ట్స్ సిటీ', స్పోర్ట్స్ యూనివర్సిటీ ద్వారా భవిష్యత్తులో మన రాష్ట్రం నుండి ప్రపంచస్థాయి క్రీడాకారులు పుట్టుకొస్తారు. 2029లో నేషనల్ గేమ్స్ నిర్వహించే దిశగా మా అడుగులు పడుతున్నాయి." అని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.



# ముద్ర యోజనకు 11 ఏళ్లు పూర్తి

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 8:( సమయం న్యూస్) :** కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి ముద్ర యోజన (ఫ్రావీవీ) 11 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. 2015లో నరేంద్ర మోడీ ప్రారంభించిన ఈ పథకం ద్వారా చిన్న, సూక్ష్మ వ్యాపారులకు భారీ స్థాయిలో ఆర్థిక సహాయం అందుతోంది. ఈ సందర్భంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ, ముద్ర యోజన దేశంలోని చిన్న వ్యాపారులకు క్రెడిట్ అవకాశాలను విస్తరించి, ఎంఎస్ఎంఈ రంగాన్ని బలోపేతం చేసిందన్నారు. ఇప్పటివరకు 57.79 కోట్ల రుణాలు మంజూరు చేసి, ₹40.07 లక్షల కోట్లకు పైగా నిధులు విడుదల చేసినట్లు ప్రభుత్వం వెల్లడించింది. మహిళలు, కొత్త వ్యాపారులు పెద్ద సంఖ్యలో ఈ పథకం ద్వారా లబ్ధి పొందారు. కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి మాట్లాడుతూ, చిన్న వ్యాపారులకు బ్యాంకులు, యెన్ బి ఎఫ్ సి లు, మైక్రో ఫైనాన్స్ సంస్థల ద్వారా రుణాలు అందించే వేదికగా ముద్ర యోజన కీలకంగా మారిందన్నారు. ఈ పథకం కింద ₹20 లక్షల వరకు కాలేటరల్ లేకుండా రుణాలు అందిస్తుండగా, శిశు, కిశోర్, తరుణ్, తరుణ్ ప్లస్ విభాగాల్లో రుణాలు మంజూరు చేస్తున్నారు. ఆర్థిక సమావేశాన్ని పెంపొందిస్తూ, స్వయం ఉపాధి అవకాశాలను విస్తరించడంలో ముద్ర యోజన కీలక పాత్ర పోషిస్తోందని అధికారులు తెలిపారు.

## NITI Aayog మహిళల ఆర్థిక భాగస్వామ్యంపై సమగ్ర నివేదికను విడుదల

**న్యూ డిల్లీ ఏప్రిల్8(సమయం న్యూస్,). :** "మహిళలు అప్పుదారుల నుంచి నిర్మాణకర్తలుగా: భారతదేశంలో మారుతున్న రుణ వ్యవస్థ" పేరుతో రూపొందించిన ఈ నివేదిక రెండో సంచికను ఏప్రిల్ 7న న్యూ ఢిల్లీలో ఆవిష్కరించారు. ఈ నివేదిక ప్రకారం దేశంలో మహిళల రుణ మొత్తం ₹76 లక్షల కోట్లకు చేరి, మొత్తం రుణ వ్యవస్థలో 26 శాతం వాటాను సాధించింది. 2017తో పోలిస్తే మహిళల రుణం 4.8 రెట్లు పెరిగినట్లు వెల్లడించింది. అలాగే మహిళల రుణ వినియోగం 19 శాతం నుంచి 36 శాతానికి పెరిగింది. మహిళల రుణ గ్రహీతల సంఖ్య సంవత్సరానికి సగటుగా 9 శాతం వృద్ధి నమోదు చేయగా, 2022 నుంచి 2025 మధ్య మహిళల వ్యాపార రుణాలు 31 శాతం పెరిగినట్లు నివేదిక పేర్కొంది. చిన్న రుణాల నుంచి వ్యక్తిగత, వ్యాపార రుణాల వైపు మహిళలు మళ్లుతున్న ధోరణి స్పష్టంగా కనిపిస్తున్నట్లు తెలిపింది. Nidhi Chhibber మాట్లాడుతూ మహిళల భాగస్వామ్యం పెరగడం దేశ ఆర్థిక అభివృద్ధికి దోహదమని పేర్కొన్నారు. డిజిటల్ సదుపాయాలు మరియు అధికారిక రుణ వ్యవస్థల విస్తరణతో మహిళలు ఆర్థికంగా బలపడుతున్నారని తెలిపారు. Anna Roy మాట్లాడుతూ మహిళలు వివిధ రుణ విభాగాల్లో చురుకుగా పాల్గొంటున్నారని, ఇది వారి ఆర్థిక స్థిరత్వాన్ని పెంచుతున్నదని అన్నారు. నివేదికలో బిహార్, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో కూడా మహిళల రుణ వినియోగం పెరుగుతున్నట్లు వెల్లడించింది. వ్యక్తిగత, బంగారం రుణాలు అధికంగా ఉన్నప్పటికీ గృహ రుణాల వినియోగం కూడా పెరుగుతోందని పేర్కొంది. సుమారు 16 కోట్ల మహిళా రుణ గ్రహీతల సమాచారంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోని మహిళా సూక్ష్మ వ్యాపారులపై నిర్వహించిన అధ్యయనాన్ని ఆధారంగా తీసుకుని ఈ నివేదిక రూపొందించబడింది.

**ముగింపు:** మహిళలు అప్పుదారుల స్థాయి నుంచి వ్యాపారాలను నిర్మించే స్థాయికి ఎదుగుతున్నారని, భవిష్యత్తులో మహిళల ఆర్థిక భాగస్వామ్యం మరింత విస్తరించే అవకాశాలు ఉన్నాయని నివేదిక స్పష్టం చేసింది.

## శంషాబాద్ విమానాశ్రయంలో ఏసీబీ దాడులు -- సిఐ, ఎస్ఐ అరెస్ట్



**శంషాబాద్, ఏప్రిల్ 8( సమయం న్యూస్). :** శంషాబాద్ విమానాశ్రయం పోలీస్ ఔట్‌పోస్టులో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు సంచలన దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సిఐ కనకయ్య, ఎస్ఐ సిద్దేశ్వర్ ఏసీబీ అధికారులకు చిక్కారు. నకిలీ విద్యా సర్టిఫికేట్ కేసులో ఇప్పటికే జైలుకు వెళ్లిన నిందితుల కుటుంబ సభ్యులను అరెస్ట్ చేస్తామని బెదిరిస్తూ, వారిని విడిచిపెట్టాలంటే రూ.15 లక్షలు లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. చివరికి రూ.2 లక్షలకు ఒప్పందం కుదిరింది. అందులో భాగంగా రూ.2 లక్షలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు వారిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ దాడులు సుమారు 5 గంటల పాటు కొనసాగాయి. రంగారెడ్డి జిల్లా డీఎస్పీ ఆనంద్ పన్నిన ఉచ్చులో సిఐ కనకయ్య, ఎస్ఐ సిద్దేశ్వర్ చిక్కినట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనపై మరింత దర్యాప్తు కొనసాగుతోంది.

## వరద ముంపునకు గురైన గిరిజన గురుకుల పాఠశాల నాగిరెడ్డిపేట్ కు గ్రీన్కో ఫౌండేషన్ ఆపన్నహస్తం

**- కామారెడ్డి కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఐఏఎస్ సమక్షంలో కంప్యూటర్ల అందజేత.**



**- కామారెడ్డి ఏప్రిల్8( సమయం న్యూస్) :** కామారెడ్డి జిల్లా, సరంపల్లిలోని గిరిజన గురుకుల పాఠశాల, కళాశాల, గతేడాది వచ్చిన భారీ వరదల కారణంగా తీవ్రమైన నష్టాన్ని చవిచూసింది. ముఖ్యంగా కంప్యూటర్ ల్యాబ్ పూర్తిగా నీట మునిగిపోయి విద్యార్థుల చదువుకు ఆటంకంగా మారింది. ఈ సమస్యను ప్రిన్సిపల్ బి. అమర్ సింగ్ జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఐఏఎస్ గారి దృష్టికి తీసుకువెళ్లగా, వారు సానుకూలంగా స్పందించి తక్షణ సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు.. గ్రీన్కో ఫౌండేషన్ ప్రతినిధులకు, అలాగే ఇంతటి గొప్ప అవకాశం కల్పించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# పాఠశాలలో విద్యా ప్రమాణాల పెంపుపై ప్రత్యేక దృష్టి

- సోషల్ సబ్జెక్టుపై పదవ తరగతి విద్యార్థులకు కలెక్టర్ విద్యా బోధనలి
- ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా పర్యటనలు కలెక్టర్
- పాఠ్యాంశాలపై విద్యార్థులచే చదివించి, సామర్థ్యాల పెంపు
- అత్యంత పారదర్శకంగా రేషన్ షాపుల నిర్వహణ కలెక్టర్
- రామాయంపేటలో విస్తృతంగా పర్యటించిన కలెక్టర్
- కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, దామరచెరువు రేషన్ షాపును పరిశీలించిన కలెక్టర్
- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



**రామాయణం పేట ఏప్రిల్,8( సమయం న్యూస్) :** పాఠశాలలో విద్యా ప్రమాణాల పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలని , రేషన్ షాపులు నిర్వహణ అత్యంత పారదర్శకంగా . నిర్వహించడం జరుగుతుందని లిజిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. బుధవారం, జిల్లాలోని రామాయంపేట గల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని దామరచెరువు గ్రామంలో రేషన్ షాపును లిజిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ సందర్శించి, ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ముందుగా కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో అందిస్తోన్న మౌలిక వసతులు, బోధన విధానం, ఉపాధ్యాయుల హాజరు, తదితర అంశాలపై సమగ్రంగా పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకం సక్రమంగా అమలు అవుతుందో.. లేదో.. పర్యవేక్షించారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా? అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే భోజన శాలను పరిశీలించి, ఆహారం నాణ్యత, వంటశాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. ప్రధానంగా గుడ్ల నాణ్యతను పరీక్షించి, వంట సామాగ్రి, సరుకులు, బియ్యం తదితరాలను తనిఖీ చేసి, గడువు తేదీలను సరిచూసుకోవాలన్నారు. పాఠశాల పరిసరాలు, తాగునీరు, మరుగుదొడ్లు, మూత్రశాలలు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలన్నారు. అదే విధంగా ప్రతి తరగతి గదిని సందర్శించి, విద్యార్థులకు బోధన చేశారు. ఈనెల 12వ తారీకు పదవ తరగతి సోషల్ ఎగ్జామ్ ఉన్న కారణంగా సోషల్ సబ్జెక్టు పై అక్షాంశాలు ,రేఖాంశాలు నిశితంగా విద్యార్థులకు అర్థమయ్యే విధంగా సులభ విధానాల ద్వారా కలెక్టర్ బోధించారు. అలాగే విద్యార్థులలో పాఠ్యాంశాలపై అవగాహన పెంచే విధంగా ఉపాధ్యాయులు బోధన చేయాలని సూచించారు. ముఖ్యంగా సోషల్ సబ్జెక్టు పై విద్యార్థులు బోర్డు మీద ఉదాహరణలతో బోధించాలన్నారు. విద్యార్థులతో ప్రత్యక్షంగా కలెక్టర్ మాట్లాడి, పాఠ్యాంశాలను చదివించి, అందులోని ప్రశ్నలు అడుగుతూ, వారి బోధన సామర్థ్యాలను పరీక్షించారు. ఈ మేరకు చదువుపై ఆసక్తి పెంచుకునేలా ప్రోత్సహించారు. అంతేకాకుండా పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడి,. పరీక్షల సమయంలో సరైన ఆహారం తీసుకోవాలని, కంటినిండా నిద్ర పోవాలని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. పట్టుదలతో కష్టపడి చదివి ఉత్తమ మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. రేషన్ షాపును పరిశీలించి స్టాక్ వివరాలు, లబ్ధిదారులకు మూడు నెలల రేషన్ సక్రమంగా అందుతుందా లేదా అనే విషయాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాపాలన99 రోజుల ప్రగతి ప్రణాళికలో భాగంగా క్షేత్రస్థాయిలో పర్యటించిన జరిగిందని తెలిపారు కస్తూర్బా గాంధీ విద్యాలయం. నిర్వహణ సమర్థవంతంగా ఉందని తెలిపారు రేషన్ కార్డులు కలిగిన లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ పారదర్శకంగా జరుగుతుందని ఎటు వంటి సమస్యలకు తావు లేకుండా పౌరసరఫరాల శాఖ అధికారులు నిత్యం పర్యవేక్షణ చేస్తున్నారన్నారు. ఈ పరిశీలనలో రామాయంపేట తాసిల్దార్ రజని , కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ధర్పల్లి ఏరియా ఆసుపత్రి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయించాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశం
- క్షేత్రస్థాయిలో పనుల పురోగతి పరిశీలన



**నిజామాబాద్, ఏప్రిల్ 08 ( సమయం న్యూస్) :** ధర్పల్లి మండల కేంద్రంలో నూతనంగా నెలకొల్పుతున్న ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి నిర్మాణ పనులను వేగవంతంగా చేపట్టి పూర్తి చేయించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. ధర్పల్లిలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను 30 పడకల స్థాయి నుండి 100 పడకలకు పెంచుతూ ఏరియా ఆసుపత్రిగా ప్రభుత్వం అప్ గ్రేడ్ చేసింది. అన్ని వసతులతో నూతన భవన నిర్మాణం కోసం రూ. 33.15 కోట్ల రూపాయలను వెచ్చిస్తున్నారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి బుధవారం ధర్పల్లి ఏరియా ఆసుపత్రి నిర్మాణ పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇప్పటివరకు పూర్తయిన పనుల నాణ్యతను పరిశీలించి, ఇంకనూ చేపట్టాల్సి ఉన్న పెండింగ్ పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. పనులు మందకొడిగా కొనసాగుతుండడం పట్ల కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. ఎంతమంది కార్మికులు రోజువారీగా పనుల్లో పాల్గొంటున్నారని ఆరా తీశారు. పనులను వేగంగా జరిపించాలని, వచ్చే సెప్టెంబర్ నెలాఖరు నాటికి పూర్తి చేయించాలని గడువు విధించారు. వర్షాకాలం సీజన్ ప్రారంభం అయితే పనులకు ఆటంకం కలిగే అవకాశాలు ఉన్నందున యుద్ధప్రతపదికన పనులు జరిగేలా నిరంతర పర్యవేక్షణ జరపాలని అన్నారు. భవన నిర్మాణం పూర్తి చేయడంతో పాటు ఆసుపత్రికి అవసరమైన అన్ని వైద్య పరికరాలు, మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిర్మాణ పనులలో నిర్లక్ష్య వైఖరిని విడనాడాలని, పనితీరులో మార్పు కనిపించకపోతే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. ప్రజారోగ్యంతో కూడుకుని ఉన్నందున ఏరియా ఆసుపత్రి నిర్మాణం పనులను వేగవంతంగా జరిపించాలని, అదే సమయంలో నాణ్యతతో పనులు జరిగేలా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఇసుక కొరత వంటి సాకులు చెప్పవద్దని, టీజీఎండీసీ ద్వారా అనుమతులు తీసుకుని నిర్మాణాలకు సరిపడా ఇసుక నిల్వలను సమకూర్చుకోవాలని సూచించారు. ఉదయం వేళలోనే ఇసుక రవాణా జరిగేలా చర్యలు తీసుకోవాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ రాత్రి సమయాలలో ఇసుక వాహనాలు తిరుగకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రధాన రహదారి నుండి ఏరియా ఆసుపత్రి వరకు అప్రోచ్ రోడ్డును సైతం నిర్మించాలని సూచించారు. కలెక్టర్ వెంట స్థానిక తహసిల్దార్ శాంత, టీజీఎంఐడీసీ ఏ.ఈ ప్రవీణ్ ఉన్నారు.

## సురక్షితమాతృత్వ కార్యక్రమం ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్



**కామారెడ్డి ఏప్రిల్8( సమయం న్యూస్).:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా వైద్య శాఖ ఆధ్వర్యంలో ఏప్రిల్ 6 నుండి 11 వరకు నిర్వహిస్తున్న ఆరోగ్య వారోత్సవాల సందర్భంగా, ×ణూజ సమావేశ మందిరంలో సురక్షిత మాతృత్వం కార్యక్రమం జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణీ స్త్రీల ఆరోగ్య సంరక్షణకు సురక్షిత మాతృత్వం కార్యక్రమాలు ఎంతో కీలకమని పేర్కొన్నారు. తల్లి, శిశు ఆరోగ్యం రాష్ట్ర అభివృద్ధికి ప్రాధాన్యమైన అంశమని ఆయన అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్య సేవలు, ప్రసూతి సేవలను గర్భిణీలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే, ఆరోగ్య సిబ్బంది గ్రామ స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు మరింత చురుకుగా పనిచేయాలని ఆదేశించారు. అంగన్‌వాడీ మరియు ఆశా కార్యకర్తలు గ్రామ స్థాయిలో గర్భిణీలను గుర్తించి వారికి అవసరమైన పరీక్షలు, పోషకాహారం, టీకాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సురక్షిత మాతృత్వం పై అవగాహన కల్పించేందుకు నిర్వహించిన ప్రత్యేక వర్క్‌షాప్ లో గర్భిణీ స్త్రీల ఆరోగ్యం, ప్రసవానికి ముందు తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోషకాహారం ప్రాముఖ్యత, అలాగే తల్లి, శిశువు సురక్షితంగా ఉండే విధానాలపై అవగాహన పెంపొందించడం. కార్యక్రమంలో నిపుణులైన వైద్యులు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొని, గర్భధారణ సమయంలో తల్లులు ఎదుర్కొనే సమస్యలు, వాటి నివారణ మార్గాలు, సమయానికి వైద్య పరీక్షలు చేయించుకోవడం ఎంత ముఖ్యమో వివరించారు. అలాగే సురక్షిత ప్రసవం కోసం ఆసుపత్రుల్లోనే ప్రసవం జరగాలని సూచించారు. ఈ వర్క్‌షాప్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరిస్తూ సమాజంలో సురక్షిత మాతృత్వంపై అవగాహన పెంపొందుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ౧ఎప్త్రశీ రవీందర్, వైద్య శాఖ అధికారులు, ఆరోగ్య సిబ్బంది, ఇతర సంబంధిత విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## సేఫ్ మదర్ డే కార్యక్రమం ఘనంగా నిర్వహణ




**కరీంనగర్ ఏప్రిల్8( సమయం న్యూస్) :** ఈరోజు ప్రజాపాలన ప్రగతి పథకాలలో భాగంగా సేఫ్ మదర్ డే కార్యక్రమం కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి (జీజీహెచ్)లో ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ డాక్టర్ అశ్విని తానాజీ గారు మరియు జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ గారు పాల్గొని అడిషనల్ కలెక్టర్ గారు ప్రసంగిస్తూ, గర్భిణీ స్త్రీల ఆరోగ్య సంరక్షణ ప్రతి కుటుంబం మరియు సమాజం యొక్క బాధ్యత అని పేర్కొన్నారు. తల్లి ఆరోగ్యం బాగుంటేనే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని తెలిపారు.

జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి ప్రసంగిస్తూ గర్భిణీలు గర్భధారణ సమయంలో నిర్దిష్టంగా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, సమతుల్య పోషకాహారం తీసుకోవాలని, వైద్యుల సూచనలు పాటించాలని సూచించారు. ప్రభుత్వము గర్భిణీ స్త్రీల మరియు శిశువుల ఆరోగ్య రక్షణ కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని, ప్రజలు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఆసుపత్రి వైద్యులు డాక్టర్ పద్మజ మాట్లాడుతూ గర్భిణీలకు సురక్షిత మాతృత్వం, ప్రసూతి ముందు మరియు తరువాత తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరెంటెంట్ డాక్టర్ వీరారెడ్డి, ఐబొ సరస్వతి,పి ఓ ఎం హెచ్ న్ డాక్టర్ సన, వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, గర్భిణీ స్త్రీలు, తల్లులు ఇతర ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# వచ్చే ఖరీఫ్‌లో 150 ఎకరాల్లో ఆయిల్ పామ్ నాటే లక్ష్యం

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష
- రైతులకు సాంకేతిక సూచనలు, నాణ్యమైన మొక్కల పంపిణీపై దృష్టి
- ఆయిల్ పామ్ సాగుతో రైతులకు దీర్ఘకాలిక ఆదాయం
- పాలకుర్తి మండలం ఈసాల తక్కలపల్లి గ్రామంలో ఆయిల్ పామ్ పంట సాగు పై నిర్వహించిన సమీక్ష సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్



**పాలకుర్తి, ఏప్రిల్ 08( సమయం న్యూస్) :** వచ్చే ఖరీఫ్ నాటికి గ్రామంలో అదనంగా 150 ఎకరాల్లో ఆయిల్ పామ్ నాటడమే లక్ష్యంగా పని చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.

బుధవారం పాలకుర్తి మండలం ఈసాల తక్కలపల్లి గ్రామంలో ఆయిల్ పామ్ పంట సాగు పై నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, ఆయిల్ పామ్ పంట రైతులకు దీర్ఘకాలికంగా అధిక ఆదాయం అందించే లాభదాయక పంటగా నిలుస్తుందని తెలిపారు. ప్రభుత్వ ప్రోత్సాహకాలను వినియోగించుకొని రైతులు ఆయిల్ పామ్ సాగును విస్తరించాలని సూచించారు. గ్రామంలో సుమారు 150 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగుకు రైతులు సిద్ధంగా ఉన్నప్పటికీ, గత రెండు సంవత్సరాలుగా వివిధ కారణాల వల్ల నాటడం జరగలేదని తెలిపారు. వచ్చే ఖరీఫ్ సీజన్‌లో ఈ 150 ఎకరాల్లో తప్పనిసరిగా కొత్తగా ఆయిల్ పామ్ నాటేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామంలో ప్రస్తుతం 210 మంది రైతులు 312 ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నారని పేర్కొంటూ, ఆయిల్ పామ్ నాటిన మొదటి మూడు సంవత్సరాల్లో మధ్యంతర పంటగా పత్తిని సాగు చేసి అదనపు ఆదాయం పొందవచ్చని రైతులకు సూచించారు. రైతులకు తక్కువ ఖర్చుతో డ్రిప్ ఇరిగేషన్ ఏర్పాటు చేయడానికి జిల్లా పరిపాలన ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు. రైతుల అందరికీ విద్యుత్ సరఫరా కల్పించబడుతుందని, 40 శాతం వ్యయాన్ని భరించే రైతులకు బోర్‌వెల్లు ఏర్పాటు చేయడానికి కూడా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఆయిల్ పామ్ పంటకు ఎకరాకు నాలుగు సంవత్సరాలపాటు సుమారు రూ.52 వేల విలువైన సబ్సిడీ ప్రభుత్వం అందిస్తున్నదని తెలిపారు. ఈ సందర్భంగా ఆయిల్ పామ్ పంటకు మొదటి విడతగా లబ్ధి పొందిన రైతులు స్వప్న, చంద్రయ్యలకు రూ.43 వేల విలువైన చెక్కులను జిల్లా కలెక్టర్ అందజేశారు. పంట సాగులో శాస్త్రీయ పద్ధతులు అనుసరించడం, నాణ్యమైన మొక్కలను మాత్రమే నాటడం, నీటి నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని తెలిపారు. అలాగే రైతులకు అవసరమైన సాంకేతిక మార్గదర్శకాలు, అవగాహన కార్యక్రమాలు క్రమం తప్పకుండా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మండల స్థాయిలో సాగు పురోగతిని నిరంతరం పరిశీలిస్తూ, సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా హార్టికల్చర్ అధికారి జగన్మోహన్ రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ముల్కనూర్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన వరంగల్ పోలీస్ కమిషనర్



**ముల్కనూర్ ఏప్రిల్ 8( సమయం న్యూస్). :** ఈ రోజు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ బుధవారం ముల్కనూర్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి, స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం పోలీస్ స్టేషన్ అధికారులు, సిబ్బంది సీపీ పనితీరును తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, గ్రామీణ ప్రజల్లో సైబర్ నేరాలపై అవగాహన పెంపొందించాలని, డ్రగ్స్ వినియోగాన్ని అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే "ూతీతీఅజవ ూశ్రీఅజవ" కార్యక్రమం ద్వారా రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగహన కల్పిస్తూ కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. స్టేషన్ రికార్డులను పరిశీలించిన కమిషనర్ మాట్లాడుతూ గ్రామాల హిస్టరీ షీట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని, అధికారులు, సిబ్బంది గ్రామాల పర్యటనలను తరచుగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో , సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత, కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి, ఎల్కతుర్తి సిఐ పులి రమేష్, ఎస్. ఐ రాజు పాల్గొన్నారు.

# వరంగల్ జిల్లాలో అక్రమ మట్టి తవ్వకాలపై పోలీసుల కఠిన చర్యలు

**గీసుగొండ: ఏప్రిల్8( సమయం న్యూస్). :** మండలంలోని చంద్రయ్యపల్లి శివారులో ప్రభుత్వ భూమిలో జరుగుతున్న అక్రమ మట్టి తవ్వకాలపై గీసుగొండ పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. అనుమతులు లేకుండా జేసీబీ సహాయంతో మట్టి తవ్వుతున్న ఏడుగురు వ్యక్తులపై కేసులు నమోదు చేశారు. దాడుల్లో భాగంగా అక్రమంగా మట్టి తరలిస్తున్న ఒక జేసీబీతో పాటు ఆరు ట్రాక్టర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పక్కా సమాచారంతో ఇన్‌స్పెక్టర్ విశ్వేశ్వర్ ఆధ్వర్యంలో ఈ ఆపరేషన్ నిర్వహించి మట్టి అక్రమార్కుల కార్యకలాపాలకు అడ్డుకట్ట వేశారు. ప్రభుత్వ భూములను అక్రమంగా వినియోగించే వారిపై కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. పట్టుబడిన వారిలో మనుగొండ, చంద్రయ్యపల్లి, మహేశ్వరం గ్రామాలకు చెందిన వ్యక్తులు ఉన్నట్లు తెలిపారు.

# ఆరోగ్యకరమైన తల్లి -- ఆరోగ్యకరమైన కుటుంబం, బలమైన సమాజానికి పునాది

## తల్లి ఆరోగ్యం -- ప్రజారోగ్య వ్యవస్థకు అద్దం

## జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా




**జనగాం ఏప్రిల్8( సమయం న్యూస్). :** "ఆరోగ్యకరమైన తల్లి -- ఆరోగ్యకరమైన కుటుంబం, బలమైన సమాజానికి పునాది" అని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పేర్కొన్నారు. 99 రోజుల ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఆరోగ్య వారోత్సవాల కింద మూడో రోజు జిల్లా స్థాయి సురక్షిత మాతృత్వ దినోత్సవ కార్యక్రమ వర్క్ షాప్ ను జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో బుధవారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. తల్లి ఆరోగ్యం అనేది కేవలం ఆరోగ్య సూచిక మాత్రమే కాకుండా, ప్రజారోగ్య వ్యవస్థకు అద్దం పడుతుందని పేర్కొన్నారు. అందువల్ల ఇది కేవలం గణాంకాల పరిమితి కాదని, సమగ్ర అభివృద్ధికి సూచికగా భావించాలన్నారు. గత రెండు దశాబ్దాల కాలంలో భారతదేశంలో మాతా-శిశు మరణాల తగ్గింపులో గణనీయమైన పురోగతి సాధించినప్పటికీ, ఇంకా మెరుగైన చర్యలు అవసరమని తెలిపారు. జిల్లా స్థాయిలో మాతా-శిశు ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో ఆశాలు, ఏఎన్ఎంలు, అంగన్వాడీల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. ముఖ్యంగా హైరిస్క్ గర్భిణీలను త్వరగా గుర్తించడం, సమయానికి వారికి నాణ్యమైన సేవలు అందించడం ప్రధానమన్నారు. ప్రతి గర్భిణీ మహిళను ప్రారంభ దశలోనే నమోదు చేయడం, నియమిత గర్భధారణ పరీక్షలు (ూచీజ), హీమోగ్లోబిన్ పరీక్షలు, రక్తపోటు పరీక్షలు, పోషకాహార సలహాలు, ఐరన్, ఫోలిక్ ఆమ్ల మాత్రలను సరఫరా చేయడం తప్పనిసరిగా ఉండాలని సూచించారు. రక్తహీనత, రక్తపోటు, గర్భకాల మధుమేహం వంటి సమస్యలను సబ్ సెంటర్, పీహెచ్‌సీ, సీహెచ్‌సీ స్థాయిలో సమర్థంగా గుర్తించాలన్నారు. జనని సురక్ష యోజన, జనని శిశు సురక్ష కార్యక్రమం, లక్ష్య (ఞఒంఠ్రఞ) వంటి పథకాలు తల్లి-శిశు ఆరోగ్య సేవలను విస్తరించాయని, ఇవి ప్రతి ఆరోగ్య కేంద్రంలో సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. గర్భధారణ నుంచి ప్రసవం వరకు, అలాగే ప్రసవానంతర కాలం వరకు నిరంతర సేవలు (Continuum of Care) అందించడం అత్యంత ముఖ్యమన్నారు. ప్రసవం తర్వాత తొలి 48 గంటలు అత్యంత కీలకమైనవి అయినందున ఆ సమయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. అదే విధంగా తల్లి ఆరోగ్య పర్యవేక్షణ, తల్లిపాలు పట్టడం, కుటుంబ నియంత్రణపై అవగాహన కల్పించాలన్నారు. తల్లీబిడ్డలు మెరుగైన వైద్య సేవలు పొందేలా అందరూ సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. గర్భిణీ స్త్రీల ఆరోగ్యం, పోషణ, ప్రసూతి సేవల ప్రాముఖ్యతపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. మాతృ మరణాలను తగ్గించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రతి గర్భిణీకి సమయానుకూలంగా వైద్య పరీక్షలు, అవసరమైన పోషకాహారం, టీకాలు అందించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు వాటిని వినియోగించుకునేలా చూడాలన్నారు. ప్రతి గర్భిణీ సురక్షిత ప్రసవం పొందేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో సాధారణ ప్రసవాల శాతాన్ని మరింతగా పెంచాలన్నారు. అలాగే ప్రజలకు సాధారణ ప్రసవాల పట్ల అవగాహన కల్పించాలన్నారు. అన్ని పీహెచ్సీలు, సీహెచ్సీలలో సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. జిల్లాలో ప్రసూతి మరణాలు, పిల్లల మరణాలు ఎక్కడా కూడా జరగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. ఆసుపత్రుల్లో లేబర్ రూంలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. జిల్లాలో తల్లి ఆరోగ్యంపై మరింత శ్రద్ధ పెంచి, సురక్షిత మాతృత్వం సాధించేందుకు కృషి చేయాలని కలెక్టర్ తెలిపారు. అంతకుముందు మాతా-శిశు సంరక్షణపై, పీసీ అండ్ పీఎన్డీటీ యాక్ట్ అమలు, సాధారణ ప్రసవాల పెంపు, పోషకాహారం, తదితరాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వైద్యాధికారులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ మల్లికార్జున రావు, డీసీహెచ్ఎస్ నరేందర్ శర్మ, జీజీహెచ్ సూపరింటెండెంట్ రాజలింగం, డీడబ్ల్యూఓ కోదండరాములు, ప్రోగ్రామింగ్ అధికారి డా. శ్రీ హర్ష, గైనకాలజిస్ట్ లు డా. సునీత, డా. అపర్ణ, డిప్యూటీ డీఎంహెచ్ఓలు, వైద్యాధికారాలు, ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల డాక్టర్లు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# మంచినీటి సమస్య పరిష్కారానికి చర్యలు



**మల్కాజ్గిరి ఏప్రిల్8( సమయం న్యూస్) :** మంచినీటి సమస్య పరిష్కారానికి మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని అన్నపూర్ణ సొసైటీలో రూ.10 లక్షలతో మంజూరైన మంచినీటి పైపుల నిర్మాణ పనులను బుధవారం పరిశీలించారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ ఆదేశాల మేరకు నిర్వహించారు. ఈ సందర్భంగా రాము యాదవ్ మాట్లాడుతూ, అన్నపూర్ణ సొసైటీలో ఉన్న మంచినీటి సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే జలమండలి ఎండీ అశోక్ రెడ్డిని సంప్రదించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరినట్లు తెలిపారు. దీనికి స్పందించిన జలమండలి అధికారులు రూ.10 లక్షలు మంజూరు చేయడంతో పైపుల నిర్మాణ పనులు ఇటీవల పూర్తి అయినట్లు చెప్పారు. ప్రస్తుతం అన్నపూర్ణ సొసైటీలో రోజు విడిచి రోజు మంచినీటి సరఫరా జరుగుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ రఘురాం, బీఆర్ఎస్ నాయకులు సిద్ధి రాములు, బైరు అనిల్, వెంకటేష్, మల్లేష్, రాజా, భాను, కృష్ణ యాదవ్, శ్రీనివాస్ కపూర్ తదితరులు పాల్గొన్నారు.



# బాధ్యతాయుతంగా ప్రజలకు సేవలందించాలి

- జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS

**నారాయణపేట, ఏప్రెల్,08(సమయం న్యూస్) :** ప్రజలకు బాధ్యతాయుతంగా, నిబద్ధతతో సేవలందిస్తే సమాజంలో పోలీసుల పట్ల గౌరవం, మర్యాదలు మరింత పెరుగుతాయని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ పేర్కొన్నారు. నారాయణపేట జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో బుధవారం రోజు నారాయణపేట పోలీస్ స్టేషన్‌కు చెందిన పి. బాలస్వామి, దామరగిద్ద పోలీస్ స్టేషన్‌కు చెందిన ఎస్. వెంకట్ రాములు గౌడ్, మద్దూరు పోలీస్ స్టేషన్‌కు చెందిన ఎం. వాసు రామ్ లు హెడ్ కానిస్టేబుల్ హోదా నుండి అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఏ ఎస్సై)లుగా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా వారు జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ూాను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ వారికి ఏ ఎస్సై "వన్ స్టార్"ను అలంకరించి అభినందనలు తెలియజేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.... పదోన్నతి అనేది కేవలం హోదా పెరుగుదల మాత్రమే కాకుండా, మరింత బాధ్యతను కూడా తెస్తుందని తెలిపారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు భరోసా, నమ్మకాన్ని కలిగించే విధంగా విధులు నిర్వహించాలని, ముఖ్యంగా నిరుపేదలు, బాధితులకు పోలీసులు అండగా నిలవాలని సూచించారు. అలాగే ప్రజలతో సానుభూతితో వ్యవహరించి, న్యాయం అందించే దిశగా కృషి చేయాలని, విధుల్లో క్రమశిక్షణ, నిజాయితీ, సేవా భావం కలిగి ఉండాలని పేర్కొన్నారు. ప్రజల నమ్మకం పొందడం పోలీసుల ప్రధాన బాధ్యత అని, అది సాధ్యమవ్వాలంటే ప్రతి పోలీస్ అధికారి ప్రజల పట్ల సానుకూల దృక్పథంతో పనిచేయాలని సూచించారు. ఏ ఎస్సైలుగా పదోన్నతి పొందిన ఈ ముగ్గురు సిబ్బంది నాగర్ కర్నూల్, వనపర్తి జిల్లాలకు బదిలీ అయ్యారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు నల్లపు లింగయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# సురక్షిత మాతృత్వం ద్వారా తల్లి-శిశు మరణాల రేటును తగ్గించడం సాధ్యమవుతుంది

- ప్రతి గర్భిణీ స్త్రీ ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకొని,
- సురక్షిత ప్రసవాన్ని నిర్ధారించుకోవాలి జిల్లా కలెక్టర్ దీపక్ తివారి.



**వికారాబాద్, ఏప్రెల్,08 (సమయం న్యూస్) :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో వైద్య శాఖ అధ్వర్యంలో ఆరోగ్య వారోత్సవాలు ఏప్రిల్ 6 నుండి 11 వరకుని ర్వహిస్తున్న కార్యక్రమములో బాగంగా బుధవారం కల్లెక్ట్రేట్ కార్యాలయ సమావేశ హాలు నందు జిల్లావిద్యా ఆరోగ్యా శాఖ అధికారి అధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమం లో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో తల్లి-శిశు ఆరోగ్యాన్ని మెరుగుపరచడం లక్ష్యంగా సురక్షిత మాతృత్వంపై ద్రుష్టి సారించాలని, గర్భిణీ స్త్రీలకు అందిస్తున్న వైద్య సేవలు, పోషకాహార కార్యక్రమాలు మరియు ప్రసవ సదుపాయాలపై విస్తృతంగా అవగాహనా కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. ప్రతి గర్భిణీ స్త్రీ తప్పనిసరిగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ప్రీ-నాటల్ చెకప్‌లు చేయించుకోవాలని, కనీసం నాలుగు సార్లు వైద్య పరీక్షలు చేయించుకోవడం అత్యంత అవసరమని సూచించారు. ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రల వినియోగం, టీకాలు సమయానికి తీసుకోవడం, సమతుల ఆహారం తీసుకోవడం పై అవగాహన పెంచాలని తెలిపారు. తప్పని సరిగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో వంద శాతం సురక్షిత ప్రసవాలను ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకోవాలని, హోమ్ డెలివరీలను తగ్గించి ఇన్‌స్టిట్యూషనల్ డెలివరీలను పెంచాలని, అత్యవసర పరిస్థితుల్లో 108 అంబులెన్స్ సేవలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. ఆశా, ఏఎన్ఎం సిబ్బంది గ్రామస్థాయిలో గర్భిణీలను గుర్తించి, వారికి అవసరమైన సేవలు అందేలా పర్యవేక్షించాలని పేర్కొన్నారు. తల్లి-శిశు మరణాల రేటును తగ్గించడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, తల్లి బిడ్డ క్షేమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అంగన్వాడి లు ఆశలు,అధికారులు గర్భిణీ స్త్రీలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖఅధికారి స్వర్ణ కుమారి, డి సి ఎచ్ ఎస్ డాక్టర్ ఆనంద్, డి ఆర్ డి ఎ శ్రీనివాస్, జి జి ఎచ్ ఎస్ సూపర్డెంటైటెంట్ రాజ్యలక్ష్మి, వరలక్ష్మి, ప్రోగ్రాం అధికారులు రవీందర్, పవిత్ర, డి డబ్ల్యూ ఓ కృష్ణవేణి, సంబంధిత అధికారులు ,ఆశలు, తదితరులు పాల్గొన్నారు.

# నల్లాకు అక్రమంగా బిగించిన మోటార్లు స్వాధీనం



**హైదరాబాద్ ఏప్రిల్8( సమయం న్యూస్) :** జీహెచ్ఎంసీతో పాటు ఔటర్ రింగు రోడ్డు వరకు విస్తరించిన హైదరాబాద్ మహా నగరానికి జలమండలి ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి సుదూర ప్రాంతాల నుంచి పైపు లైన్ల ద్వారా తాగునీరు సరఫరా చేస్తోంది. కొన్ని ప్రాంతాల్లో వినియోగదారులు తమ నల్లాలకు మోటార్ల బిగించుకోవడం జలమండలి అధికారుల దృష్టికి వచ్చింది. దీని వల్ల మిగిలిన వినియోగదారులకు.. లో- ప్రెజర్ తో నీటి సరఫరా జరుగుతోంది. ఇలా చేయడం చట్టరీత్యా నేరం. ఈ నేపథ్యంలో జలమండలి విజిలెన్స్ అధికారులు క్రమంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. జలమండలి పైపులైనుకు నేరుగా విద్యుత్ మోటార్లు బిగించి నీటిని అక్రమంగా తోడుతున్న మోటార్లు సీజ్ చేసారు. బుధవారం రోజున ఓ అండ్ ఎం డివిజన్ నంబర్-6, ఎస్ఆర్ నగర్ పరిధిలోని ఎస్ఆర్టి కాలనీలో నల్లాకు మోటార్లు బిగిస్తున్నారని స్థానికులు జలమండలి విజిలెన్సు అధికారులకు సమాచారం అందించారు.. దీంతో స్పందించిన అధికారులు నీటి సరఫరా సమయంలో పర్యటించి పైపులైనుకు అక్రమంగా బిగించిన 7 మోటార్లను స్వాధీనం చేసుకున్నారు. ఎవరైనా వినియోగదారులు ఇలా తమ నల్లాలకు మోటార్లు బిగించి పట్టుబడితే.. వారిపై జలమండలి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడంతో పాటు మోటార్లు సీజ్ చేస్తారు. రెండోసారి మోటార్లు బిగిస్తే రూ.5 వేలు జరిమానా విధించి కేసులు నమోదు చేస్తారు. కాబట్టి వినియోగదారులెవరూ నల్లాకు మోటార్లు బిగించవద్దని జలమండలి విజ్ఞప్తి చేస్తోంది. ఒకవేళ తక్కువ ప్రెజర్ తో నీరు సరఫరా అయినా.. లేదా నీటి సరఫరాలో ఏవైనా ఇతర సమస్యలు తలెత్తినా.. తమకు దగ్గర్లోని సంబంధిత మేనేజర్, డీజీఎం, జీఎం అధికారులను సంప్రదించాలి. లేదా జలమండలి కస్టమర్ కేర్ నంబరు 155313 కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు. వాటిపై తప్పకుండా తగిన చర్యలు తీసుకుని సమస్యల్ని పరిష్కరిస్తారు.

## ఘోర రోడ్డు ప్రమాదం: మద్యం మత్తులో డ్రైవింగ్... ఇద్దరు ఇంజినీరింగ్ విద్యార్థులు మృతి

**హైదరాబాద్, ఏప్రిల్ 8( సమయం న్యూస్).** నగరంలో మరోసారి మద్యం మత్తులో డ్రైవింగ్ ప్రాణాంతకంగా మారింది. హస్తినాపురం ప్రాంతంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ఇంజినీరింగ్ విద్యార్థులు దుర్మరణం పాలయ్యారు. వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ప్రమాదంలో మహావీర్ ఇంజినీరింగ్ కాలేజీకి చెందిన రెండో సంవత్సరం ఈసీఈ విద్యార్థులు శివ (19), సందీప్ జోయెల్ (19) బైక్‌పై ప్రయాణిస్తుండగా, వెనుక నుంచి వేగంగా వచ్చిన హోండా సిటీ కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదం తీవ్రతకు బైక్‌పై ఉన్న ఇద్దరూ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. అదేవిధంగా, కారు అదుపుతప్పి ఓ పాదచారిని ఢీకొట్టి పలుమార్లు తిప్పుకుని చివరకు రోడ్డుపై తలకిందులుగా ఆగింది. ప్రమాదంలో గాయపడిన శ్రీధర్ (23)ను సమీపంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనలో కార్ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతను మద్యం సేవించి వాహనం నడిపినట్లు అనుమానం వ్యక్తమవుతోంది. ఈ ఘటన నగరంలో రోడ్డు భద్రతపై, ముఖ్యంగా మద్యం మత్తులో డ్రైవింగ్‌పై మరోసారి ఆందోళన వ్యక్తం చేస్తోంది.

## రెండు రాష్ట్రాల్లో కనుమరుగవుతున్న మామిడి పంట -- అకాల వర్షాలతో రైతన్న కష్టాలు రెట్టింపు

**అమరావతి/హైదరాబాద్, ఏప్రిల్ 8( సమయం న్యూస్) :** నోటి దాకా వచ్చిన ముద్దను ప్రకృతి కబళిస్తున్న దుస్థితి రెండు తెలుగు రాష్ట్రాల్లో కనిపిస్తోంది. ఏడాది పొడవునా కంటికి రెప్పలా కాపాడుకున్న మామిడి తోటలు, అకాల వర్షాలు మరియు గాలివానల ధాటికి తీవ్రంగా దెబ్బతిన్నాయి. పండుదశలో ఉన్న కాయలు గాలికి రాలిపోతుండగా, రైతన్న గుండె ముక్కలవుతోంది.

**దారుణ పరిస్థితిఅకాల వర్షాల దెబ్బ:** ఊహించని సమయంలో కురిసిన వర్షాలతో చేతికి రావాల్సిన పంట నేలరాలుతోంది.

**భారీ పెట్టుబడి నష్టం:** ఎరువులు, పురుగుమందులు, కూలీల కోసం చేసిన ఖర్చులు వృథాగా మారడంతో రైతులు అప్పుల బారిన పడుతున్నారు.

**నాణ్యత పడిపోవడం:** తడిసిన, దెబ్బతిన్న కాయలకు మార్కెట్‌లో సరైన ధర లభించక, దళారుల చేతిలో నష్టపోతున్నారు.

**రైతుల మౌన రోదన:** పంట లాభాలతో పిల్లల చదువులు, పెళ్లిళ్లు చేయాలనుకున్న ఆశలు నీటిలో కలిసిపోతున్నాయి.

**ప్రభుత్వంపై విజ్ఞప్తి:** నష్టపోయిన మామిడి రైతులకు తక్షణమే పంట నష్టపరిహారం ప్రకటించి, ఆర్థికంగా ఆదుకోవాలని రైతులు మరియు ప్రజాప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు. టీడీపీ మాజీ ఎమ్మెల్యే కాత్రగడ్డ ప్రసూన మాట్లాడుతూ, రైతులను కాపాడేందుకు ప్రభుత్వం వెంటనే స్పందించి, సమగ్ర చర్యలు చేపట్టాలని కోరారు.

## అత్యవసర వైద్య సేవల విభాగాలను వైద్యులకు త్వరితగతిన అందుబాటులోకి తేవాలి:

- ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు కార్పొరేట్ తరహా వైద్య సేవలు అందాలి
- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.



**నిర్మల్ ఏప్రిల్8( సమయం న్యూస్). :** జిల్లా ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి ప్రాంగణంలోని అత్యవసర వైద్య సేవల విభాగాన్ని త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, పట్టణంలోని జిల్లా ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి ప్రాంగణంలో నిర్మాణం చివరిదశలో ఉన్న అత్యవసర వైద్య సేవల విభాగాన్ని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తనిఖీ చేశారు. ఆసుపత్రి భవంతి నిర్మాణానికి సంబంధించి మ్యాపులను సంబంధిత అధికారులు కలెక్టర్ కు వివరించారు. ఆసుపత్రి నిర్మాణం పూర్తయిన వివరాలు, ఇంకా చేపట్టవలసిన పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత వివిధ విభాగాలను పరిశీలించారు. శస్త్ర చికిత్సల గదులు, డయాలసిస్ కేంద్రం, ఐ.సి.యు, గైనిక్ విభాగం, ఎలక్ట్రికల్ యూనిట్, ఫైర్ సేఫ్టీ విభాగాలు పరిశీలించారు. మిగిలి ఉన్న పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు వైద్య సేవల నిమిత్తం అందుబాటులోకి తేవాలన్నారు. అనంతరం సమీపంలోని యుడిఐడి (సదరం) కేంద్రం, డ్రగ్స్ డి అడిక్షన్ సెంటర్ లు పరిశీలించారు. ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిని తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని అత్యవసర వైద్య సేవల విభాగం, రక్త పరీక్షల గది, తదితర విభాగాలు పరిశీలించారు. అన్ని రకాల రిజిస్టర్లను చూశారు. బ్లడ్ బ్యాంక్ ను తనిఖీ చేసి, రికార్డు పరిశీలించారు. రికార్డుల్లో ఇంతకుముందు బ్లడ్ బ్యాంక్ ద్వారా రక్తం పొందిన వారికి ఫోన్ చేసి, వివరాలు సరిపోల్చారు. రికార్డులు, రసీదులు పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. వైద్యులు, సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటిస్తూ, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. ఈ తనిఖీలలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ శారద, తహసీల్దార్ రాజు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు పట్టణంలోని గుల్జార్ మార్కెట్ ప్రాంతంలో గల బస్తీ దవాఖానను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని అన్ని రకాల రిజిస్టర్లను పరిశీలించారు. ఆస్పత్రిలో చికిత్స కొరకు రోగులకు సేవా దృక్పథంతో వైద్యం అందించాలన్నారు. ఆసుపత్రి ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవల గురించి వివరాలు వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రాజేందర్, అధికారులు సౌమ్య, స్థానిక కౌన్సిలర్ తౌహిదుద్దిన్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యమే మహాభాగ్యం

- చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య



**చేవెళ్ల, ఏప్రిల్ 08: (సమయం న్యూస్) :** ఆరోగ్యమే మహాభాగ్యం అని, యువతతో పాటు అన్ని వయసుల వారు ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య సూచించారు. చేవెళ్ల మున్సిపాలిటీ కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన లారా ఫిట్నెస్ క్లబ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ, ఆధునిక జీవన శైలిలో ఫిట్నెస్ ఎంతో అవసరమైందని, ఇలాంటి ఫిట్నెస్ సెంటర్లు గ్రామీణ ప్రాంతాల్లో కూడా అందుబాటులోకి రావడం అభినందనీయమన్నారు. ప్రజలు ఆరోగ్యంగా ఉంటేనే సమాజం అభివృద్ధి చెందుతుందని, వ్యాయామం, క్రమశిక్షణతో కూడిన జీవన విధానం అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత మరియు ఫిట్నెస్ క్లబ్ నిర్వాహకులు పాల్గొన్నారు.

## సురక్షిత మాతృత్వంతో ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం సాధ్యం

- టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డి
- తల్లి--శిశు ఆరోగ్య పరిరక్షణకు సమిష్టి కృషి అవసరం
- జిల్లా కలెక్టర్ ప్రావీణ్య




**సంగారెడ్డి, ఏప్రిల్ 08( సమయం న్యూస్). :** సురక్షిత మాతృత్వంతోనే ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డి అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న హెల్త్ వీక్ కార్యక్రమాల్లో భాగంగా బుధవారం మెడికల్ కళాశాల సమావేశ మందిరంలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో "సేఫ్ మదర్ డే" కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలకు అవసరమైన ఆరోగ్య సేవలపై అవగాహన కల్పించడంతో పాటు ఏఎన్‌సీ చెకప్‌లు మాతృ మరణాల రేటు తగ్గించడం సి-సెక్షన్, హై రిస్క్ గర్భధారణలు, అత్యవసర పరిస్థితులు, పీసీపీఎన్‌డీటీ చట్టం వంటి అంశాలపై డాక్టర్లకు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య హాజరై జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ, తల్లి--బిడ్డల ఆరోగ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల వైద్య సదుపాయాలను అందిస్తున్నదన్నారు. గర్భధారణ ప్రారంభం నుంచే క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, రక్తహీనత నివారణకు పోషకాహారం తీసుకోవాలని సూచించారు. పుట్టబోయే శిశువు ఆరోగ్యంగా ఉండేందుకు వైద్యుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. చిన్న వయసులో గర్భధారణ వల్ల అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశమున్నందున మైనర్ బాలికల వివాహాలను అరికట్టడం ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ, సురక్షిత ప్రసవాలు మరియు తల్లి--శిశు ఆరోగ్య పరిరక్షణకు వైద్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గర్భధారణ సమయంలో సమయానుకూల వైద్య పరీక్షలు, టీకాలు, పోషకాహారం ద్వారా తల్లి మరియు శిశువు ఆరోగ్యాన్ని కాపాడవచ్చన్నారు. సమగ్ర ప్రణాళికతో పనిచేసి మాతృ మరణాల రేటును (Maternal Mortality) జీరోకు తీసుకురావడానికి కృషి చేయాలని తెలిపారు. కొత్తగా తల్లులైన మహిళలకు అవసరమైన జాగ్రత్తలపై విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఆసుపత్రి స్థాయిలో ఆశా, ఏఎన్ఎంల ద్వారా మండల సమాఖ్య మహిళలకు తల్లి--బిడ్డల సురక్షితంపై వర్క్‌షాప్‌లు నిర్వహించి గర్భిణులకు సమగ్ర సమాచారం చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే పీసీపీఎన్‌డీటీ చట్టాన్ని కట్టుదిట్టంగా అమలు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాతా, శిశు ఆరోగ్య పరిరక్షణ, సురక్షిత ప్రసవాల ప్రాముఖ్యతపై విస్తృతంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సేఫ్ మదర్ హుడ్ పోస్టర్లను ఆవిష్కరించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. వసంత్ రావు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డా. మురళీకృష్ణ, డీసీహెచ్ఎస్ డా. కవిత, ప్రోగ్రాం అధికారులు డా. నాగనిర్మల, డా . శశాంక్ , డాక్టర్లు, మెడికల్ ఆఫీసర్లు, గర్భిణీలు పాల్గొన్నారు.




## ఏప్రిల్ 9 నుంచి -- 21 వరకు క్యూర్ పరిధిలోని 2- బిహెచ్ కె కాలనీల్లో దుకాణాల విక్రయాలు

- అందుబాటులో 36 కాలనీల్లోని 1400 కు పైగా షాపులు
- వచ్చే ఆదాయం ఆయా కాలనీల అభివృద్ధికే వినియోగం

**హైదరాబాద్, ఏప్రిల్ 8( సమయం న్యూస్). :** హైదరాబాద్ పరిసరాల్లోని క్యూర్ పరిధిలోని డబుల్ బెడ్ రూం కాలనీల్లోని 1400 కు పైగా దుకాణాలను బహిరంగ వేల ద్వారా విక్రయించే ప్రక్రియ (ఏప్రిల్ 9 వ తేదీ)గురువారం నుంచి ప్రారంభం కానున్నది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల పరిధిలోని 36 కాలనీల్లో ఉన్న దుకాణాలను వేలం ద్వారా విక్రయించడానికి ఆయా జిల్లా కలెక్టర్లు నోటిఫికేషన్లు కూడా ఇచ్చారు. ఈ ప్రక్రియలో భాగంగా తొలుత రంగారెడ్డి జిల్లా పరిధిలోని 8 కాలనీల్లోని 273 షాపులకు ఈ నెల 9,10 తేదీల్లో వేలం ప్రక్రియను నిర్వహించనున్నారు. వందలాది కుటుంబాలు నివసించే కాలనీ ల్లో, స్థానికుల అవసరాలకు అనుగుణంగా వ్యాపారకార్యక్రమాలు నిర్వహించుకునేలా 60-400 చదరపు అడుగుల విస్తీర్ణంలో పలు దుకాణాలను నిర్మించారు. వీటిని ఉన్నవి ఉన్నట్లుగా (ూాం అం ఎష్ట్రవతీవ అం ఎశీఅంఅశీఅ) అన్న ప్రాతిపదికన విక్రయిస్తున్నట్లు హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరక్టర్ శ్రీ వి.పి.గౌతం తెలిపారు. వీటికి కనీస ధరలను కూడా బహిరంగ మార్కెట్ కంటే తక్కువగా నామమాత్రంగానే నిర్ధారించారు. ఆసక్తి ఉన్న వారు ఆయా కాలనీలను సందర్శించి, తమకు నచ్చిన, అనువైన దుకాణాలను ఎంపిక చేసుకోవచ్చన్నారు. వేలం పాటలో పాల్గొనదలచిన వారు నిర్ణీత మొత్తం ధరావతు (ఇంఎండి) తో వేలం నిర్వహించే తేదీల్లో ఉదయం గం.11.00 లోగా సంబంధిత ఆర్డీవో కార్యాలయంలో రిజిస్టర్ చేసుకోవచ్చని ఆయన వివరించారు.

**ఈ నిధులను ఎందుకు వినియోగిస్తారంటే.....** పేదల వర్గాల ప్రజల కోసం మంచి వసతులతో, ఆహ్లాదకరమైన పరిసరాలతో అన్ని సదుపాయాలను కల్పిస్తూ ప్రభుత్వం డబుల్ బెడ్ ఇండ్ల కాలనీలను నిర్మిస్తున్నది. ఈ కాలనీల నిర్వహణ నిమిత్తం, ఈ దుకాణాల వేలం ద్వారా వచ్చిన ఆదాయాన్ని వినియోగించనున్నారు. ఆయా కాలనీల్లోని షాపుల విక్రయాల ద్వారా వచ్చిన మొత్తాన్ని అదే కాలనీ కోసమే వాడుకునేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందుకు సహకార సంఘాల చట్టం క్రింద కాలనీ నివాసితుల సంక్షేమ సంఘాలను( వేల్ఫేర్ అసోసియేషన్లను) ఏర్పాటు చేస్తారు. వాటి ఆధ్వర్యంలో ఈ కాలనీల నిర్వహణ-అభివృద్ధికి జాయింట్ అక్కౌంట్ ద్వారా ఈ నిధులను వినియోగించనున్నారు. ఇందుకోసం షాపుల ద్వారా వచ్చిన మొత్తాన్ని కార్పస్ ఫండ్ గా డిపాజిట్ చేస్తారు. దాని ద్వారా వచ్చే ఆదాయం తోపాటు, ఫ్లాట్ల లో నివసించే వారి నుంచి మెయిన్ టెయిన్స్ రూపేణా ప్రతి నెలా వసూలు చేసే మొత్తంతో ఆయా కాలనీల నిర్వహణను చేపడతారు. ప్రధానంగా కామన్ ఏరియాల్లోని లైట్లు, లిఫ్టులు, బోరింగ్ మొదలైన వాటి నిర్వహణ ఖర్చులతో పాటు, అత్యవసరంగా అవసరమైన చిన్నచిన్న మరమ్మత్తులు మొదలైన వాటి కోసం ప్రభుత్వంపై ఆధార పడకుండా, ఈ నిధులను వినియోగించుకునేలా ఏర్పాటు చేశారు. అంతే కాకుండా కాలనీల్లోని దుకాణాల ద్వారా పలువురికి ఉపాధి లభించడంతోపాటు స్థానికులకు అవసరమైన నిత్యావసర వస్తువులు అందుబాటులోకి వస్తాయన్నది ప్రభుత్వ ఉద్దేశ్యం.

**వేలం నిర్వహించే తేదీలు...** ఏప్రిల్ 9,10 తేదీల్లో రంగారెడ్డి జిల్లాలోని 8 కాలనీల్లో 273 దుకాణాల వేలం ప్రక్రియ అనంతరం 15, 16 తేదీల్లో హైదరాబాద్ జిల్లా పరిధిలోని 10 కాలనీల్లోని 77 దుకాణాలకు, ఏప్రిల్ 15 మరియు 17తేదీల్లో మేడ్చల్- మల్కాజిగిరి జిల్లాలోని 12 కాలనీల్లోని 892 షాపులకు , సంగారెడ్డి జిల్లా పరిధిలోని 6 కాలనీల్లోని 372 షాపులకు 15 నుంచి 18 వ తేదీ వరకు, మరియు 21 వ తేదీన బహిరంగ వేలం నిర్వహించనున్నారు. ఈ దుకాణాల విక్రయాలకు సంబంధించిన అదనపు సమాచారం కోసం ఆయా జిల్లాల హౌసింగ్ ప్రాజెక్టు డైరక్టర్ లను సంప్రదించవచ్చని ఎండి శ్రీ విపి గౌతం వివరించారు.

## నారాయణపేట లోని బ్యాంకులు, ఏటీఎంల వద్ద ఆకస్మిక తనిఖీ.

- బ్యాంకులు, ATM\ వద్ద అప్రమత్తత ఉండాలి: నారాయణపేట సీఐ శివశంకర్
- ప్రజలకు అవగాహన కల్పించిన సీఐ శివశంకర్ మరియు ఎస్సై వెంకటేశ్వర్లు..



**నారాయణపేట, ఏప్రిల్,08(సమయం న్యూస్) :** నారాయణపేట జిల్లా కేంద్రంలో బుధవారం పోలీసు అధికారులు బ్యాంకులు, ఏటీఎంల వద్ద ఆకస్మిక తనిఖీలు నిర్వహించి కస్టమర్లకు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ తనిఖీలు నారాయణపేట సీఐ శివశంకర్, ఎస్సై వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించబడ్డాయి. అధికారులు పలు బ్యాంకులను సందర్శించి, అక్కడికి వచ్చే కస్టమర్లతో మాట్లాడి నగదు లావాదేవీల సమయంలో పాటించాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ముఖ్యంగా పెద్ద మొత్తంలో నగదు డ్రా చేసి ఇంటికి తీసుకెళ్లే సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అధికారులు మాట్లాడుతూ... బ్యాంకులు, ఏటీఎంల వద్ద రోజూ పెద్ద సంఖ్యలో ప్రజలు లావాదేవీలు నిర్వహిస్తున్న నేపథ్యంలో దొంగలు కస్టమర్లను లక్ష్యంగా చేసుకుంటున్నారని తెలిపారు. ముఖ్యంగా అధిక మొత్తంలో నగదు డ్రా చేసే వారిని గమనించి, వారి వెంట వెళ్లి మార్గమధ్యలో దొంగతనాలకు పాల్పడే ఘటనలు పెరుగుతున్నాయని హెచ్చరించారు. కస్టమర్లు తప్పనిసరిగా ఈ క్రింది జాగ్రత్తలు పాటించాలని సూచించారు

**ఏటీఎం వద్ద అపరిచితులకు కార్డు ఇవ్వకూడదు**
**ఏటీఎం పిన్ నెంబర్ ఎవరితోనూ పంచుకోకూడదు**
**అపరిచితులు చెప్పే మాటలను నమ్మరాదు**

అధిక మొత్తంలో డబ్బులు తీసుకెళ్తున్నప్పుడు ఒంటరిగా కాకుండా ఇద్దరు లేదా ముగ్గురు కలిసి వెళ్లాలి డబ్బులు తీసుకున్న వెంటనే నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా జాగ్రత్తగా ఇంటికి చేరుకోవాలిఇంకా బ్యాంకు పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని అలాగే సైబర్ నేరాలు జరిగి అకౌంట్లు డబ్బులు పోతే వెంటనే గోల్డెన్ అవర్స్ లో 1930 టోల్ ఫ్రీ నెంబర్ కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రజల భద్రత కోసం పోలీసులు నిరంతరం చర్యలు తీసుకుంటున్నారని, ప్రజలు కూడా అప్రమత్తంగా ఉంటేనే ఇలాంటి నేరాలను పూర్తిగా నివారించగలమని అధికారులు తెలిపారు.

## డాక్టరు అన్నపూర్ణకు రాష్ట్రస్థాయి పురస్కారనికి హాస్పిటల్స్ సిబ్బంది ఘన సన్మానం



**సమయం న్యూస్ గజ్వేల్ ఏప్రిల్ 08 :** ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని వైద్యారోగ్య శాఖలో విశేష ప్రతిభ కనబరిచిన వారికి అందజేసే రాష్ట్రస్థాయి పురస్కారానికి సిద్దిపేట జిల్లా, గజ్వేల్ జిల్లా కేంద్ర ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా బుధవారం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైద్యులు, నర్సింగ్ మరియు ఇతర సిబ్బంది ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ అన్నపూర్ణ మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో ప్రతిష్టాత్మక పురస్కారం లభించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ విజయం కేవలం తన ఒక్కరి కృషి వల్ల సాధ్యం కాలేదని, ఆసుపత్రిలోని ప్రతి ఒక్క ఉద్యోగి అంకితభావానికి దక్కిన గౌరవమని పేర్కొన్నారు. వైద్యులు,నర్సింగ్ ఆఫీసర్స్ ఫార్మసిస్టులు, పారామెడికల్ మరియు శానిటేషన్ సిబ్బంది అంతా ఒక కుటుంబంలా కలిసి పనిచేయడం వల్లే ఈ గుర్తింపు లభించింది. ఈ అవార్డు నాపై బాధ్యతను మరింత పెంచిందన్నారు. సిద్దిపేట జిల్లాను వైద్యారోగ్య రంగంలో రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలిపేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. తమకు సహకరించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ ఆర్. ఎమ్. ఓ .డాక్టర్ రాము డాక్టర్ శ్రీధర్. డాక్టర్ ప్రణీత, లైన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ కుమార్ స్వామి భగవద్గీత బుక్కు అందించి, శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ సతీష్ కుమార్ , లలిత. భాను. ఫార్మసీ ఆఫీసర్స్ ఎప్సిబా, శశి ప్రియ, శిరీష, స్వర్ణలత, మోహన్ బండారి, హెల్త్ అసిస్టెంట్ దేవసాని వాసుదేవ్ ,ప్రభాకర్, చీఫ్ వీడియో గ్రాఫర్ విద్యాసాగర్, ,నర్సింగ్ ఆఫీసర్స్, షాహిన్, ఉమామహేశ్వరి, నజీర్ అహ్మద్ ,గౌతమ్, సానిటరీ ఇన్స్పెక్టర్ లక్ష్మి, ఇన్ఫెక్షన్ కంట్రోల్ నర్సింగ్ ఆఫీసర్ మేహారాజ్ భాను, ఆరోగ్య మిత్ర ,గంగాల సురేందర్, ఎం.ఆర్.డి. రికార్డ్ సెక్షన్ ఇంచార్జ్ సుధాకర్ ,థియేటర్ అసిస్టెంట్ వెంకటేష్. ల్యాబ్ టెక్నీషియన్స్ రమేష్, జీవన, రచన, ఎల్డి కంప్యూటర్ దుర్గాప్రసాద్, మధు. కమలాకర్, కనకయ్య, 108 ఈ.ఎం.టి పైలెట్స్ పరశురాములు, ఆరోగ్యం, రఘుపతి బాలయ్య, శానిటేషన్ సూపర్వైజర్ శేఖర్, సాయిబాబా, మరియు హాస్పిటల్ సిబ్బంది అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమం విజయవంతం చేసినారు.

# కాలుష్యం మాకు.. రోగాలు మాకూ.. అభివృద్ధి మీకా?

- సి ఎస్ ఆర్ నిధుల తరలింపు పైన పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆగ్రహం..
- స్థానిక పరిశ్రమల సిఎస్ఆర్ నిధులు స్థానిక అభివృద్ధి పనులకు కేటాయించాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్యకు వినతి..
- నిధులు కేటాయించని పక్షంలో ప్రజా ఉద్యమం..





**పటాన్ చెరు, ఏప్రిల్ 8 (సమయం న్యూస్):**ఆసియాలోని అతిపెద్ద పారిశ్రామిక వాడగా పేరుందిన పటాన్ చెరు నియోజకవర్గ పరిధిలోని పరిశ్రమల సిఎస్ఆర్ నిధులను స్థానిక అభివృద్ధి పనుల కోసం కేటాయించాలని పటాన్ చెరు శాసనసభ్యులు శ్రీ గూడెం మహిపాల్ రెడ్డి గారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం జిల్లా కలెక్టర్ ప్రావిణ్యకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ..పచ్చటి పొలాలు.. మూడు పంటలు పండే భూములు.. స్వచ్ఛమైన గాలి.. అందమైన తమ పల్లెల పరిధిలో అభివృద్ధి కోసం నూతన పరిశ్రమలు ఏర్పాటు అయితే తమ గ్రామాలు అభివృద్ధి చెందడంతో పాటు స్థానికంగా ఉపాధి లభిస్తుందన్న కొంగత్త ఆశలతో పటాన్ చెరు నియోజకవర్గ ప్రజలు 70వ దశకంలో పరిశ్రమల ఏర్పాటునకు స్వాగతం పలికారు అన్నారు. పటాన్ చెరు నియోజకవర్గ పరిధిలోని ఇస్నాపూర్, పాశమైలారం, పటాన్చెరు, జిన్నారం మండల పరిధిలోని గడ్డపోతారం, కాజీపల్లి, కిష్టాయపల్లి, బొల్లారం, గుమ్మడిదల మండల పరిధిలోని బొంతపల్లి, గుమ్మడిదల, అమీన్పూర్ మండల పరిధిలోని సుల్తాన్పూర్, గండిగూడెం, దయరా గ్రామాల పరిధిలో వివిధ రంగాలకు చెందిన పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. ప్రధానంగా బల్క్ డ్రగ్స్ పరిశ్రమలతో పాటు కెమికల్స్, మెడిసిన్స్, పెస్టిసైడ్స్ కంపెనీలు ఏర్పాటయ్యాయని తెలిపారు. పటాన్ చెరు నియోజకవర్గ కాలుష్య పరిస్థితులపై సుప్రీంకోర్టు సైతం జస్టిస్ మిగతా కమిషన్ ఏర్పాటు చేసి.. ప్రత్యేక నివేదిక తప్పించుకుంది. అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గవర్నర్ రంగరాజన్ సైతం స్వయంగా నియోజకవర్గంలో పర్యటించి కాలుష్య పరిస్థితులను తెలుసుకున్నారని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు 2016లో చెన్నైలోని జాతీయ హరిత ట్రిబ్యునల్ కాలుష్య నివారణ అంశంపై కీలక ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. కాలుష్యం మూలంగా వ్యాధులకు గురవుతున్న ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు 200 పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి తో పాటు.. ఇస్నాపూర్ పెద్ద చెరువు, గండిగూడెం, ఆసాని కుంట, కిష్టారెడ్డిపేట చెరువుల పరిధిలో సీవరేజ్ ట్రీట్మెంట్ సైతం ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని బల్క్ డ్రగ్స్ పరిశ్రమలు ప్రతి సంవత్సరం తమ లాభాల్లో 0.5 శాతం డబ్బులు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలోని ప్రత్యేక అకౌంట్లో జమ చేసి.. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్వహణకు ఆదేశాలు సైతం జారీ చేసిందన్నారు. 2023 లో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత.. పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని వివిధ పరిశ్రమలు అందిస్తున్న సి.ఎస్.ఆర్ నిధులను స్థానికంగా ఖర్చు చేయకుండా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు తరలిస్తున్నారని వివరించారు. నీళ్లు నిధులు నియామకాలు అన్న అంశంతో ఏర్పాటైన ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో.. స్థానిక నిధులు స్థానికంగా ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు . ప్రతి రోజు కాలుష్య జలాలు.. విష వాయువులతో జీవనం కొనసాగిస్తున్న పటాన్చెరు నియోజకవర్గ ప్రజలకు పరిశ్రమలు అందిస్తున్న సి ఎస్ ఆర్ నిధుల ద్వారా వివిధ అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నాము. గత రెండున్నర సంవత్సరాలుగా సి ఎస్ ఆర్ నిధులు లేకపోవడం మూలంగా అభివృద్ధి కుంటూ పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశంపై ప్రభుత్వం వెంటనే స్పందించి పటాన్చెరు నియోజకవర్గం నుండి చెల్లిస్తున్న సి ఎస్ ఆర్ నిధులను స్థానికంగా ఖర్చు పెట్టాలని.. లేని పక్షంలో ప్రజల నిరసనను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్, జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, మాజీ జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, దశరథ్ రెడ్డి, వెంకటేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ ఎస్టీ కేసుల్లో బాధితులకు నష్టపరిహారం అందించేందుకు చర్యలు చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్.




**వికారాబాద్, ఏప్రిల్,08(సమయం న్యూస్) :** ఎస్సీ ఎస్టీ కేసుల్లో బాధితులకు నష్టపరిహారం అందించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని నారాయణపేట జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ కుమార్ తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎస్సీ ఎస్టీ కేసులను పోలీసు అధికారులు సీరియస్ గా తీసుకుని బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుల పేర్లు అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో డిఎస్పి నల్ల పు లింగయ్య,2024 లో 34, 2025 లో 24 ఈ సంవత్సరం ఇప్పటిదాకా 10 ఎస్సీ ఎస్టీ కేసులు జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల లో నమోదు అయ్యాయని, గత నెలలోనే 4 కేసులు నమోదైనట్లు వివరించారు. ఆయా కేసులు ప్రధానంగా భూ వివాదాల పైనే అవుతున్నాయన్నారు. అనంతరం ఎస్పీ డాక్టర్ వినీత్ కుమార్ మాట్లాడుతూ.. ఫిర్యాదులు వస్తే ఖచ్చితంగా ఎస్సీ ఎస్టీ కేసులు నమోదు చేస్తున్నారని తెలిపారు. కానీ గ్రామస్థాయిలోనే ఫిర్యాదులు రాకుండా అక్కడే పరిష్కారం చేసుకుంటున్నట్లు తెలుస్తోందన్నారు. అకౌంట్ డీటైల్స్ లేనందున ఎస్సీ ఎస్టీ కేసులకు సంబంధించింది నష్టపరిహారం చెల్లింపు విషయంలో ఆలస్యం జరుగుతోందని సీ సెక్షన్ అధికారిని జయసుధ తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ ఫణీంద్ర రెడ్డి, షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ/ ఎస్సీ కార్పొరేషన్ ఈ డీ ఖలీల్, జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్ రెడ్డి,ఏ ఎస్ డబ్లు ఓ పరమేశ్,తదితరులు పాల్గొన్నారు.




## మహిళ గల్లంతు,హత్య మరియు దొంగతనం కేసు ఛేదించిన కులక్చర్ల పోలీసులు

- కులక్చర్ల పోలీసులను అభినందించిన పరిగి డీఎస్పీ శ్రీనివాసులు

**కుల్కచర్ల, మండలం, ఏప్రిల్,08(సమయం న్యూస్) :** పరిగి సర్కిల్ పరిధిలోని కుల్కచర్ల పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నెం. 54/2026 కింద మహిళ గల్లంతు కేసుగా నమోదు అయిన ఘటనను పోలీసులు వేగవంతమైన దర్యాప్తుతో హత్య మరియు దొంగతనం కేసుగా ఛేదించారు. 05.04.2026 నాడు ఉదయం గండీడ్ మండలం, పగిడ్యాల్ గ్రామానికి చెందిన బాపనిపల్లి లక్ష్మి (మృతురాలి కూతురు) ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయబడింది. దర్యాప్తులో భాగంగా పోలీసులు వివిధ కోణాల్లో విచారణ జరిపినపుడు, బండవేల్కిచెర్ల గ్రామానికి చెందిన చిపిరి మంజుల (35 సంవత్సరాలు), ఆమె భర్త భీరయ్య మరియు వారి బంధువు కోడిగంటి అరుణ్ కుమార్ ఏ బీరప్ప కలిసి ముందస్తు పథకం ప్రకారం కొత్తబావి వెంకటమ్మను మద్యం తాగించి,తిర్మలాపూర్ పరిధిలో గల అడవి ప్రాంతానికి తీసుకెళ్లి చున్నితో గొంతు నులిమి హత్య చేసి, ఆమె వద్ద ఉన్న బంగారు మరియు వెండి ఆభరణాలు, సెల్ ఫోన్లు దొంగిలించినట్లు బయటపడింది. నేరాన్ని మరుగుపరచుటకు నిందితులు శవాన్ని అడవి ప్రాంతంలో రాళ్ల మధ్య వేసి పెట్రోల్ పోసి కాల్చివేసినట్లు వెల్లడైంది. అనంతరం దొంగిలించిన ఆభరణాలు మరియు సెల్ ఫోన్లను కామునిపల్లి గ్రామంలో దాచినట్లు తెలిసింది. 08.04.2026 నాడు నిందితురాలు చిపిరి మంజుల విచారించగా తన నేరాన్ని ఒప్పుకొంది. ఆమె ఇచ్చిన సమాచారం ఆధారంగా మిగతా నిందితులను కూడా అదుపులోకి తీసుకొని, ముగ్గురు కలిసి ఈ నేరాన్ని చేసినట్లుగా ఒప్పుకున్నారు. న్యాయస్థానం ముందు హాజరు పరచబడును. ఈ కేసులో మృతదేహం పూర్తిగా కుళ్ళిపోయిన స్థితిలో లభించగా, ఫిర్యాదుదారు కొంత చీర ముక్క ద్వారా తన తల్లి అని గుర్తింపు తెలిపినది. ఈ కేసును వేగంగా ఛేదించిన కుల్కచర్ల పోలీస్ సిబ్బందిని పరిగి డీఎస్పీ శ్రీనివాసులు అభినందించారు. పరిగి సర్కిల్ సీఐ ఎస్. శ్రీనివాస్ రెడ్డి, ఎస్సై రమేష్ కుమార్, రైటర్ శంకరయ్య, సీసీటీఎన్ఎస్ రైటర్ రాఘవేందర్, పీసీలు భూపాల్ రెడ్డి, శివ, గోపాల్ మరియు మొగులయ్య హెచ్‌జీ ల సేవలను ప్రశంసించారు. నేరస్తులనుండి స్వాదినం చేసుకున్న నగలు:

1.Gold necklace (naanu),2.Gold ear tops (Saada kammalu),3. Gold beads-22 (gundlu-22),4.Silver Anklets (Kadiyaalu), 5.Silver leg chains (pattagolusulu),6. Two Cell Phones,7.Two motor cycles




## కిషోర బాలికలశీదరికీ హెచ్ పీ వీ వ్యాక్సిన్ వేయించాలి

- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్.

**నారాయణపేట, ఏప్రిల్,08(సమయం న్యూస్) :** గర్భాశయ క్యాన్సర్ ను నివారించేందుకు హెచ్ పీ వీ వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్ లో హెచ్ పి వి వ్యాక్సిన్, ఆసుపత్రుల నిర్వహణపై వైద్యాధికారులతోపాటు అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 14 ఏళ్లలోపు బాలికలకు గర్భాశయ క్యాన్సర్ ను నివారించేందుకు ప్రభుత్వం హెచ్ పీ వీ వ్యాక్సిన్ వేయడానికి అన్ని చర్యలు తీసుకుంటోందనీ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో కళాశాలలో వసతి గృహాలులో ఉండే విద్యార్థినులకు ప్రతి 14 ఏళ్ల బాలికలకు హెచ్ పీ వీ వ్యాక్సిన్ వేయించేలా హెచ్ ఎం లు, వైద్యాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి శాఖ పరిధిలో వారి సహకారంతో హెచ్ పీ వీ వ్యాక్సిన్ వేయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మహిళలకు వచ్చే గర్భాశయ క్యాన్సర్ ఎప్పటికీ రాకుండా ఉండేందుకు 14 -15 సంవత్సరాల కిశోర బాలికలకు హెచ్ పీ వీ వ్యాక్సిన్ ను ఉచితంగా ఇవ్వడం జరుగుతోందని ఆయన తెలిపారు. ఆసుపత్రుల నిర్వహణ పై కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆసుపత్రులలో ఎన్ని కాన్పులు జరుగుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. డాక్టర్లు రోగులకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. జిల్లాలోని మక్తల్ మద్దూర్ కోస్గి లో ఆసుపత్రుల సమస్యలు ఉంటే తెలపాలని సూచించారు. ఈ సమావేశంలో డిఎంహెచ్ఓ జయచంద్ర మోహన్, అదనపు కలెక్టర్ లోకల్ బాడీ ఫణీంద్ర రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజేందర్ గౌడ్,డి సి హెచ్ ఎస్ మల్లికార్జున , మెడికల్ కాలేజీ సూపరింటెండెంట్ సంపత్ ,ఆర్.ఎం.ఓలు వైద్యులు తదితరులు పాల్గొన్నారు..

## ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య మున్సిపల్ చైర్మన్..

- ఉర్దూ మీడియం ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం
- ముఖ్యఅతిథిగా పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ నాగులపల్లి నరేందర్




**కోస్గి మున్సిపల్, ఏప్రిల్,08(సమయం న్యూస్) :** నిష్ణాతులైన ఉపాధ్యాయులు పనిచేస్తున్న ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని కోస్గి మున్సిపల్ చైర్మన్ నాగులపల్లి నరేందర్ అన్నారు. బుధవారం కోస్గి పట్టణంలోని ఉర్దూమీడియం ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ... ముఖ్యమంత్రి రేవంతరెడ్డి విద్యారంగం పై ప్రత్యేక దృష్టిపెట్టి అభివృద్ధి చేస్తున్నారని గుర్తు చేశారు. మున్సిపల్ పరిధిలోని పాఠశాలల్లో మౌళిక వసతులకోసం సహకరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు అందర్ని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నఫీస్ ఉన్నిసా కాంప్లెక్స్ హెచ్.ఎం రామకృష్ణరెడ్డి, కౌన్సిలర్స్ మేకల రాజేష్, హాబిబా, కోఆప్షన్ సభ్యులు సయ్యద్ అబ్దుల్ సలీం,ఆశ్రఫ్, వసంతమ్మ,ఎంఇఓ శంకర్ నాయక్, జి హెచ్ ఎం పద్మభాయి,ముస్లిం మైనారిటీ సదర్ జహీర్ సాబ్,అడ్వాకేట్ పర్వీన్ బేగం,ఉపాధ్యాయులు అక్రమ,ఖూద్దుబొద్దిన్,మరియు విద్యార్థులు,విద్యార్థినిలు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ వసతి గృహాలలో మెనూ అమలు చేయాలి

- నారాయణపేట జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్



**నారాయణపేట, ఏప్రిల్,08(సమయం న్యూస్) :** జిల్లాలోని సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థులకు మెనూ ప్రకారం అల్పాహారం, భోజనం అందించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎస్సీ, బాలుర, ఆనంద నిలయం( బాలికల) వసతి గృహాలను తనిఖీ చేశారు. బాలుర వసతి గృహంలో మరుగు దొడ్లను, గదులను, డైనింగ్ హాల్, వసతి గృహ పై కప్పును పరిశీలించారు. వంటగదిలో సరుకుల నాణ్యతను చూశారు. అక్కడి మెనూ బోర్డును చూసి,మెనూ ప్రకారం టిఫిన్, స్నాక్స్, రాత్రి భోజనం ఇస్తున్నారా అని హాస్టల్ వార్డెన్ ను ప్రశ్నించారు. ప్రభుత్వం కొత్తగా ప్రవేశ పెట్టిన మెనూ ను తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశించారు. వసతి గృహంలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం సమీపంలో ఉన్న ఆనంద నిలయాని (బాలికల వసతి గృహం) కి వెళ్ళి పరిసరాలను చూశారు. వంటగదిలోకి వెళ్ళి వంట మనుషులతో మాట్లాడి మెనూ గురించి ఆరా తీశారు. రోజూ ఖచ్చితంగా మెనూ ప్రకారమే పిల్లలకు ఆహారం ఇవ్వాలని స్పష్టం చేశారు. అదనపు మరుగు దొడ్ల కోసం ప్రతిపాదనలు చేసి పంపాలని వార్డెన్ కు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అబ్దుల్ ఖలీల్, తహసిల్దార్ అమరేంద్ర కృష్ణ, వార్డెన్ నిర్మలా పాల్గొన్నారు.

## రాంగ్ సైడ్ డ్రైవింగ్ చేసే వారిపై కఠిన చర్యలు

- నారాయణపేట ట్రాఫిక్ ఎస్సై కృష్ణ చైతన్య



**నారాయణపేట, ఏప్రిల్,08(సమయం న్యూస్) :** నారాయణపేట జిల్లా కేంద్రంలోని ఓల్డ్ బస్టాండ్ పరిసర ప్రాంతంలో ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాంగ్ సైడ్‌లో వాహనాలు నడుపుతున్న పలువురు వాహనదారులను గుర్తించి నిలిపివేసి, వారికి ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ట్రాఫిక్ ఎస్సై కృష్ణ చైతన్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ తనిఖీల్లో, రోడ్డు భద్రతా నియమాలను ఉల్లంఘించిన వారికి హెచ్చరికలు జారీ చేయడంతో పాటు, కొంతమందిపై చట్టపరమైన చర్యలు కూడా తీసుకున్నారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్సై కృష్ణ చైతన్య మాట్లాడుతూ... రాంగ్ సైడ్ డ్రైవింగ్ వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. చిన్న తప్పిదం కూడా ప్రాణాంతక ప్రమాదాలకు దారితీస్తుందని పేర్కొన్నారు. ప్రతి వాహనదారు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ప్రత్యేకంగా యువత నిర్లక్ష్యంగా వాహనాలు నడపకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగం తప్పనిసరిగా ఉండాలని సూచించారు. రోడ్డు పై శాంతి భద్రతల కోసం ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. రాంగ్ సైడ్ డ్రైవింగ్, అధిక వేగం, మద్యం సేవించి వాహనం నడపడం వంటి ఉల్లంఘనలపై కఠిన చర్యలు కొనసాగుతాయని హెచ్చరించారు. ప్రజల భద్రత కోసమే ఈ చర్యలు చేపడుతున్నామని,అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

## కీర్తిశేషులు ర్యాలపేట రాములు జ్ఞాపకార్థంగా త్రాగే మంచినీరు (చలివేంద్రం) ఏర్పాటు...

- రెండో వార్డు కౌన్సిలర్ వాణిశ్రీ మధుసూదన్ యాదవ్



**మున్సిపల్, ఏప్రిల్,08(సమయం న్యూస్) :** కొడంగల్ పట్టణ కేంద్రంలోని రెండవ వార్డ్ లో కూరగాయల మార్కెట్ లో కూరగాయలు అమ్మేవాళ్లకూ మరియూ కూరగాయలు కొనే వాళ్లకు ఇబ్బంది కలగకుండా బుధవారం త్రాగే నీరు (చాలివేంద్రం)ఏర్పాటు చేసి, ప్రారంభించిన కొడంగల్ మున్సిపల్ రెండవ వార్డ్ కౌన్సిలర్ ఆర్. వాణిశ్రీ మధుసుధన్ యాదవ్ దంపతులు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు,యువకులు, తదితరులు పాల్గొన్నారు

# అక్రమంగా తరలిస్తున్న PDS బియ్యం పట్టివేత..

● అక్రమాలకు పాల్పడితే కటిక చర్యలు ఎస్సై విట్టల్ రెడ్డి





**యాలాల మండలం, ఏప్రెల్,08(సమయం న్యూస్) :** యాలాల పోలీస్ వారు మరియు టాస్క్ ఫోర్స్ పోలీస్ వారు సంయుక్తంగా బుధవారం గౌతమి స్కూల్ దగ్గర వాహనాలు తనిఖీ చేస్తుండగా ఎవఅ ెఎతీవ నూూూ షశీ్ఖుఱఅవతీ ూ 08ఖవీ0596 గల వెహికల్ అనుమానస్పదంగా కనిపించడంతో వెహికల్ ని అపి తనిఖీ చేయగా దానిలో ప్రభుత్వ సరఫరా చేసే ూణూ బియ్యం 180 క్వింటల్ ఉన్నట్లు ఎస్సై తెలిపారు. డ్రైవర్ నుండి వివరాలు తెలుసుకోగా తన పేరు అలీ గోపాల్ సం/శీ అంజయ్య,కొందుర్గు మండలమని తెలపడం జరిగింది. ప్రభుత్వం నుంచి లబ్ధిదారులకు అందాల్సిన బియ్యాన్ని అక్రమంగా రవాణా చేయుటకు ఎలాంటి అనుమతి లేదని ఇట్టి బియ్యని షాద్నగర్ నుంచి జహీరాబాద్ తరలిస్తునట్టు తెలుపడం జరిగింది.ఇట్టి రేషన్ బియ్యని పోలీస్ స్టేషన్ తరలించి కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు యాలాల ఎస్సై విఠల్ రెడ్డి తెలిపారు.

# SCAP 2025-26 పాడి పశువుల పథకం నమోదుకు గడువు పొడిగింపు

● జిల్లా షెడ్యుల్డ్ కులముల సేవా సహకార అభివృద్ధి సంఘము .,నారాయణపేట

**నారాయణపేట, ఏప్రెల్,08,(సమయం న్యూస్) :** SCAP 2025-26 పాడి పశువులు పథకం నమోదుకు గడువు 16-04-2026 వరకు పొడిగింపు.నారాయణపేట జిల్లాలో అర్హత కలిగిన ఎస్సీ నిరుద్యోగ యువత కోసం అమలు చేస్తున్న SC Action Plan (SCAP) -- 2025-26 పాడి పశువుల పథకం మాత్రమే దరఖాస్తుల నమోదుకు మునుపు నిర్ణయించిన గడువును ప్రభుత్వం 16-04-2026 వరకు పొడిగించడమైనది.అర్హులైన ఎస్సీ యువత ఈ అవకాశాన్ని వినియోగించుకొని క్రింది పథకం కోసం తక్షణం నమోదు చేసుకోవాలని కోరడం జరుగుచున్నది.పశుసంవర్ధక పథకాలు (Animal Husbandry) పాడి పశువులు 16-04-2026 లోపల తప్పనిసరిగా SC Corporation అధికారిక పోర్టల్ OBMMS online portal ద్వారా ఆన్లైన్‌లో నమోదు చేయవలసిందిగా కోరనైనది. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్,ఎస్సీ కార్పొరేషన్, నారాయణపేట్ జిల్లా

# నమోదైన భవన నిర్మాణ కార్మికులకు మరియు వారి పిల్లలకు విదేశీ ఉద్యోగావకాశాలు

● సహాయ కార్మిక కమిషనర్ వికారాబాద్ జిల్లా

**వికారాబాద్, ఏప్రెల్,08(సమయం న్యూస్) :** కార్మిక శాఖలో నమోదైన భవన మరియు ఇతర నిర్మాణ కార్మికులకు ప్రభుత్వం శుభవార్త అందించింది.కార్మికులు సంవత్సరాలుగా సంపాదించిన నైపుణ్యాలను అధికారికంగా గుర్తిస్తూ "నైపుణ్యాల గుర్తింపు కార్యక్ర మం చేపట్టనుంది.దీని ద్వారా అర్హులైన వారికి విదేశాల్లో మెరుగైన ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నారు.అలాగే నమోదైన నిర్మాణ కార్మికుల పిల్లల్లో 18 నుండి 30 సంవత్సరాల మధ్య వయస్సు ఉండి, కనీసం 8వ తరగతి విద్యార్హత ఉన్న వారికి "ఉచితంగా భాషా, సాఫ్ట్ స్కిల్స్ శిక్షణ అందించబడుతుంది.ఈ శిక్షణ అనంతరం విదేశీ ఉద్యోగాలకు అవకాశాలు కల్పించనున్నారు.ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలనుకునే ఆసక్తి వున్నవారు.వారి సంబందించిన ఆధార్ కార్డు, లేబర్ కార్డు తీసుకొని స్థానిక అధికారి సహాయ కార్మిక అధికారి, వికారాబాద్ (9492555294) మరియు సహాయ కార్మిక అధికారి, తాండూర్, వికారాబాద్ జిల్లా (9492555293) కార్యాలయాలను సంప్రదించగలరని సహాయ కార్మిక కమిషనర్, వికారాబాద్ జిల్లా అధికారి బి.వాల్య (9492555290) తెలిపారు. కుటుంబ భవిష్యత్తు మెరుగుపర్చుకునేందుకు ఇది మంచి అవకాశం అని సూచించారు.సహాయ కార్మిక కమీషనర్ వికారాబాద్ జిల్లా (9492555290)

# జిల్లాలో మాతృ మరణాల నివారణకు సమగ్ర చర్యలు చేపట్టాలని

● జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా



**మహబూబ్ నగర్ ఏప్రిల్8( సమయం న్యూస్). :** . జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం మాతృ మరణాలపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలోఏప్రిల్-2025 నుండి ఇప్పటివరకు జిల్లాలో మొత్తం 7 గురు గర్భిణీ స్త్రీలు ప్రసవ సమయములో వివిధ కారణాలతో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి మహబూబ్ నగర్ లో 5 గురు, పట్టణంలోని ూూ హాస్పిటల్ లో ఒకరు, హైదరాబాద్ లోని గాంధీ ఆసుపత్రి లో ఒకరు మరణించడం జరిగిందని వైద్య శాఖ అధికారులు వివరించారుసంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులకు, ఆరోగ్యసిబ్బందికి మాతృ మరణాలు తగ్గించుటకు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారుజిల్లాలో నమోదైన మాతృ మరణాల పరిస్థితిని సమగ్రంగా విశ్లేషిస్తూ, వాటి కారణాలను గుర్తించి తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని ఆమె స్పష్టం చేశారు.ప్రత్యేకంగా గర్భిణీ స్త్రీలకు సమయానుకూల వైద్య సేవలు అందించడం, హై రిస్క్ గర్భిణీలను ముందస్తుగా గుర్తించి ప్రత్యేక పర్యవేక్షణలో ఉంచడం కీలకమని కలెక్టర్ సూచించారు. గ్రామస్థాయిలో ఆశా, ఆంగన్‌వాడీ కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ గర్భిణీల ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పరిశీలించాలని ఆదేశించారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన సిబ్బంది, ఔషధాలు, పరికరాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.అత్యవసర ప్రసూతి సేవలు అందించేందుకు 24 గంటల సేవలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని, రిఫరల్ కేసులను వేగంగా ఉన్నత వైద్య కేంద్రాలకు తరలించే విధానాన్ని మరింత బలోపేతం చేయాలని సూచించారు. ప్రతి మాతృ మరణాన్ని సీరియస్‌గా తీసుకుని, దాని పై డీటైల్‌గా విచారణ జరిపి నివేదిక సమర్పించాలని వైద్య అధికారులకు ఆదేశించారు.జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. కె. కృష్ణ సమావేశంలో మాట్లాడుతూ, ఇప్పటికే తీసుకుంటున్న చర్యలను వివరించారు. మెడికల్ ఆఫీసర్లు, ఇతర వైద్య అధికారులు సమావేశంలో పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు. జిల్లాలో మాతృ మరణాలను పూర్తిగా తగ్గించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో కృషి చేయాలని అన్నారు.స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్,మాతా శిశు సంరక్షణ ప్రోగ్రాం ఆఫీసర్ డా.శివ కాంత్ తదితరులు పాల్గొన్నారు

# కోడంగల్ లో 'ఇంటింటికి సిపిఐ'

● ప్రజా సమస్యలను తెలుసుకునేందుకే ఇంటింటికి సిపిఐ

● సిపిఐ కోడంగల్ నియోజకవర్గ ఇన్చార్జ్ గంటి సురేష్ కుమార్



**కొడంగల్ మున్సిపల్,08(సమయం న్యూస్) :** కోడంగల్ పట్టణంలో 'బుధవారం'ఇంటింటికి సిపిఐ'కార్యక్రమం నిర్వహించారు, ఈ సందర్భంగా సిపిఐ కొడంగల్ నియోజకవర్గ ఇంచార్జ్ గంటి సురేష్ కుమార్ ప్రజలను కలిసి మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి వందేళ్ల దాటిందని గుర్తు చేశారు, దేశాన్ని కార్పొరేట్ శక్తుల నుంచి విముక్తి చేసి తమ సమాజ స్థాపనకు నిరంతరం పోరాటాలు నిర్వహిస్తున్న పార్టీ సిపిఐ పార్టీ అన్నారు, భవిష్యత్తులో ప్రజా పోరాటాలను మరింత బలోపేతం చేయడానికి భారత కమ్యూనిస్టు పార్టీకి అన్ని వర్గాల ప్రజలు సహకారం అందించాలని కోరారు, దేశానికి స్వాతంత్రం వచ్చి 80 సంవత్సరాలు గడుస్తున్న ప్రభుత్వాలు మారుతున్న నేటి ప్రజల సమస్యలు నిరుద్యోగం, అంటరానితనం,అవమానాలు రోజురోజుకి పెరుగుతూనే ఉన్నాయని అన్నారు, దేశంలో పెరుగుతున్న నిత్యవసర ధరలను నియంత్రించడంలో బిజెపి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు, రాష్ట్రంలో ఉన్న నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇల్లు ఇవ్వాలన్నారు, మహిళలకు ఇస్తామన్నా 2500 రూపాయల పెన్షన్ తక్షణమే అమల్లోకి తేవాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు, సిపిఐ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఒకటవ తేదీ నుంచి ఈ నెల 10వ తేదీ వరకు అన్ని గ్రామాలలో ఇంటింటికి పర్యటించి ప్రజల యొక్క సమస్యలను తెలుసుకొని రాబోయే రోజులలో సమస్యల పైన పోరాటాలు కొనసాగిస్తామని ప్రజల యొక్క గొంతుకగా ప్రభుత్వాలను నిధిస్తామని ప్రజా సమస్యలు పరిష్కారమయే దిశగా ఎర్రజెండా పోరాడుతుందన్నారు, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 6 గ్యారెంటీలను అమలు చేయాలన్నారు, రాష్ట్రంలో ప్రజలు అనేక ఇబ్బందులతో సతమతమవుతున్నా రన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రాజకీయాలను పక్కన పెట్టి ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు, దంపల్లి బాబు, సావిత్రమ్మ, శామప్ప, భీమప్ప, బి. సాయప్ప, మొగులప్ప, ఆశమ్మ, శైలజా పాల్గొన్నారు.

# పిఎన్ జీ తో వంట గ్యాస్ సరఫరాకు కసరత్తు.

● కలెక్టర్ ప్రతిక్ జైన్



**నారాయణపేట, ఏప్రెల్,08(సమయం న్యూస్) :** భవిష్యత్తులో ఎల్పిజి గ్యాస్ కొరతను అధిగమించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో పిఎన్ జీ( పైపుడ్ నాచురల్ గ్యాస్) తో కమర్షియల్ అవసరాలకు వంట గ్యాస్ సరఫరాకు కసరత్తు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు.బుధవారం సిజిడి (సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్) జిల్లా కమిటీ సభ్యులతో పిఎన్జి గురించి జిల్లా కలెక్టర్ గారి చాంబర్లో మాట్లాడారు. పైప్ లైన్ ద్వారా కమర్షియల్ అవసరాలకు గ్యాస్ పంపిణీ చేసేందుకు జిల్లాలో ఉన్న సవాళ్లను దృష్టిలో ఉంచుకొని, ప్రణాళికతో ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. పైపుడ్ నాచురల్ గ్యాస్ సరఫరాకు మెగా సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్ సహకారం అందించనున్నట్లు చెప్పారు. ప్రస్తుతానికి జిల్లాలో వంట గ్యాస్ సిలిండర్ల కొరత లేదని, రోజు మన జిల్లాకు అవసరమైన సిలిండర్లు వస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ప్రతిరోజు సుమారు 2800 బుకింగ్స్ జరుగుతున్నాయని, వినియోగదారులు గ్యాస్ బుక్ చేసిన మూడు రోజుల్లోనే డెలివరీ చేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీను, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి సైదులు, వెంకటరమణ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆర్ అండ్ బి డిపార్ట్మెంట్, రంగారావు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆర్డబ్ల్యూఎస్, మొగులప్ప డిఆర్డిఓ మెగా కంపెనీ ప్రతినిధి రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# గర్భిణీ లు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందాలి.

● జిల్లా కలెక్టర్ కే హైమావతి.




**సిద్ధిపేట ఏప్రిల్8( సమయం న్యూస్). :** జిల్లాలోని అన్ని ప్రభుత్వ మాతా-శిశు ఆరోగ్య కేంద్రాల్లో గర్భిణి మహిళలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని, గర్భిణులు తప్పనిసరిగా ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే వైద్యం పొందాలని జిల్లా కలెక్టర్ శ్రీమతి కె. హైమావతి సూచించారు. బుధవారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక -- 99 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా జిల్లా కేంద్రంలోని జిల్లా జనరల్ ఆసుపత్రిలో నిర్వహించిన "సేఫ్ మదర్ డే" కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఏప్రిల్ 6 నుండి 11 వరకు హెల్త్ వీక్‌గా నిర్వహిస్తూ రోజువారీ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. గర్భధారణ ప్రారంభం నుంచి శిశువు జననం వరకు తల్లి-శిశువుల ఆరోగ్యాన్ని కాపాడడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. గర్భిణులు వైద్యుల సూచనలు పాటిస్తూ పౌష్టికాహారం తీసుకోవడం, మానసిక ప్రశాంతతను కాపాడుకోవడం చాలా ముఖ్యమని తెలిపారు. గర్భధారణ నిర్ధారణ అయిన వెంటనే సమీప ఆరోగ్య కేంద్రానికి సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని సదుపాయాలు ఉన్నాయని, 7వ, 8వ, 9వ నెలల్లో తప్పనిసరిగా పరీక్షలు చేయించుకుని, ప్రసవం కూడా ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే చేయించుకోవాలని సూచించారు. గర్భిణుల ఆరోగ్యానికి భర్తలు మరియు కుటుంబ సభ్యుల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డా. ధనరాజ్, సైకియాట్రి విభాగం హెచ్‌వోడి డా. శాంతి, ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ డా. బాబ్జి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డా. మహేందర్ రెడ్డి, నర్సింగ్ కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా జనరల్ ఆసుపత్రిలో డిపార్ట్మెంట్ ఆఫ్ సైకియాట్రిస్ట్, డి అడిక్షన్ సెంటర్ లో కుటుంబ సమస్యలతో సతమతమవుతూ డిప్రెషన్ కి గురవుతున్న రోగి తో మాట్లాడారు. జీవితం చాలా గొప్పదని, కష్టసుఖాలు ఎదుర్కొని జీవితంలో నిలదొక్కోవాలని, మానసికంగా దృఢంగా ఉండాలని సమస్యలకు తలగ్గొద్దని, చదువుతో పాటు మంచి అలవాట్లను అలవర్చుకోవాలని, మానసిక వైద్య నిపుణులు తెలిపిన ప్రతిదీ పాటిస్తూ ఉన్నత స్థానానికి ఎదగాలని తెలిపారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయండి.




**సిద్ధిపేట ఏప్రిల్8( సమయం న్యూస్). :** రబీ (యాసంగి) సీజన్ 2025-26 వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను జిల్లాలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి వెంటనే కొనుగోళ్లు ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ శ్రీమతి కె. హైమావతి అధికారులను ఆదేశించారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్ నుండి నిర్వహించిన జూమ్ సమావేశంలో కలెక్టర్ రబీ సీజన్ 2025-26 వరి కొనుగోలు ఏర్పాట్లపై ఆర్డీవోలు, సివిల్ సప్లై, మెప్మా, డిఆర్డీఏ, తహసీల్దార్లు, డిసిఓ, డిఏఓ, డీఎం మార్కెటింగ్ తదితర అధికారులకు సమగ్ర దిశానిర్దేశం చేశారు. జిల్లాలో ఈ రబీ సీజన్‌లో అంచనాలకు మించి ధాన్యం వచ్చే అవకాశం ఉన్నందున కొనుగోలు కేంద్రాలను పూర్తిస్థాయిలో సిద్ధం చేయాలని సూచించారు. ప్రతి మండలంలో తహసీల్దార్లు, ఎంపిడిఓలు, ఏపిఎం, మహిళ సమాఖ్య ఓపిఓలు, మార్కెటింగ్, అగ్రికల్చర్ అధికారులతో సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకొని కొనుగోలు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు ముందస్తు సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. జిల్లాలోని 421 కొనుగోలు కేంద్రాల్లో గన్ని బ్యాగులు, తేమ కొలిచే యంత్రాలు, తాలు తీసే యంత్రాలు, టార్పాలిన్ షీట్లు, బ్లోయర్లు, తాగునీటి సదుపాయం, టెంట్లు, విద్యుత్ కనెక్షన్, వేయింగ్ మిషన్లు, కార్మికులు తదితర అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ప్రతి కేంద్రాన్ని సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో ప్రారంభించాలని తెలిపారు. మార్కెట్ గోదాముల్లో అందుబాటులో ఉన్న ఖాళీ స్థలాన్ని గుర్తించి నిల్వ సదుపాయాలు కల్పించాలని, అవసరమైతే కాటన్ మిల్లులను కూడా వినియోగించుకోవాలని డీఎం మార్కెటింగ్‌ను ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే గోదాములకు తరలించేలా సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించి ఎక్కడా సమస్యలు తలెత్తకుండా చూడాలని సివిల్ సప్లై, డీఎం సివిల్ సప్లై మరియు సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో డి సివిల్ సప్లై తనూజ, డీఎం సివిల్ సప్లై అధికారి గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# పాలక్, ముకేశ్‌కు స్వర్ణం

## ఐఎస్ఎస్ఎఫ్ రైఫిల్ అండ్ పిస్టోల్ వరల్డ్ కప్‌లో భారత్ బోణీ

**గ్రానాడ (స్పెయిన్) :** ఐఎస్ఎస్ఎఫ్ రైఫిల్ అండ్ పిస్టోల్ వరల్డ్ కప్‌లో భారత్ తొలిరోజే శుభారంభం చేసింది. 10 మీటర్ల ఎయిర్‌పిస్టోల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో భారత యువ షూటర్లు పాలక్, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ముకేశ్ పసిడి గురిపెట్టారు. ఫైనల్‌లో భారత ద్వయం 487.7 పాయింట్లు స్కోరు చేసి స్వర్ణం గెలుచుకోగా చైనా (484.8)కు రజతం, హంగేరి (414.9) కాంస్యం దక్కించుకున్నాయి. క్వాలిఫికేషన్ రౌండ్‌లో చైనా ద్వయం క్వియాంజు యావొ, కై హు (586)తో పోటీపడి 581 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచిన భారత జోడీ.. ఫైనల్‌లో మాత్రం సత్తాచాటింది. పాలక్, ముకేశ్ ప్రదర్శన జూనియర్ స్థాయిలో రికార్డు కావడం గమనార్హం.




# ఫైనల్‌కు మీనాక్షి, జైస్మీన్..

## పురుషుల విభాగంలో మరో ఇద్దరు

**ఉలన్‌బాతర్ (మంగోలియా) :** భారత యువ బాక్సర్లు మీనాక్షి హుడా, జైస్మీన్ లంబోరియా ఏషియన్ బాక్సింగ్ చాంపియన్‌షిప్స్‌లో ఫైనల్స్‌కు దూసుకెళ్లారు. మంగళవారం ఇక్కడ జరిగిన సెమీస్ బౌట్‌లలో ఈ ఇద్దరూ జోరును కొనసాగిస్తూ ప్రత్యర్థులను చిత్తు చేసి పసిడి పోరుకు అర్హత సాధించగా మెన్స్ క్యాటగిరీలోనూ విశ్వనాథ్ సురేశ్, సచిన్ సివాచ్ కూడా ఫైనల్ చేరారు. మహిళల 48 కిలలో సెమీస్‌లో మీనాక్షి.. 4-1తో తిప్సచ యొద్వరీ (థాయ్‌లాండ్)ని ఓడించగా జైస్మీన్ (57 కి.) 3-2తో నిగిన ఉక్తమొవ (ఉజ్బెకిస్థాన్)పై పోరాడి గెలిచింది. పురుషుల 60 కి. సెమీస్‌లో సచిన్.. 4-1తో సక్ద రౌమ్తమ్ (థాయ్‌లాండ్)ను చిత్తు చేయగా విశ్వనాథ్ (50 కి.) వరల్డ్ చాంపియన్, ప్రపంచ మొదటి ర్యాంకర్ అయిన కజకిస్థాన్ బాక్సర్ తష్కెంబెపై 5-0తో ఏకపక్ష విజయాన్ని నమోదుచేశాడు. తాజా ప్రదర్శనలతో ఈ టోర్నీలో ఫైనల్ చేరిన బాక్సర్ల సంఖ్య 8 (ఆరుగురు మహిళలు, ఇద్దరు పురుషులు)కు చేరింది. ఇదిలాఉండగా ఆకాశ్ (75 కి.), లోకేశ్ (85 కి.), నరేందర్ (90ం కి.), హర్ష్ చౌదరి (90 కి.) సెమీస్ బౌట్‌లలో ఓడి కాంస్య పతకంతో సంతృప్తి పడ్డారు.

# స్మృతి మంధాన పెళ్లిపై కొత్త ట్విస్ట్..



**ముంబై:** నవంబర్ 2025లో వైభవంగా జరగాల్సిన స్మృతి మంధాన, పలాష్ ముచ్చల్ వివాహం అనుకోని కారణాల వల్ల ఆగిపోయిన సంగతి తెలిసిందే. అయితే, తాజాగా వైరలవుతోన్న వీడియో చూస్తే మాత్రం అంతా షాక్ అవ్వాల్సిందే. ఎందుకంటే, ఈ వీడియో ఇరు కుటుంబాలు కలిసి ఉండడం, ఆప్యాయంగా మాట్లాడుకోవడం చూస్తే గొడవలు సద్దుమణిగాయని, త్వరలో గుడ్ న్యూస్ చెప్పనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. భారత మహిళా క్రికెట్ స్టార్ స్మృతి మంధాన, సంగీత దర్శకుడు పలాష్ ముచ్చల్ గతంలో పెళ్లి ఆగిపోవడంతో విడిపోయారనుకున్న ఈ జంట గురించి తాజాగా ఒక ఆసక్తికర వీడియో వెలుగులోకి వచ్చింది. రెండు కుటుంబాలు కలిసున్న ఈ దృశ్యాలు చూస్తుంటే వారి మధ్య విభేదాలు తొలగిపోయాయా అనే అనుమానాలు అభిమానుల్లో వ్యక్తమవుతున్నాయి. నిజానికి స్మృతి మంధాన, పలాష్ ముచ్చల్ వివాహం గత ఏడాది నవంబర్ (2025)లో వైభవంగా జరగాల్సింది. అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాక, సరిగ్గా పెళ్లికి ఒకరోజు ముందు స్మృతి తండ్రి శ్రీనివాస మంధాన ఆరోగ్యం క్షీణించడంతో వేడుకను వాయిదా వేశారు. అయితే ఆ తర్వాత పలాష్ మరొక అమ్మాయితో సన్నిహితంగా ఉంటూ దొరికిపోయారని, అందుకే స్మృతి ఈ పెళ్లిని రద్దు చేసుకుందనే వార్తలు నెట్టింట విపరీతంగా హల్చల్ చేశాయి. అప్పటి నుంచి వీరిద్దరూ కలిసి కనిపించకపోవడంతో బంధం తెగిపోయిందని అందరూ భావించారు.



# ఉత్కంఠ పోరులో గుజరాత్ టైటాన్స్ విజయం!

## ఆఖరి ఓవర్లో హైడ్రామా.. ఒక్క పరుగు తేడాతో ఢిల్లీ పరాజయం

**ఢిల్లీ, ఏప్రిల్ 8:** ఐపీఎల్ 14వ మ్యాచ్ క్రికెట్ అభిమానులకు అసలైన టీ 20 మజాను అందించింది. బుధవారం ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో గుజరాత్ టైటాన్స్, ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య జరిగిన ఈ హై స్కోరింగ్ మ్యాచ్ ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగింది. ఊపిరి బిగపట్టి చూసేలా సాగిన ఈ పోరులో గుజరాత్ టైటాన్స్ కేవలం 1 పరుగు తేడాతో అద్భుత విజయాన్ని నమోదు చేసింది. ఢిల్లీ బ్యాటర్ డేవిడ్ మిల్లర్ అద్భుతంగా ఆడి జట్టును విజయతీరాల దాకా చేర్చినా.. ఆఖరి ఓవర్లో ఆయన తీసుకున్న 1 తప్పుడు నిర్ణయం జట్టుకు ఘోర పరాజయాన్ని మిగిల్చింది.

### గుజరాత్ భారీ స్కోరు..

ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఢిల్లీ క్యాపిటల్స్ ముందుగా బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ టైటాన్స్ బ్యాటర్లు ఆరంభం నుంచే చెలరేగి ఆడారు. ఓపెనర్ శుభ్‌మన్ గిల్ కేవలం 45 బంతుల్లోనే 70 పరుగులు చేసి శుభారంభం అందించాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన వాషింగ్టన్ సుందర్ 32 బంతుల్లో 55 పరుగులు, జోస్ బట్లర్ 27 బంతుల్లో 52 పరుగులు చేసి వీరబాదుడు బాదారు. దీంతో గుజరాత్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 210 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఢిల్లీ బౌలర్లలో ముకేశ్ కుమార్ 2 వికెట్లు పడగొట్టగా.. లుంగి ఎన్గిడి, కుల్దీప్ యాదవ్ తలో 1 వికెట్ తీశారు.

### రాహుల్ ఒంటరి పోరాటం.. రషీద్ మ్యాజిక్ స్పెల్

211 పరుగుల భారీ లక్ష్య ఛేదనకు దిగిన ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఓపెనర్ పాతుమ్ నిస్సాంక (24 బంతుల్లో 41), కేఎల్ రాహుల్ అద్భుతమైన పునాది వేశారు. ముఖ్యంగా కేఎల్ రాహుల్ గుజరాత్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. కేవలం 52 బంతుల్లోనే 92 పరుగులు చేసి సెంచరీకి తృటిలో మిస్సయ్యాడు. రాహుల్ అవుటైన తర్వాత మ్యాచ్ గుజరాత్ వైపు మొగ్గినట్లు కనిపించింది. గుజరాత్ స్టార్ స్పిన్నర్ రషీద్ ఖాన్ తన 4 ఓవర్లలో కేవలం 17 పరుగులు మాత్రమే ఇచ్చి 3 కీలక వికెట్లు తీసి ఢిల్లీ నడ్డి విరిచాడు. ప్రసిద్ధ్ కృష్ణ 2 వికెట్లు, మహ్మద్ సిరాజ్ 1 వికెట్ తీశారు.

### క్లైమాక్స్‌లో మిల్లర్ తప్పిదం..



మ్యాచ్ దాదాపు చేయిజారిపోతున్న దశలో క్రీజులోకి వచ్చిన డేవిడ్ మిల్లర్ అసాధారణ పోరాట పటిమ కనబరిచాడు. కేవలం 20 బంతుల్లోనే అజేయంగా 41 పరుగులు చేసి ఢిల్లీకి ఆశలు రేపాడు. మ్యాచ్ ఆఖరి ఓవర్ వరకు వెళ్లడంతో స్టేడియంలో ఉత్కంఠ తారాస్థాయికి చేరింది. ఆఖరి ఓవర్లో విజయానికి కొద్ది పరుగుల దూరంలో ఉన్న ఢిల్లీకి మిల్లర్ షాక్ ఇచ్చాడు. ఇన్నింగ్స్ ఆఖరి ఓవర్ 5వ బంతికి సింగిల్ తీసే అవకాశం స్పష్టంగా ఉన్నప్పటికీ.. మిల్లర్ పరుగు తీయడానికి నిరాకరించాడు. ఆఖరి బంతికి విన్నింగ్ షాట్ కొట్టి మ్యాచ్‌ను ముగించాలన్న అతివిశ్వాసంతో ఆ నిర్ణయం తీసుకున్నాడు. ఒకవేళ ఆ బంతికి సింగిల్ తీసి ఉంటే కనీసం స్కోర్లు సమం అయ్యేవి, మ్యాచ్ సూపర్ ఓవర్‌కు దారితీసేది. కానీ చివరి బంతికి గుజరాత్ బౌలర్ అద్భుతంగా బౌలింగ్ చేయడంతో ఆ బంతి డాట్ అయ్యింది. దీంతో ఢిల్లీ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 209 పరుగులకే పరిమితమైంది. కేవలం 1 పరుగు తేడాతో గుజరాత్ ఊహించని విజయం సాధించింది. ఒంటరి పోరాటంతో జట్టును గెలిపించే దాకా తెచ్చిన మిల్లర్.. చివరి నిమిషంలో చేసిన చిన్న తప్పు ఢిల్లీ అభిమానులను తీవ్ర నిరాశకు గురిచేసింది. చేతికందిన విజయాన్ని క్యాపిటల్స్ తృటిలో చేజార్చుకుంది.

**డేవిడ్ మిల్లర్ చేసిన ఆ ఒక్క తప్పే కొంపముంచిందా?**

**రాణించిన కేఎల్ రాహుల్, శుభ్‌మన్ గిల్**



# అప్పట్లోనే ఒకడు ఉండేవాడు

## 500 సిక్సర్లతో రోహిత్‌శర్మను మించిన హిట్‌మ్యాన్ ఇతను!

క్రికెట్ చరిత్రలో సిక్సర్ల వీరుల గురించి మాట్లాడితే మనకు వెంటనే క్రిస్ గేల్, రోహిత్ శర్మ లేదా షాహిద్ అఫ్రిది వంటి పేర్లు గుర్తొస్తాయి. కానీ, ఏ విధమైన హెల్మెట్లు, అత్యాధునిక బ్యాట్లు లేని కాలంలోనే సిక్సర్లతో స్టేడియాలను హోరెత్తించిన ఒక అరుదైన క్రికెటర్ ఉన్నారని మీకు తెలుసా. ఈ రోజుల్లో భారీ బ్యాట్లు, చిన్న బౌండరీల వల్ల సిక్సర్లు కొట్టడం సులభం అవుతుంది. కానీ 1930ల కాలంలోనే 500లకు పైగా సిక్సర్లు బాది చరిత్ర సృష్టించిన ఘనత ఆర్థర్ వెల్లార్డ్ సొంతం. ఆయన వేసిన ప్రతి బంతి ఒక బుల్లెట్ అయితే, ఆయన కొట్టిన ప్రతి సిక్సర్ ఒక సంచలనం. ఏప్రిల్ 8 ఆయన పుట్టిన రోజు. ఈ సందర్భంగా ఈ 'సిక్సర్ కింగ్' అద్భుతమైన రికార్డుల గురించి తెలుసుకుందాం.

### ఒక సీజన్‌లో 72 సిక్సర్లు..


ఆర్థర్ వెల్లార్డ్ 1935వ సంవత్సరంలో ఒకే సీజన్‌లో ఏకంగా 72 సిక్సర్లు కొట్టి అప్పట్లోనే ప్రపంచ రికార్డు సృష్టించారు. ఈ రికార్డు దాదాపు 50 ఏళ్ల పాటు చెక్కుచెదరకుండా ఉండిపోయింది. 1985లో ఇయాన్ బోథమ్ 80 సిక్సర్లు కొట్టే వరకు వెల్లార్డ్ పేరిటే ఈ రికార్డు ఉండేది. ఆర్థర్ వెల్లార్డ్ ప్రధానంగా ఫాస్ట్-మీడియం బౌలర్. ఇంగ్లాండ్ తరపున కేవలం రెండు టెస్టులే ఆడినప్పటికీ, ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో ఆయన ఒక లెజెండ్. 417 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌ల్లో ఆయన 1,614 వికెట్లు పడగొట్టారు. ఇదే సమయంలో ఆయనలోని బ్యాటింగ్ విధ్వంసం చూసి ప్రపంచం ఆశ్చర్యపోయింది. ఈ స్టార్ తన మొత్తం కెరీర్‌లో 12,485 పరుగులు చేయగా, అందులో సుమారు 25 శాతం పరుగులు కేవలం సిక్సర్ల ద్వారానే రావడం విశేషం. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో ఆయన మొత్తం 500 కంటే ఎక్కువ సిక్సర్లు బాదారు. ఆ రోజుల్లో ఈ గణాంకాలు అంటే ఊహకందనివి.

### ఒకే ఓవర్‌లో ఐదు సిక్సర్లు..

ప్రస్తుతం టీ20ల్లో ఒకే ఓవర్‌లో ఆరు సిక్సర్లు చూడటం అరుదుగా జరుగుతుంటుంది. కానీ వెల్లార్డ్ 1930 ల్లోనే రెండుసార్లు ఒకే ఓవర్‌లో 5 సిక్సర్లు బాది చరిత్రాక రికార్డు నెలకొల్పారు. ఒకసారి డెర్బీషైర్‌పై, మరోసారి కెంట్ జట్టుపై ఆయన ఈ ఫీట్ సాధించారు. గ్యారీ సోబర్స్ 6 సిక్సర్లు కొట్టే వరకు వెల్లార్డ్ రికార్డే అగ్రస్థానంలో ఉండేది. భారీ సిక్సర్లకు మారుపేరైన వెల్లార్డ్, క్రికెట్ ప్రపంచంలో మొట్టమొదటి పవర్ హిట్టర్‌గా నిలిచిపోయారు. నేడు హిట్‌మ్యాన్ రోహిత్ శర్మ లాంటి వారు సిక్సర్ల రికార్డులను తిరగరాస్తున్న తరుణంలో, అసలు సిక్సర్ల మ్యాజిక్ ప్రారంభించిన ఆర్థర్ వెల్లార్డ్ చరిత్రను గుర్తు చేసుకోవడం ప్రతి క్రికెట్ అభిమానికీ స్ఫూర్తిదాయకం.



# అల్లు అర్జున్ రాకా!




## టైటిల్ రిలీజ్ చేసిన చిత్ర బృందం

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ పుట్టినరోజు సందర్భంగా అభిమానులకు అదిరిపోయే గిఫ్ట్ అందింది. తమిళ స్టార్ డైరెక్టర్ అట్లీ దర్శకత్వంలో బన్నీ చేయబోతున్న భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్ టైటిల్‌ను మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ చిత్రానికి 'రాకా' అనే పవర్ ఫుల్ టైటిల్‌ను ఖరారు చేస్తూ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. విడుదలైన పోస్టర్‌లో అల్లు అర్జున్ మునుపెన్నడూ చూడని విభిన్నమైన అవతారంలో కనిపిస్తున్నారు. గుండుతో, కళ్లకు కాటుక పెట్టుకుని, ఒంటిపై వింత ఆకృతులతో ఉన్న ఈ లుక్ చూస్తుంటే ఆయన ఏదో 'వేర్-బీస్ట్' (జంతువుగా మారే మనిషి) తరహా పాత్రలో నటిస్తున్నట్లు తెలుస్తోంది. 'జవాన్' వంటి సెన్సేషనల్ హిట్ తర్వాత అట్లీ తెరకెక్కిస్తున్న చిత్రం కావడంతో దీనిపై భారీ అంచనాలు ఉన్నాయి. ఇందులో బాలీవుడ్ స్టార్ నటి దీపికా పదుకొణె హీరోయిన్‌గా నటిస్తుండటం విశేషం. ఆమె ఈ చిత్రంలో ఒక వీరనారి పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. సన్ పిక్చర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం సుమారు 800 కోట్ల రూపాయల భారీ బడ్జెట్‌తో, అత్యాధునిక ÷ఎఈచీ హంగులతో రూపొందుతోంది. హాలీవుడ్ టెక్నీషియన్లు కూడా ఈ ప్రాజెక్ట్ కోసం పని చేస్తున్నారు. ఈ చిత్రాన్ని తెలుగు, హిందీ, తమిళం సహా 7 భాషల్లో 2027 వేసవిలో విడుదల చేసేందుకు చిత్రబృందం ప్లాన్ చేస్తోంది. 'విజన్ బియాండ్ లిమిట్స్' హద్దులు లేని ఊహ అనే ట్యాగ్‌లైన్‌తో వస్తున్న ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులు సృష్టించడం ఖాయమని అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



# దురంధర్-2 విజయంపై స్పందించని దీపిక

## విమర్శకులకు ఘాటు సమాధానం ఇచ్చి నటి

బాలీవుడ్ స్టార్ హీరో రణవీర్ సింగ్ నటించిన 'ధురంధర్ 2' బాక్సాఫీస్ వద్ద రికార్డుల సునామీ సృష్టిస్తోంది. అయితే, ఈ సినిమా విజయంపై రణ్‌వీర్ భార్య, నటి దీపికా పదుకొణె ఇప్పటివరకూ స్పందించకపోవడంపై విమర్శలు ఎదురయ్యాయి. తాజాగా ఈ ట్రోల్స్‌పై ఆమె తనశైలిలో సమాధానమిచ్చారు. ఒక ఇన్‌స్టా పేజ్‌లో 'దీపికా తన భర్త సినిమాను ఎందుకు చూడడం లేదు. దాని గురించి ఎందుకు మాట్లాడట్లేదు' అని పెట్టిన పోస్ట్‌పై ఆమె స్పందిస్తూ.. 'మీ అందరికంటే ముందే నేను ఆ సినిమాను చూశాను. ఈ విషయం మీకు తెలీదు. ఇప్పుడు చెప్పండి ఎవరు ఎవరిని విమర్శించాలి' అంటూ వ్యంగ్యంగా కౌంటర్ ఇచ్చారు. సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టనంత మాత్రాన తన భర్తకు మద్దతు ఇవ్వడం లేదని అనుకోవడం సరికాదని ఆమె ఈ రిప్లైతో స్పష్టంచేశారు. ఆదిత్యధర్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం భారతీయ సినిమా చరిత్రలో రూ.1000 కోట్ల మార్క్‌ను దాటిన తొలి బాలీవుడ్ చిత్రంగా సరికొత్త చరిత్ర సృష్టించింది. రణ్‌వీర్‌తో పాటు ఆర్.మాధవన్, అక్షయ్‌ఖన్నా వంటి స్టార్స్ నటించిన ఈ యాక్షన్ థ్రిల్లర్ ప్రస్తుతం బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల వర్షం కురిపిస్తోంది.

# ఎన్టీఆర్, నీల్ మూవీ షూటింగ్ రద్దు ర్యూమర్స్



## వదంతులను తోసిపుచ్చిన చిత్ర బృందం

ఎన్టీఆర్ కథానాయకుడిగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందుతోన్న సంగతి తెలిసిందే. పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా మ-ఎస్తాబవుతోంది. ఈ సినిమా షూటింగ్ రద్దు అయిందంటూ కొన్ని రోజులుగా వార్తలు వస్తున్నాయి. ఎన్టీఆర్ లుక్ విషయంలో గందరగోళం నెలకొన్న నేపథ్యంలో షూటింగ్ వాయిదా వేశారని టాక్ వినిపించింది. తాజాగా ఈ వార్తలపై నిర్మాణ సంస్థ క్లారిటీ ఇచ్చింది. 'సినిమాలో హీరో లుక్, దీని షెడ్యూల్ రద్దు అంటూ వస్తోన్న వార్తల్లో నిజం లేదు. ఈ సినిమా షూటింగ్ ప్లాన్ ప్రకారమే ముందుకుసాగుతోంది. ప్రస్తుతం ప్రిపరేషన్ గ్యాప్ తీసుకున్నారంతే. దయచేసి ఎవరూ ఈ ప్రాజెక్ట్‌పై రూమర్స్ సృష్టించొద్దు. అనధికారిక సమాచారాన్ని షేర్ చేయొద్దు. ఏమైనా మార్పులు ఉంటే మేమే తెలియజేస్తాం' అని పేర్కొన్నారు. 'దేవర' తర్వాత ఎన్టీఆర్... 'సలార్' తర్వాత ప్రశాంత్ నీల్ చేస్తోన్న చిత్రమిది. 'డ్రాగన్' అనే పేరు పరిశీలనలో ఉంది. ఎన్టీఆర్ సరసన ఇందులో రుక్మిణీ వసంత్ నటిస్తున్నారు. రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు. బాలీవుడ్ సీనియర్ నటుడు అనిల్‌కపూర్ కీలక పాత్రలో నటిస్తున్నారు.






# లవ్ ఇన్సూరెన్స్ ప్రీ రిలీజ్ ఈవెంట్ స్టేజ్‌పై నయన్ సర్‌ప్రైజ్

విఘ్నేష్ శివన్ దర్శకత్వంలో ప్రదీప్ రంగనాథన్, కృతిశెట్టి జంటగా నటించిన 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' సినిమా రూపొందింది. ఈ చిత్రాన్ని నయనతార తన బ్యానర్‌పై నిర్మించడం విశేషం. ఇటీవల ఈ సినిమా తమిళ ప్రీ రిలీజ్ ఈవెంట్ ఘనంగా జరిగింది. ఈ ఈవెంట్‌లో దర్శకుడు విఘ్నేష్ శివన్ మాట్లాడుతుండగా, అనూహ్యంగా నయనతార స్టేజిపైకి వచ్చి అందరినీ ఆశ్చర్యపరిచింది. ఆమె సడన్ ఎంట్రీతో అక్కడి వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. తన భార్యను స్టేజిపై చూసిన విఘ్నేష్ భావోద్వేగానికి గురయ్యాడు. కళ్లలో నీళ్లు తెచ్చుకున్న ఆయనను నయనతార దగ్గరికి వెళ్లి కౌగలించుకొని ఓదార్చింది. ఈ సన్నివేశం అక్కడున్నవారినే కాదు, అందరిని కూడా కదిలించింది. నయనతార తన భర్తకు ఇచ్చిన భావోద్వేగ మద్దతు చూసి ఫ్యాన్స్ ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. 'రియల్ లైఫ్‌లో నిజమైన భాగస్వామ్యం ఇదే' అంటూ నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. విఘ్నేష్ శివన్ దర్శకత్వంలో ప్రదీప్ రంగనాథన్, కృతి శెట్టి జంటగా రూపొందిన చిత్రం 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ ఏప్రిల్ 10న తెలుగు, తమిళ భాషల్లో విడుదల కాబోతోంది. ప్రమోషన్స్ లో భాగంగా ఓ పాడ్ కాస్ట్ ఇంటర్వ్యూలో పాల్గొన్న విఘ్నేష్.. ధనుష్ గురించి మాట్లాడుతూ..'ధనుష్ సార్ అంటే నాకు చాలా ఇష్టం. ఆయన్ని ఎప్పుడూ గొప్పగానే చూస్తాను. జులై 28 ఆయన బర్త్ డే. అది మా మా నాన్న చనిపోయిన రోజు. దాని వల్ల ధనుష్ లో నేను నా తండ్రిని చూసుకున్నట్లు ఫీల్ అవుతాను. ఆయన మీద అంత ప్రేమ ఉంది' అని అన్నారు.

Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. **98660 19778, 89789 60131**



# హోంగార్డుల సమస్యలు పరిష్కరించండి

## తమిళనాడు జాలర్ల దుందుడుకు చర్యలను ఆపండి

## సీఎం చంద్రబాబుకు ఏపీ బీజేపీ చీఫ్ లేఖ


**అమరావతి, ఏప్రిల్ 8:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన అనంతరం హోం గార్డులు.. విధి నిర్వహణలో భాగంగా పోస్టింగ్ కారణంగా తమ సొంత ఊళ్లకు దూరంగా ఉంటూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఏపీ బీజేపీ చీఫ్ పీవీఎన్ మాధవ్ ఆవేదన వ్యక్తం చేశారు. వారిలో చాలా మంది ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో సేవలందిస్తుండగా.. వారి కుటుంబాలు తెలంగాణలో నివసిస్తున్నాయని తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన సుమారు 200 మంది హోం గార్డులు ప్రస్తుతం ఏపీలో పని చేస్తున్నారని వివరించారు. అందువల్ల వారు తీవ్ర వ్యక్తిగత, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. దీనితోపాటు నైతిక స్థైర్యాన్ని సైతం వారు కోల్పోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ సముద్ర తీర ప్రాంతంలోకి తమిళనాడుకు చెందిన జాలర్లు బోట్లు ద్వారా చొచ్చుకొచ్చి స్థానికులను తీవ్ర భయభ్రాంతులకు గురి చేస్తున్నారని పీవీఎన్ మాధవ్ తెలిపారు. ఈ రెండు సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి ఏపీ బీజేపీ చీఫ్ మాధవ్ లేఖ ద్వారా తీసుకెళ్లారు. ఈ లేఖను ఏపీ బీజేపీ చీఫ్ మాధవ్ బుధవారం అమరావతిలో విడుదల చేశారు. పరస్పర ప్రాతిపదికన రాష్ట్రాల మధ్య బదిలీకి వీలు కల్పించడం ద్వారా దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న హోం గార్డుల సమస్యలను పరిష్కరించడంలో సహాయపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అదే విధంగా పొరుగున ఉన్న తమిళనాడులోని కడలూరు, కారేకల్‌కు చెందిన జాలర్లు ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు, ఒంగోలు, బాపట్ల ప్రాంతాలకు వచ్చి స్థానిక మత్స్యకారులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఈ లేఖలో సీఎం చంద్రబాబుకు మాధవ్ వివరించారు. శాంతిభద్రతలకు భంగం కలిగించేలా ఇప్పటికే పలు సంఘటనలు అక్కడ జరిగాయని తెలిపారు. తమిళనాడుకు చెందిన మత్స్యకారులు స్పీడు బోట్లతో ఆంధ్ర తీర ప్రాంతంలో మత్స్య సంపదను దోచుకుంటున్నారని విమర్శించారు. ఈ ఏడాది మార్చిలో నెల్లూరు జిల్లా జువ్వలదిన్నె ప్రాంతంలో అక్రమంగా సంచరిస్తూ దౌర్జన్యానికి పాల్పడుతున్న తమిళనాడు జాలర్ల బోట్లను అక్కడ స్థానికులు నిర్బంధించారని పీవీఎన్ మాధవ్ గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వంతోపాటు స్థానిక అధికారుల తోడ్పాటుతో ఆ బోట్లను రాత్రికి రాత్రే విడుదల చేశారని చెప్పారు. తమిళనాడుకు చెందిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకోక పోవడం అనేక అనుమానాలకు తావిస్తోందని పేర్కొన్నారు. అక్రమంగా ఆంధ్ర తీర ప్రాంతంలో సంచరిస్తూ స్థానికులను భయ భ్రాంతులకు గురి చేస్తున్న తమిళనాడు జాలర్లలపై చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబుకు పీవీఎన్ మాధవ్ లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు.

# విభిన్న వాతావరణ పరిస్థితులు

## ప్రజలు జాగ్రత్తగా ఉండాలి • విపత్తు నిర్వహణ సంస్థ

**అమరావతి, ఏప్రిల్ 8:** రాష్ట్రంలో విభిన్న వాతావరణ పరిస్థితులు ఉన్నాయని ఈ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు విపత్తు నిర్వహణ సంస్థ బుధవారం సూచించింది. రాష్ట్రంలో ఎండ తీవ్రత, పిడుగులతోపాటు అకాల వర్షాలు పడతాయని హెచ్చరించింది. ద్రోణి ప్రభావంతో గురువారం తీర ప్రాంత జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని తెలిపింది. కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లో పిడుగులతో పాటు వర్షాలు పడతాయని తెలిపింది. మిగతా జిల్లాల్లో సైతం చినుకులు పడే అవకాశం ఉందంది. ఉరుములు మెరుపుల వచ్చే సమయంలో చెట్ల కింద నిలబడ వద్దని ప్రజలకు స్పష్టం చేసింది. అలాగే రైతులతోపాటు పశువుల కాపరులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరింది. ఇక పలు జిల్లాల్లోని వివిధ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిశాయని విపత్తు నిర్వహణ సంస్థ పేర్కొంది. తూర్పుగోదావరి పైడిమెట్టలో 44 మిమీ వర్షపాతం, డి. పోలవరంలో 37.7 మిమీ, సీతానగరం 32.2 మిమీ వర్షం, పాయకరావుపేటలో 26 మిమీ వర్షపాతం నమోదు అయిందని వివరించింది. రాయలసీమలో మాత్రం ఎండల ప్రభావం కొనసాగుతుందని విపత్తు నిర్వహణ సంస్థ తెలిపింది. పల్నాడు, తిరుపతిలో 42డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నగరి, చాగలమర్రి, పులివెందులలో భారీగా ఎండ కాసిందని చెప్పింది. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో 41డిగ్రీలు, ఉష్టోగ్రతలు దాటినట్లు పేర్కొంది. ఇక ఎండ వేడిమి కారణంగా.. ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు పడే అవకాశం ఉందంది. ఎండ తీవ్రత నుంచి రక్షణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు సూచించింది. నీరు అధికంగా తాగాలని సూచించింది. వాతావరణ హెచ్చరికలతోపాటు రాయలసీమ జిల్లాల్లో ఎండ తీవ్రత, ఉక్కపోత పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు విపత్తు నిర్వహణ సంస్థ స్పష్టం చేసింది. బుధవారం పల్నాడు(జి) క్రోసూరు, తిరుపతి (జి) వరదయ్యపాలెంలో 42.2 డిగ్రీలు, చిత్తూరు(జి) నగరిలో 42.1డిగ్రీలు, నంద్యాల(జి) చాగలమర్రిలో 41.9డిగ్రీలు, కడప(జి)పులివెందులలో 41.8డిగ్రీలు, అనంతపురం(జి) తెరన్నపల్లిలో 41.7డిగ్రీలు, కర్నూలు(జి) తోవి, మార్కాపురం(జి) అనుములపల్లెలో 41.6 డిగ్రీలు, ప్రకాశం(జి) చెరువుకొమ్ముపాలెంలో 41.5డిగ్రీలు, చొప్పున గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు విపత్తు నిర్వహణ సంస్థ వెల్లడించింది.

# ఏపీ అప్పుల తప్పుడు లెక్కలపై గవర్నర్‌కు ఫిర్యాదు



**తాడేపల్లి, ఏప్రిల్ 8:** కూటమి ప్రభుత్వం చేస్తున్న అప్పులపై వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ ఏపీ గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. పూర్తి వాస్తవాలు, గణాంకాల వివరాలతో బుధవారం ఏపీ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు ఓ లేఖ రాశారాయన. ఏటేటా కూటమి ప్రభుత్వం భారీగా అప్పులు చేస్తోంది. విపరీతంగా అప్పులు చేస్తూ తప్పుడు లెక్కలు చూపుతున్నారు. వివిధ కార్పొరేషన్ ల ద్వారా కూడా భారీగా అప్పు చేస్తున్నారు. కానీ ఆ వివరాల్లో తప్పుడు సమాచారం చూపుతున్నారు. ప్రభుత్వం ఇస్తున్న తప్పుడు సమాచారంపై చర్యలు తీసుకోవాలి అని బొత్స మొత్తం ఏడు పేజీల ఆ ఫిర్యాదు లేఖలో పేర్కొన్నారు.

# ప్రజాదర్బార్‌లో సమస్యలపై వినతి

- ఓపికగా విని పరిష్కారానికి లోకేశ్ హామీ





**గుంటూరు, ఏప్రిల్ 8:** ప్రజా సమస్యల పరిష్కార వేదిక 'ప్రజాదర్బార్'ను విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ నిర్వహించారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో 87వ రోజు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా పలు జిల్లాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలకు పరిష్కారం చూపించారు. సాధారణ ప్రజలే కాకుండా టీడీపీ కార్యకర్తలు, నేతలు సైతం తమ సమస్యలను పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లారు. ఎంతో ఓపికగా వారి సమస్యలు విని వినతులు స్వీకరించారు మంత్రి లోకేశ్. ప్రజాదర్బార్ కార్యక్రమంలో భాగంగా సౌత్ కోస్ట్ రైల్వే ఏర్పాటుపైనా మంత్రి లోకేశ్‌కు ఫిర్యాదు అందింది. సౌత్ కోస్ట్ రైల్వే ఏర్పాటు సందర్భంగా విజయవాడలోని లోకో పైలట్ల గాలా డిపోను తరలించకుండా చూడాలని మంత్రికి సిబ్బంది విజ్ఞప్తి చేశారు. కోవిడ్ వల్ల నష్టపోయిన హైర్ బస్ యజమానుల బస్సులకు రీప్లేస్మెంట్ కల్పించి ఆదుకోవాలని యజమానులు కోరారు. వంశపారంపర్యంగా సంక్రమించిన తమ 2.63 ఎకరాల భూమిని ఆక్రమించారని మంత్రి లోకేశ్‌కు కర్నూలు జిల్లా గుండంపాడుకు చెందిన ఎస్.చిన్న శివమ్మ ఫిర్యాదు చేశారు. ఘటనపై విచారించి తమ భూమిని తిరిగిచ్చేలా న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. అందరి సమస్యలను ఓపిగ్గా విన్న మంత్రి లోకేశ్ వారి నుంచి వినతులు స్వీకరించారు. వాటిని పరిశీలించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా లోకేశ్ ట్వీట్ చేశారు.

# నా పాదయాత్రలో బాబుకి రోజుకో సినిమా

- తాడేపల్లిగూడెంలో వైఎస్ జగన్
- మావిగన్‌పై మరోసారి కీలక వ్యాఖ్యలు



**తాడేపల్లి, ఏప్రిల్8 :** దోచుకో.. పంచుకో.. తినుకో.. అనే కాన్సెప్ట్‌తోనే రాష్ట్రంలో చంద్రబాబు పాలన కొనసాగుతోందని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం తాడేపల్లిగూడెం నియోజకవర్గ పార్టీ కేడర్‌తో జరిగిన భేటీలో ఆయన కూటమి ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. వచ్చే ఏడాది నా పాదయాత్ర ఉంటుంది. పాదయాత్రలో ప్రజలతో మమేకం అవుతాను. నా పాదయాత్ర ప్రారంభమైన తర్వాత వైఎస్సార్‌సీపీ శ్రేణులు చంద్రబాబుకు ప్రతిరోజూ సినిమా చూపించడం ఖాయం అని వైఎస్ జగన్ అన్నారు. ఎప్పటిలాగే చంద్రబాబు తెచ్చిన ఎన్నికల మేనిఫెస్టో చెత్త బుట్టలోకి వెళ్లిపోయింది. సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ మోసాలుగా తేలిపోయాయి. మన ప్రభుత్వంలో తీసుకొచ్చిన పథకాలన్నీ చంద్రబాబు రద్దు చేశారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేశారు. రాష్ట్రంలో అన్ని రంగాల్లో తిరోగమనం కనిపిస్తోంది. మన పాలనలో రూ.3.31 లక్షల కోట్ల అప్పు చేస్తే.. అందులో డీబీటీ(సంక్షేమం పేరిట నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి జమ) ద్వారా రూ.2.73 లక్షల కోట్లు ఇచ్చాం. కానీ చంద్రబాబు ఈ రెండేళ్లలోనే రూ.3.52 లక్షల కోట్లు చేశారు. చంద్రబాబు తెచ్చిన అప్పులన్నీ ఎవరి జేబుల్లోకి పోయాయి? అని వైఎస్ జగన్ నిలదీశారు.

### మావిగన్‌పై మరోసారి కీలక వ్యాఖ్యలు

రాజధాని విషయంలో తాము ఆచరణాత్మక పరిష్కారం చూపామని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఉద్ఘాటించారు. చంద్రబాబు ప్రభుత్వం రాష్ట్రానికి రాజధాని ఎప్పటికీ లేకుండా చేస్తోంది. అమరావతి పేరుతో రైతులను, ప్రజలను మోసం చేస్తోంది. కాంట్రాక్టులతో కమీషన్లు దండుకోవడానికే ఈ అమరావతి. అధికారంలోకి వచ్చిన మొదటి రోజు నుంచే మేం రాజధాని వస్తుందని చెప్పాం. రాజధాని బెస్ట్ ఆప్షన్‌గా ప్లాన్ ఏ కింద.. విశాఖపట్నంను చెప్పాం. న్యాయ రాజధానిగా కర్నూల్‌ను చెప్పాం. అమరావతిని శాసన రాజధానిగా చెప్పాం. అదీ వద్దనుకుంటే ప్లాన్ బీగా మచిలీపట్నం, విజయవాడ, గుంటూరులతో కూడిన 110 కి.మీ కారిడార్‌ను మావిగన్‌ను సూచించాం. అమరావతి పేరుతో రూ.2 లక్షల కోట్ల భారం వేసే బదులులో అందులో 10 శాతం పెట్టుబడి పెడితే మావిగన్‌లో అద్భుతాలు సౌకర్యాలు కల్పించొచ్చు. కానీ, చంద్రబాబు మావిగన్‌ను వద్దంటున్నారు. ఎందుకంటే చంద్రబాబు చెప్పే ఆ అమరావతి.. అతిపెద్ద దోపిడీ గని కాబట్టి. హైదరాబాద్, చెన్నై, బెంగళూరులో ఫైవ్‌స్టార్ చదరపు అడుగుకు రూ.4,500 మాత్రమే. కానీ, అమరావతిలో మాత్రం రూ.14,000 కట్టబెడుతున్నారు. దీనిని దోపిడీ కాక మరేమంటారు? అని వైఎస్ జగన్ అన్నారు.

# ప్రజాస్వామ్య బద్ధంగానే బుద్ధి చెప్పాలి

## డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

## మీడియా ఛానల్‌పై దాడి ఘటనపై రియాక్షన్

### గతంలో జగన్ చేసిన వ్యాఖ్యలను గుర్తు చేసిన జనసేనాని

### వైకాపా నేతలు అభ్యంతరకర భాష వీడాలని హితవు



**అమరావతి, ఏప్రిల్ 8:** రాజకీయాల్లో ప్రత్యర్థులు ఎంతగా దిగజారి మాట్లాడినా, మనం మన స్థాయిని కోల్పోవద్దని.. స్పందన ఎప్పుడూ ప్రజాస్వామ్య పంథాలోనే ఉండాలని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. ఇటీవల ఒక మీడియా ఛానల్‌పై జరిగిన దాడి ఘటనపై ఆయన స్పందించారు. రాజకీయాల్లో విమర్శలు, ప్రతివిమర్శలు సహజమని, అయితే వాటిని ఎదుర్కోవడంలో హింసకు తావు ఉండకూడదని ఆయన జనసేన శ్రేణులకు మరియు రాజకీయ వర్గాలకు దిశానిర్దేశం చేశారు. వైకాపా అధినేత జగన్ గతంలో వ్యవహరించిన తీరును ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ ఎండగట్టారు. గతంలో జగన్ ముఖ్యమంత్రి హోదాలో ఉండి కూడా పాఠశాల విద్యార్థుల ముందే హద్దులు దాటి, దిగజారుడు మాటలు మాట్లాడిన తీరును ప్రజలు ఇంకా మర్చిపోలేదని గుర్తు చేశారు. స్వయంగా తన భార్యను కారుతో పోల్చి మాట్లాడటం, అసెంబ్లీ సాక్షిగా చంద్రబాబు నాయుడు సతీమణిపై వైకాపా ఎమ్మెల్యేలు అసభ్యంగా మాట్లాడుతుంటే జగన్ నవ్వుతూ ప్రోత్సహించడం అత్యంత దురదృష్టకరమని పవన్ మండిపడ్డారు.

### అభిమానులకు సూచన - ప్రజాస్వామ్యమే ఆయుధం

జగన్ ప్రభుత్వం హయాంలో అంతటి దారుణమైన పరిస్థితులు ఉన్నప్పటికీ, జనసేన అభిమానులు ఎన్నడూ జగన్ కార్యాలయాలపై గానీ, ఆయన సంస్థలపై గానీ దాడులకు పాల్పడలేదని పవన్ గుర్తు చేశారు. "ఎదుటివారు ఎంతగా కించపరిచినా మనం వారి స్థాయికి దిగజారవద్దు. వైకాపా నేతలు నేటికీ అభ్యంతరకర భాషలోనే మాట్లాడుతున్నారు. కానీ ప్రజాస్వామ్య యంతంగానే వారికి బుద్ధి చెప్పాలి" అని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో మీడియా పాత్ర కీలకమని, అభిప్రాయ భేదాలు ఉన్నప్పుడు చట్టబద్ధంగా లేదా ప్రజాస్వామ్య పద్ధతుల్లోనే నిరసన తెలపాలని ఆయన సూచించారు. వైకాపా నేతలు ఇప్పటికైనా తమ భాషను మార్చుకోవాలని, రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉండేవారు హుందాతనాన్ని పాటించాలని పవన్ కల్యాణ్ హితవు పలికారు.

# రాయలసీమకు చంద్రబాబు తీరని ద్రోహం..

- అమరావతి పేరుతో లక్షల కోట్ల దోపిడీ
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి ధ్వజం

**తాడేపల్లి, ఏప్రిల్ 8:** ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు రాయలసీమ ప్రయోజనాలను పణంగా పెట్టి, అమరావతి పేరుతో భారీ దోపిడీకి తెరలేపారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బుధవారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. రాయలసీమ ప్రాజెక్టుల పట్ల కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును తీవ్రంగా ఎండగట్టారు. చంద్రబాబుకు కేవలం శంకుస్థాపనలు చేసి వదిలేయడమే తెలుసు తప్ప, పనులు పూర్తి చేసిన చరిత్ర లేదని ఎద్దేవా చేశారు. రాయలసీమకు సాగునీరు అందుతోందంటే అది కేవలం వైఎస్సార్, జగన్‌ల చొరవ వల్లేనని శ్రీకాంత్ రెడ్డి స్పష్టం చేశారు. "హంద్రీనీవా, సుజల స్రవంతి ప్రాజెక్టులను తెచ్చింది వైఎస్సారే. హంద్రీనీవాను 5 టీఎంసీలకు కుదించి రాయలసీమకు అన్యాయం చేసింది చంద్రబాబు కాదా?" అని నిలదీశారు. ఆల్మట్టి డ్యాం ఎత్తును 100 టీఎంసీలకు పెంచుతూ సీమ గొంతు కోస్తున్నా చంద్రబాబు నోరు మెదపడం లేదని మండిపడ్డారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పనులను నిలిపివేసి చంద్రబాబు ఈ ప్రాంతంపై తనకున్న విద్వేషాన్ని బయటపెట్టుకున్నారని ఆరోపించారు.

### అమరావతి - అవినీతికి రాజధాని

అమరావతి పేరుతో జరుగుతున్న లక్షల కోట్ల ఖర్చుపై ఆయన విస్మయం వ్యక్తం చేశారు. "జనం లేని చోట కొత్త సిటీలు కట్టడం సాధ్యమయ్యే పనేనా? నయా రాయపూర్‌లో వేల కోట్లు ఖర్చు చేసినా అభివృద్ధి లేదు. అటువంటిది అమరావతిలో ఎన్ని లక్షల కోట్లు తగలేస్తారు? రాష్ట్రమంతటా వసూలు చేసే పన్నులను కేవలం అమరావతిలోనే ఖర్చు చేస్తే వెనుకబడిన ప్రాంతాల పరిస్థితి ఏంటి?" అని ప్రశ్నించారు. అమరావతిని చంద్రబాబు అవినీతికి రాజధానిగా మార్చారని, ఇసుక, భూమి ఉచితంగా ఉన్నా అడుగుకు రూ. 16 వేలు ఖర్చు చూపి దోపిడీ చేస్తున్నారని విమర్శించారు.

### పవన్ కల్యాణ్‌పై విమర్శలు

గతంలో ప్రశ్నిస్తానన్న పవన్ కల్యాణ్, ఇప్పుడు చంద్రబాబుకు 'జాకీలు' ఎత్తుతున్నారని శ్రీకాంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, ఒక ఎమ్మెల్యే ఎస్పీ కార్యాలయంలోకి దూరి హల్‌చల్ చేసినా కనీసం కేసు పెట్టలేదంటే ఇది ఎలాంటి పరిపాలన అని నిలదీశారు. అనంతపురం జిల్లాలో హార్టికల్చర్ అభివృద్ధి వైఎస్ కుటుంబం వల్లే జరిగిందని, నేడు సీమ చెరువుల్లో నీళ్లు ఉన్నాయంటే దానికి కారణం వైఎస్సారేనని ఆయన కొనియాడారు.





# పారిశ్రామికవేత్తలుగా యువత ఎదగాలి

## రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

**అనంతపురం, సమయం న్యూస్ ప్రతినిధి :** యువత పారిశ్రామిక వేత్తలుగా ఎదిగి, మరింత మంది నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియ జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత పిలుపునిచ్చారు. ప్రతి ఇంటి నుంచి ఒకరిని పారిశ్రామికవేత్తగా తీర్చిదిద్దాలన్నది సీఎం చంద్రబాబు లక్ష్యమన్నారు. పరిశ్రమల స్థాపనకు ముందుకొచ్చే ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు తమ ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సహిస్తుందని తెలిపారు. నాగార్జున యూనివర్శిటీలోని డాక్టర్ హెచ్.హెచ్.డైక్ మన్ ఆడిటోరియంలో బుధవారం నిర్వహించిన ఎంఎస్ఎంఈ పార్కుల్లో ఈడబ్ల్యూఎస్ వర్గీయులకు అవకాశాలపై ఒకరోజు అవగాహన సదస్సులో మంత్రి పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రజల్వన చేసి, అనంతరం మంత్రి సవిత ప్రసంగించారు. ఎంఎస్ఎంఈ పార్కుల్లో చిన్న,మధ్యతరహా పరిశ్రమలకు ఏర్పాటుపె అగ్ర కులాల్లో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన ఈడబ్ల్యూఎస్ వర్గీయులకు అవగాహన సదస్సు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈడబ్ల్యూఎస్ వర్గీయులకు మేలు కలుగజేసేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఇంతకుముందు ప్రకృతి వ్యవసాయంతో ఎలా లాభాలు ఆర్జించ వచ్చో అవగాహన సదస్సు నిర్వహించారన్నారు. ఇప్పుడు ఉపాధి కల్పనపై మరో అవగాహన సదస్సు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈడబ్ల్యూఎస్ వర్గీయుల పేదరికాన్ని పారదోలడానికి కూటమి ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి ఇది నిదర్శనమన్నారు.

### ఎంఎస్ఎంఈ పార్కుల్లో ఈడబ్ల్యూఎస్ వర్గీయులకు పెద్దపీట

దేశ పారిశ్రామిక రంగంలో ఏపీని అగ్రగామిగా నిలబెట్టడానికి సీఏ చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ రేయింబవళ్లు కృషి చేస్తున్నారని మంత్రి సవిత వెల్లడించారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా 2029 నాటికి 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన కేవలం 22 నెలల కాలంలోనే ఏపీకి రూ.25 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజక వర్గాల్లోనూ ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ పార్కుల్లో పరిశ్రమలు ఏర్పాటు చేసే పెట్టుబడి దారులకు ప్రభుత్వం అన్ని విధాలా సహాయ సహకారాలు అందజేస్తోందన్నారు. తక్షణ అనుమతులకు చర్యలు తీసుకుంటోందన్నారు. ఎంఎస్ఎంఈ పార్కుల్లో చిన్న, మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటుకు ముందుకొచ్చే ఈడబ్ల్యూఎస్ సామాజిక వర్గీయులకు బీసీ సంక్షేమ శాఖ ద్వారా అండగా నిలుస్తామన్నారు. ఆసక్తి కలిగిన యువత డీపీఆర్ లతో ముందుకొస్తే, చిన్న,మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు సబ్సిడీ రుణాలు, ఉత్పత్తులపై అవగాహన కల్పిస్తామని మంత్రి సవిత తెలిపారు.

ప్రతి ఇంటి నుంచి ఒకరిని పారిశ్రామిక వేత్తగా తీర్చిదిద్దాలన్నది సీఎం చంద్రబాబు లక్ష్యమని మంత్రి సవిత తెలిపారు. ఇందులో భాగంగా నిర్వహిస్తున్న ఒక రోజు సదస్సును ఈడబ్ల్యూఎస్ సామాజిక వర్గానికి చెందిన యువత, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. యువతే భారత దేశ బలమని, వారి చేతుల్లోనే దేశ భవిష్యత్తు ఉందని అన్నారు. అందుకే సీఎం చంద్రబాబు అన్నింటా యువతకు ప్రాధాన్యమిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకుని పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలన్నారు. ఐఏఎస్, ఐపీఎస్ ల కంటే పారిశ్రామికవేత్తలుగా తోటి నిరుద్యోగులకు ఉపాధి కల్పించే అవకాశం కలుగుతుందన్నారు. పారిశ్రామిక వేత్తలు గా మహిళలు రాణిస్తే మరింత అభివృద్ధి సాధ్యమవుతుందని మంత్రి సవిత తెలిపారు. రాష్ట్ర ఈడబ్ల్యూఎస్ శాఖ ముఖ్య ప్రధాన కార్యదర్శి కె.సునీత మాట్లాడుతూ, అగ్ర కులాల్లో పేదరికంతో బాధపడే వారిని ఆర్థికంగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ సీఈవో ఎం.విశ్వ, వీసీ గంగాధర్ రావు, పలువురు కార్పొరేషన్ చైర్మన్లు బుచ్చి రాంప్రసాద్, బ్రహ్మం చౌదరి, డైరెక్టర్లు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, విద్యార్థులు, ఈడబ్ల్యూఎస్ సామాజిక వర్గీయులు తదితరులు పాల్గొన్నారు.

# 2కోట్ల హవాలా నగదు సీజ్



**అనంతపురం, సమయం న్యూస్ ప్రతినిధి :** విజయవాడలోని గుణదల ప్రాంతంలో భారీస్థాయిలో హవాలా నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఒడిశా నుంచి విజయవాడకు అక్రమంగా తరలిస్తున్న రూ. 2 కోట్లకు పైగా నగదును తనిఖీల్లో పట్టుకున్నారు. అనుమానాస్పదంగా వెళ్తున్న కారును ఆపి సోదా చేయగా ఈ అక్రమ డబ్బు వెలుగుచూసింది. ఈ ఘటనకు సంబంధించి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. నగదును IT శాఖాధికారులకు అప్పగించారు.

# ఏడు మోటార్లు సీజ్

**హైదరాబాద్, ఏప్రిల్ 8 (సమయం న్యూస్):** హైదరాబాద్ మహానగరానికి జలమండలి ఎంతో శ్రమించి సుదూర ప్రాంతాల నుంచి పైపులైన్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తోంది. అయితే కొందరు వినియోగదారులు తమ నల్లాలకు అక్రమంగా మోటార్లు బిగించడం వల్ల ఇతరులకు నీరు సరిగ్గా అందడం లేదు. ఇలాంటి చర్యల వల్ల నీటి పీడనం తగ్గిపోవడంతో సాధారణ వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో జలమండలి విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేపట్టి అక్రమంగా నీటిని తోడుతున్న మోటార్లను స్వాధీనం చేసుకుంటున్నారు. బుధవారం ఎస్ఆర్ నగర్ పరిధిలోని ఎస్ఆర్టీ కాలనీలో నల్లాలకు మోటార్లు బిగించి నీటిని లాగుతున్నట్లు అధికారులకు సమాచారం అందింది. దీంతో రంగంలోకి దిగిన విజిలెన్స్ బృందం నీటి సరఫరా సమయంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. పైపులైన్లకు నేరుగా విద్యుత్ మోటార్లు బిగించి నీటిని తోడుతున్న ఏడు మోటార్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇతరుల హక్కులకు భంగం కలిగించేలా ఇలాంటి పనులు చేయడం చట్టరీత్యా నేరమని వారు హెచ్చరించారు. నల్లాలకు మోటార్లు బిగిస్తే మొదటిసారి వాటిని సీజ్ చేస్తామని అధికారులు తెలిపారు. రెండోసారి కూడా అదే తప్పు చేస్తే ఐదు వేల రూపాయల జరిమానా విధించడంతో పాటు కేసులు నమోదు చేస్తామని వెల్లడించారు. తాగునీటి సరఫరాలో ఏవైనా సమస్యలు ఉంటే సంబంధిత మేనేజర్ లేదా డీజీఎం, జీఎం అధికారులను సంప్రదించాలని కోరారు. అలాగే జలమండలి కస్టమర్ కేర్ నంబరు 155313 కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. వినియోగదారులందరూ నిబంధనలు పాటించాలని జలమండలి విజ్ఞప్తి చేసింది.

# దోమల నియంత్రణలో ప్రభుత్వం విఫలం

- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి
- యువనేత చంద్రశేఖర్ రెడ్డి సేవా స్ఫూర్తి
- సొంత నిధులతో ఫాగింగ్ యంత్రాల కొనుగోలు



**హైదరాబాద్, ఏప్రిల్ 8 (మనసులో మాట):** ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా యువనేత చంద్రశేఖర్ రెడ్డి మరోసారి తన సేవా స్ఫూర్తిని చాటుకున్నారు. ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి సూచనల మేరకు "దోమలపై యుద్ధం" కార్యక్రమంలో భాగంగా చైతన్యపురి డివిజన్ యువ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి రెండు ఫాగింగ్ యంత్రాలు కొనుగోలు చేశారు. వీటిని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ దోమల నియంత్రణలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ప్రభుత్వం ఇప్పటికైనా ప్రజారోగ్యంపై దృష్టి పెట్టి దోమల నివారణకు కృషి చేయాలని కోరారు.

### సొంత నిధులతో ప్రజా సేవ

చైతన్యపురి డివిజన్ ప్రజలు ఫాగింగ్ లేక ఇబ్బందులు పడుతున్నారని, అందుకే ఎమ్మెల్యే పిలుపుతో సొంత నిధులతో ఈ యంత్రాలను కొనుగోలు చేసినట్లు చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. నేటి నుంచి సాయంత్రం వేళల్లో నిరవధికంగా ఫాగింగ్ కొనసాగుతుందని వివరించారు. ప్రభుత్వం కూడా మరిన్ని యంత్రాలు కొనుగోలు చేసి ప్రజలను దోమల బెడద నుంచి కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో చైతన్యపురి డివిజన్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు తోట మహేష్ యాదవ్, శివ ప్రకాష్, లక్ష్మీ నారాయణ గౌడ్, విశ్వప్రేమ్, శ్రీహరి, తులసి కృష్ణ గౌడ్, జలంధర్, పులి కిరణ్, సాయి, నరేష్, గణేష్, శ్రీధర్, అఖిల్, రాజు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# సొంత గ్రామంపై 'ఇన్ఫినిటీ' మమకారం

- నియోజకవర్గ స్థాయి టోర్నీని ప్రారంభించిన ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బద్దేనాయక్



**అనంతపురం, సమయం న్యూస్ ప్రతినిధి :** కంబదూరు: గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల నైపుణ్యాన్ని వెలికితీసేందుకు క్రీడలు ఎంతో దోహదపడతాయని ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బద్దేనాయక్ అన్నారు. కంబదూరు మండలం పి.వెంకటాంపల్లి గ్రామ పెద్దలు మరియు యువత ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నియోజకవర్గ స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన బుధవారం ఘనంగా ప్రారంభించారు. సొంత ఊరిపై మమకారం.. క్రికెట్ టోర్నమెంట్ మొత్తం ఖర్చు తానే తీసుకున్న బద్దే నాయక్ పి.వెంకటాంపల్లి తన సొంత గ్రామం కావడంతో, యువత క్రీడల పట్ల చూపుతున్న ఆసక్తిని ప్రోత్సహిస్తూ బద్దేనాయక్ టోర్నమెంట్‌కు పూర్తి స్పాన్సర్‌గా వ్యవహరిస్తున్నారు. క్రీడాకారులకు అవసరమైన వసతులతో పాటు భారీ ప్రైస్ మనీని కూడా ఆయనే సమకూర్చడం పట్ల క్రీడాకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 45 జట్లు.. భారీ బహుమతులు ఈ నియోజకవర్గ స్థాయి పోటీలకు విశేష స్పందన లభించింది. మొత్తం 45 జట్లు ఈ టోర్నీలో తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నాయి. గ్రామ వీధులన్నీ క్రికెట్ సందడితో కళకళలాడుతుండగా, యువత ఉత్సాహంగా పోటీల్లో పాల్గొంటున్నారు. విజేత రూ. 30,000 నగదు బహుమతి మరియు ఆకర్షణీయమైన కప్ రన్నర్ రూ. 20,000 నగదు బహుమతి మరియు కప్ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు క్రీడల ప్రారంభోత్సవ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువత ప్రతినిధులు మల్లికార్జున, రామలింగప్ప, రాజు, శివ, ప్రసాద్ రెడ్డి, తిమ్మానాయక్, ఉపేంద్ర రెడ్డితో పాటు ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు అబ్దుల్ వాహబ్, చిరంజీవి మరియు అధిక సంఖ్యలో గ్రామస్థులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.


# మాడభూషణం గారికి ఇది భూషణమా?

> "ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధానిగా అమరావతి ఉండాలంటూ రాష్ట్ర శాసనసభ తీర్మానం చేసి కేంద్రానికి పంపి అక్కడ ఉభయసభల్లోనూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునఃవిభజన చట్టం 2014 సెక్షన్ 5 సబ్ సెక్షన్ 2 ని సవరిస్తూ ఆమోదింపచేసి రాష్ట్రపతి గారి అంగీకారంతో నోటిఫికేషన్ విడుదలై రాష్ట్ర ప్రజలు ఆనందంగా ఉంటే కొంతమంది మేధావులమని చలామణి అవుతున్న వాళ్లు తమ రోత రాతలతో పొంతన లేని వాదనలతో తమ అక్కసును వెళ్లగక్కటం దురదృష్టకరం."

ప్రొఫెసర్ మాడభూషణం శ్రీధర్ ఆచార్యులు గారు అమరావతి రాజధాని గురించి రాసిన తన వ్యాసంలో తొలుత వికేంద్రీకరణ ఉత్తమమని హైదరాబాద్ కేంద్రీకృత అభివృద్ధి నష్టదాయకమని జగన్ ప్రతిపాదించిన మూడు ప్రాంతాలలో మూడు రాజధానులు మంచి ప్రతిపాదన అంటూనే చివరగా జగన్మోహన్ రెడ్డి గారు ఇటీవల ప్రతిపాదించిన "మావిగన్" కి జై కొట్టారు. అంటే జగన్మోహన్ రెడ్డి గారు చెప్పిన దానికల్లా తానా తందానా అంటం తప్పితే శ్రీధర్ గారికి స్వతంత్ర అభిప్రాయాలు లేకపోవడం వారు రాసిన వ్యాసం వెనక దురుద్దేశాన్ని బట్టబయలు చేస్తోంది. అభివృద్ధి వికేంద్రీకరణ ఉత్తమం అయినప్పుడు మరి మీ రాష్ట్రంలో మీ ముఖ్యమంత్రి హైదరాబాద్ అభివృద్ధి సరిపోతున్నట్లుగా మరో ఫ్యూచర్ సిటీ కడతాను అంటూ ఉవిర్లూర్తుంటే మీరు ఎందుకు మౌనంగా ఉంటున్నారు..?? ఆ కట్టేదేదో వరంగల్లోనూ లేక ఖమ్మంలోనూ కట్టవచ్చు కదా అంటూ సలహాలు ఎందుకు ఇవ్వటం లేదు..??

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి 12 ఏళ్లుగా రాజధాని లేక పోవడం రాజధాని ఏంటో తేలకపోటం వైఫల్యం కాదా అని ఎత్తి పొడుస్తున్న మీరు దానికి కారకులైన జగన్మోహన్ రెడ్డి గారి వ్యవహార శైలి ఎందుకు తప్పు పట్టలేదు మీ వ్యాసంలో. 2019 ఎన్నికలకు ముందు అమరావతికి కట్టుబడి ఉన్నాను అద్భుతంగా నిర్మిస్తాను అని మాటిచ్చి ముఖ్యమంత్రి అయిన వ్యక్తి మాటతప్పి మడము తిప్పి మూడు రాజధానులు అంటూ రాష్ట్రానికి ఏ రాజధాని లేకుండా చేయటానికి మీరు ఎందుకు తప్పు పట్టలేదు...??

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని కోసం ఢిల్లీ చక్రవర్తి దగ్గర ఒంగి సలాములు కొడుతున్నారు అని అడుగుతున్న మీరు మరి ఏపీ పునర్విభజన చట్టాన్ని తీసుకొచ్చి రాష్ట్రాన్ని విభజించిన మహారాణి గురించి మరిచారే..?? ఆ మహారాణి మీకు కేంద్ర సమాచార శాఖ కమిషనర్ పదవి ఇచ్చారు కదా... మీరెందుకు మాట్లాడుతారు లెండి..!!




ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం 2014 చేసింది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కాదు పార్లమెంట్ అన్న విషయం మీరు మరిచారా..?? ప్రజాస్వామ్య వ్యవస్థలో పార్లమెంట్ సుప్రీమ్ అన్న విషయం మీకు తెలియదా..?? పార్లమెంటులో చేసిన చట్టాలలో మార్పులు చేయాలంటే పార్లమెంట్ లోని చేయాలన్న విషయం లా విద్యను బోధిస్తున్న మీకు తెలియదా..?? ఏపీ పునర్విభజన చట్టం 2014 సెక్షన్ 5లో 10 సంవత్సరాల పాటు తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలకి హైదరాబాది ఉమ్మడి కాపిటల్ గా ఉంటుందని, ఆ తర్వాత తెలంగాణ రాష్ట్రానికి హైదరాబాద్ రాజధానిగా కొనసాగుతుందని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కొత్త రాజధాని నిర్మాణం చేసుకుంటుందని ఉన్నది. ఇప్పుడు చెప్పండి ప్రొఫెసర్ గారు రాజధాని గురించి పార్లమెంట్ చేసిన చట్టంలో ఎందుకుంది..?? తెలంగాణకి హైదరాబాద్ క్యాపిటల్ గా ఉంటుందా లేక వరంగల్ ఉంటుందా లేక కరీంనగర్ ఉంటుందా అని చెప్పటానికి పార్లమెంట్ ఎవరని మీరు ఎందుకు అడగలేదు...?? ఆ స్థానంలో సవరించి ఆంధ్రప్రదేశ్ నూతన రాజధాని అమరావతి అని చేర్చితే మీకు దాంట్లో తప్పు ఎందుకు కనపడుతుంది..?? హైదరాబాద్ రాజధాని అని ఉంటే మీకు తప్పుగా కనపడినప్పుడు అమరావతి రాజధాని అని ఉంటే మీకు తప్పుగా ఎందుకు కనపడుతోంది...?? ఆశ్రిత పక్షపాతమా లేక దృష్టి లోపమా...??

రైతుల పచ్చని పొలాల స్థానంలో భవనాలు నిర్మించడాన్ని తప్పుపడుతున్న మీరు మరి ఏ నగర నిర్మాణం గానీ విస్తీర్ణం గాని రైతుల పొలాలు తీసుకోకుండా జరుగుతుందా? హైదరాబాద్ మీ స్వగ్రామం వరంగల్ మీరు ఎంతగానో మెచ్చుకుంటున్న 3 రాజధానులు ఇప్పుడు కొత్తగా మెచ్చుకుంటున్న మావిగన్.. వీటి నూతన నిర్మాణం రైతుల పొలాలు తీసుకోకుండానే జరుగుతుందా...??

తెలంగాణ నూతన సెక్రటేరియట్ 10 లక్షల చదరపు అడుగులతో నిర్మిస్తే ఆంధ్రప్రదేశ్ సెక్రటేరియట్ 52 లక్షల చదరపు అడుగులు ఎందుకని అడుగుతున్నా మీరు... అరకొర సమాచారంతో వ్యాసం రాశారని చెప్పక తప్పదు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కడుతుంది కేవలం సెక్రటేరియట్ కాదు హెచ్వోడీలు జిఏడి భవనాలు కూడా అని మీకు తెలవక పోవటం దురదృష్టం. జగన్మోహన్ రెడ్డి గారు తన పరిపాలన సమయంలో విశాఖ ఋషికొండపై నిర్మించిన రిషికొండ ప్యాలెస్ కి చదరపు గడుగు 35 వేల రూపాయలు వెచ్చించారు... కానీ ఇప్పుడు అమరావతిలో నిర్మాణం అవుతున్నటువంటి భవనాల ఖర్చు చదరపు అడుగు 7000 మాత్రమే అని మీకు తెలియదా..??

కేవలం అర్ధసత్యాలతో మనకి అనుకూలముగా ఉన్నటువంటి వాదనలు విషయాలు ఎంచుకుంటూ కూర్పు చేసుకుంటూ మీరు రాసిన వ్యాసం మిమ్మల్ని ప్రేరేపించిన పెద్దలు సంతోషించవచ్చు గాని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలు చీత్కరించుకుంటున్నారు అన్న విషయాన్ని మీరు గుర్తు పెట్టుకోండి.

**పెద్దిరెడ్డి రవికిరణ్**
బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి, ఆంధ్ర ప్రదేశ్

